ప్రజలే ప్రభువులు

# జనబలం

మార్చి 2022 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## సమతా విగ్రహం.. రాజ్యాంగ కర్తవ్యం



## కోట్ల బతుకుల్ని బాగు చేసే అద్భుతావకాశం.. ఈ సమగ్ర ఆరోగ్య విధానం




## రాజ్యాంగంపై రచ్చ - చర్చ



## భారత్ ఆర్థిక, ప్రత్యామ్నాయ ఇంధన శక్తిగా ఎదగాలి




# సమగ్ర ఆరోగ్య విధానం అమలుకి తెలంగాణ ప్రభుత్వం నాంది పలకాలి



కేవలం అనారోగ్యం కారణంగా మన దేశంలో ఏటా సుమారు 6 కోట్ల మంది ప్రజలు అప్పటిదాకా పేదలు కానివారు పేదరికంలోకి జారిపోతున్నారని, తెలంగాణలో 19 లక్షల మంది అలా పేదలుగా మారుతున్నారని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు హైదరాబాద్‌లో అన్నారు. మన ఆరోగ్య వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో కొవిడ్ మహమ్మారి స్పష్టంగా రుజువు చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో నాణ్యమైన వైద్యం అందించే సమగ్ర ఆరోగ్య విధానాన్ని లోక్‌సత్తా రూపొందించిందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ఖజానాపై కూడా పెద్ద భారం పడదని, ఏడాదికి కేవలం రూ.1900 కోట్లు మాత్రమే అదనంగా అవుతుందని, అది కూడా దశలవారీగా కేటాయించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్‌లో ఈ కేటాయింపులు చేయాలన్నారు. లోక్‌సత్తా విధానంలో ఖర్చు తక్కువ కావటంతోపాటు ప్రతి రూపాయీ సద్వినియోగమయ్యేలా నిర్దిష్ట ఏర్పాట్లున్నాయన్నారు. లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం (Towards Viable Universal Healthcare)వివరాలతో తెలుగులో సంక్షిప్తంగా రూపొందించిన చిన్న పుస్తకాన్ని, కరపత్రాన్ని శ్రీనివాసు ఆవిష్కరించారు. ఈ ఆరోగ్య విధానాన్ని వివిధ రూపాల్లో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తామని, రాజకీయ పార్టీల నేతల్ని, ప్రజాప్రతినిధుల్ని కలిసి మద్దతు కోరతామని తెలిపారు. అనంతరం ప్రచార బృందం కన్వీనర్‌గా జెట్టె రవి, కో-కన్వీనర్‌గా ఎ.కె లత, సభ్యులుగా సరోజాదేవి, పి.మాధవరెడ్డి, టి.రంగాచారి, బి.రామచంద్రుడు, రావెళ్ల రవి, కె.శ్రీనివాస గౌడ్, మోతె రాజలింగు, సూర రాజేష్, సూర్యలక్ష్మి, వంశీప్రసాద్ నియమితులైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ టీఎస్ ఉపాధ్యక్షులు నందిపేట రవీందర్, శ్రీమతి గజానని, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస వర్మ, కార్యదర్శులు మల్లాది కిషోర్, వైజీవి అధ్యక్షుడు బొర్రా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతోనే ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం

తెలుగు రాష్ట్రాల్లోని, దేశంలోని ప్రజలందరికీ జేబులో నుండి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందాలంటే లోక్‌సత్తా ప్రతిపాదించిన సమగ్ర ఆరోగ్య విధానం అమలవ్వాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, ఆర్టీఐ రక్షణ వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పర్చా కోదండ రామారావు, జ్వాల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుంకరి ప్రశాంత్, సామాజిక రచయితల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కామడి సతీష్ రెడ్డితో కలసి అందరికీ ఆరోగ్యం వివరాల పత్రాన్ని ఆయన హనుమకొండ, పరకాలల్లో ఆవిష్కరించారు. గత 70 ఏళ్లుగా బ్రిటన్‌లో అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని మన దేశ పరిస్థితులకనుగుణంగా మార్చి, మన బడ్జెట్‌లోనే ప్రభుత్వ, ప్రయివేటు సంయుక్త భాగస్వామ్యంతో అందించే విధంగా లోక్‌సత్తా రూపొందించిందని వారన్నారు. సామాన్య ప్రజలు ఇప్పుడు చిన్న చిన్న జబ్బులకు కూడా పెద్ద పెద్ద ఆస్పత్రులకు వెళ్లి ఒళ్లు, ఇల్లు గుల్ల చేసుకుంటున్నారని, లోక్‌సత్తా విధానం అమలైతే ఆ దుస్థితి ఉండదన్నారు. ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్మోహన్ రెడ్డిలకు లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య విధానం పత్రాన్ని పంపించామన్నారు. ప్రభుత్వాలు పరిశీలించి అమలు చేయాలని కోరారు. నాణ్యమైన ఆరోగ్యం, విద్యలను అందించటం తమ ప్రాథమిక బాధ్యతని ప్రభుత్వాలు ఇప్పటికైనా గుర్తించాలన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 03

మార్చి 2022

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




మన దేశంలో మాత్రం ఎన్నికలున్నప్పుడు తగ్గుతాయి.. ఎన్నికలైపోగానే పెరుగుతాయి..!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# అమరావతి అభివృద్ధి సరే!
# వికేంద్రీకరణ మాటేమిటి?

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పిటిషన్లపై మార్చి 3వ తేదీన హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. సి.ఆర్.డి.ఎ రద్దు చట్టాన్నీ, పాలనా వికేంద్రీకరణ చట్టాల్నీ సవాలు చేస్తూ అమరావతి ప్రాంత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై అనేక ప్రజాహిత వ్యాజ్యాలు కూడా దాఖలయ్యాయి. వాటన్నిటినీ కలిపి విచారించిన ధర్మాసనం 307 పేజీల తీర్పును వెలువరించింది.

అమరావతి రాజధాని నగరాన్ని నిర్మించి, రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, సమీకరణ చేసిన భూమిని వేరే అవసరాలకి వినియోగించడం, తనఖాపెట్టడం, తృతీయ పక్ష ప్రయోజనాన్ని సృష్టించడం వంటివి చేయరాదని, అమరావతి రాజధాని నగరంలో, రాజధాని ప్రాంతంలో తలపెట్టిన అభివృద్ధి కొనసాగించాలని, రహదారుల, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పన ఆరు నెలల్లో పూర్తి చేయాలని ధర్మాసనం తన తీర్పులో ఆదేశించింది.

రాజధాని అభివృద్ధి ప్రాంత పట్టణాభివృద్ధి ప్రణాళికలోని పథకాలన్నిటినీ పూర్తి చేయాలని, భూ సమీకరణ సందర్భంగా రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం అమరావతి రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో నిర్మించి అభివృద్ధి చేయాలని తీర్పులో ఆదేశించింది. భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన స్థలాలకు రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటివి ఏర్పాటు చేసి, వాటిని ఆవాసయోగ్యమైన స్థలాలుగా అభివృద్ధి చేసి అప్పగించాలని తీర్పు స్పష్టం చేసింది. అభివృద్ధి చేసిన స్థలాలను భూ యజమానులకు ఉత్తర్వులు వెలువడ్డ మూడు నెలలలోగా అప్పగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తమ ఆదేశాల అమలుపై, అమరావతి అభివృద్ధిపై జరుగుతున్న పురోగతిని హైకోర్టుకు నివేదించాలని హైకోర్టు ప్రభుత్వాన్నీ, సీఆర్డీఏనూ ఆదేశించింది. తమ ముందు విచారణకు వచ్చిన పిటిషన్లను మూసివేయకుండా 'కంటిన్యూయస్ రిట్ ఆఫ్ మాండమస్' కొనసాగుతోందని హైకోర్టు స్పష్టం చేసింది.

పిటిషనర్లకు ఒక్కొక్కరికీ 50 వేల రూపాయలను ఖర్చుల కింద చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది. తీర్పు అమలును నిరంతరం పరిశీలిస్తామని, అవసరమైతే మరిన్ని ఆదేశాలు జారీ చేస్తామని కూడా హైకోర్టు స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానించింది. అప్పటి అధికార, ప్రతిపక్షాల ఏకాభిప్రాయంతోనే రాజధాని ప్రాంతం ఖరారయ్యింది.

రాజధాని కోసం భూసేకరణ పద్ధతి కాకుండా భూసమీకరణ పద్ధతిని ఎంచుకుని 34 వేల ఎకరాల భూమిని సమీకరించారు. రాజధాని అభివృద్ధి ప్రాంత అభివృద్ధి సంస్థను చట్టబద్ధంగా ఏర్పాటు చేశారు. రైతులందరికీ అభివృద్ధి పరిచిన స్థలాలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. రాజధాని నగర నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ భవనాలు, హైకోర్టు, శాసనసభ, నివాస గృహాలు వంటివి నిర్మించారు. ప్రధాన రహదార్లు ఏర్పాటు చేశారు. 15 వేల కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయి. మరో 30 వేల కోట్ల రూపాయల పనులకు ఆమోదం తెలిపి ప్రారంభించారు.

అయితే 2019లో ప్రభుత్వం మారింది. పాలనా వికేంద్రీకరణ పేరుతో వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చింది. సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసింది. అమరావతి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దాంతో భూ సమీకరణకు తమ విలువైన భూములు ఇచ్చిన రైతులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర రాజకీయ చర్చలో అమరావతి అంశం ఒక చర్చనీయాంశంగా మారింది. రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పుతో కొన్ని కీలక అంశాలలో స్పష్టత వచ్చిందని చెప్పవచ్చు.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాజధాని ఏర్పడింది కాబట్టి దానిపై నిర్ణయం తీసుకునే అధికారం పార్లమెంటుకే ఉంటుందనీ, రాజధాని ఒకటే ఉంటుంది తప్ప మూడు రాజధానులు ఏర్పాటు చేస్తూ నిర్ణయం చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదని హైకోర్టు తేల్చింది. గత మూడేళ్లుగా దీనిపై జరుగుతున్న చర్చకు హైకోర్టు తీర్పుతో ముగింపు పలకాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల ఆలోచనలు వివాదాన్ని సుప్రీంకు నివేదించే రీతిలో కన్పిస్తున్నాయి.

అయితే పాలనా వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ అంశాలను రాజధాని నిర్మాణంతో ముడిపెట్టి చేసే వాదనలు అసంగతంగా ఉన్నాయి. మూడు ప్రాంతాలలో రాజధానులు ఏర్పాటు చేస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని సాగించే వాదనలు ప్రచారం కోసం మాత్రమే పనికివస్తాయి.

పాలనా రాజధాని విశాఖకు తరలిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న మాట ఉత్తమాట మాత్రమే! కర్నూలులో న్యాయరాజధాని వస్తే రాయలసీమ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో పాలక పెద్దలు వివరించలేక తడబడుతున్నారు. అమరావతిలో శాసనరాజధాని ఉంటుందన్న వాదన కూడా సమంజసంగా లేదు. శాసన/కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు మూడూ ఒకేచోట ఉంటేనే రాజధానిగా పరిగణించాల్సి ఉంటుందని హైకోర్టు పేర్కొన్నది. దీనిపై హైకోర్టు ధర్మాసనం చేసిన చర్చ కూడా అంతా రాజ్యాంగం చెప్పకుండా మౌనం పాటించిన సందర్భాల్లో చట్టాన్ని, శాసనాన్ని అనువర్తింప చేయడం కోసం కోర్టు వినియోగించే విచక్షణాధికారంలోని సమంజసత్వం చుట్టూ సుదీర్ఘంగా సాగింది.

నిజమైన వికేంద్రీకరణ అంటే ఏమిటో వివరించే చర్చ రావడం లేదు. గ్రామ పంచాయితీలను, మండల, జిల్లా పరిషత్తులను, మునిసిపల్ పాలక వర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ప్రభుత్వ నిర్వాకంపై చర్చ జరగాల్సి ఉంది. నిధులను విడుదల చేయకుండా స్థానిక ప్రభుత్వాల అస్థిత్వాన్ని నీరు కారుస్తూ వికేంద్రీకరణ గురించి ఎంత మాట్లాడినా ప్రయోజనం లేదు.

రాజధానిగా ఒక మహానగరాన్ని అభివృద్ధి చేయడం అవసరమే! అదే సమయంలో పాలనా వికేంద్రీకరణ కోసం కొన్ని కొన్ని శాఖలను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడమూ అంతే అవసరం. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు ఇవ్వడమూ అత్యంత కీలకం. హైకోర్టు తీర్పు నేపథ్యంలోనయినా నిజమైన వికేంద్రీకరణ గురించి పాలక, ప్రతిపక్షాలు మాట్లాడటం అవసరం.

డి. సోమసుందర్



# కరోనా విలయాన్ని చూశాకైనా..

## లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం అమలు సాధించుకోలేమా?




కరోనా మన దేశానికి, మన ప్రాంతానికి రాత్రికి రాత్రి రాలేదు
చుట్టూ ఉన్న చాలా ప్రపంచంలో వచ్చాకే,
మనకూ వస్తుందని తెలిశాకే మనకొచ్చింది
ఆ దేశాల్లో ఏం జరుగుతోందో, వాళ్లు ఎలా ఎదుర్కొంటున్నారో ఎంతోకొంత తెలిశాకే వచ్చింది
అయినా మనం పాత పద్ధతిలోనే స్పందించాం
మంత్రాలకు చింతకాయలు రాలవని, మన పురుష అభిజాత్యానికి వైరస్ లొంగదని
చేతులు కాలాకే కొంత తెలిసొచ్చింది
కానీ తాత్కాలిక ఉపశమనం కలగ్గానే మళ్లీ మూస రాజకీయంలోకి వెళ్లిపోయాం
లాక్‌డౌన్ నష్టాల్ని, ఆరోగ్య వ్యవస్థ వైఫల్యాన్ని చూశాక కూడా మనలో పాత వాసనలు పోలేదు
దీంతో డెల్టా వేవ్ కుదిపేసింది, లక్షలమంది అకాల మరణాల పాలయ్యారు
మన కంటే ఎక్కువగా కొవిడ్ దెబ్బకు గురైన దేశాలు కూడా మన కంటే మెరుగ్గా మహమ్మారిని ఎదుర్కొన్నాయి
ఒకే ఒక్క ప్రధాన కారణం- ఆ దేశాల్లో ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం
డెల్టా దెబ్బకు మళ్లీ మన పూనకాలు దిగాయి
ఈసారి సీరియస్‌గా దృష్టి పెట్టాం
మనకున్న వనరుల్ని సద్వినియోగం చేసేందుకు గట్టిగా కృషి చేశాం
జేపీలాంటి వారి మాటల్ని ఆలస్యంగానైనా ఆలకించి వ్యాక్సిన్ల తయారీకి కేటాయింపులు చేశాం
మొత్తంగా ఆరోగ్యం సమాజం డిమాండ్‌గా మారింది
ఈ నేపథ్యంలోనే, కొవిడ్ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా ఒక సమగ్ర ఆరోగ్య విధానాన్ని రూపొందించింది
ప్రజలకు జేబుఖర్చు లేకుండా, ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే విధానమిది
ఇందులో ప్రతి ఇంటికీ ఒక ఫ్యామిలీ డాక్టర్ ఉంటారు, ఇంటిల్లిపాది ఆరోగ్యానికీ బాధ్యత తీసుకుంటారు
వైద్య పరీక్షలు, మందులు అన్నీ ఉచితం
పైన ఆస్పత్రి చికిత్సకు వెళ్లాలన్నా ఫ్యామిలీ డాక్టరే చూసుకుంటారు
ప్రభుత్వం చెప్పిన డాక్టర్‌నే ఎంచుకోనక్కర్లేదు, మనకు నచ్చిన, మంచి సేవలందించే వైద్యుని ఫ్యామిలీ డాక్టర్‌గా ఎంచుకోవచ్చు
పోటీ, ఎంపిక అవకాశాలతో నాణ్యమైన సేవలకు భరోసా ఇచ్చే విధానమిది
ద్వితీయ స్థాయిలో నర్సింగ్ హోంలు, ఆరోగ్యశ్రీ .. తృతీయ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులకొచ్చి ప్రయివేటు వైద్యుల ప్రాక్టీస్ వంటి వినూత్న ఏర్పాట్లు ఇందులో ఉన్నాయి
విధానం అమలుకయ్యే అదనపు ఖర్చు జాతీయాదాయంలో ఏటా కేవలం 0.4%. తెలంగాణకు రూ.1900 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కి రూ.,2600 కోట్లు
ఇంత తక్కువ ఖర్చుతో, ఇన్ని కోట్ల మందికి, ఇంత మేలు చేసే కార్యక్రమం ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రంగంలోనూ లేదు
అమలు సాధించి ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం, భవిష్యత్ తరాలకూ భరోసానిద్దాం

# సామాన్య జనాలకు ప్రశ్నించడం నేర్పిండు

## - మంగారి రాజేందర్, రిటైర్డ్ జిల్లా, సెషన్స్ జడ్జి

**ఏడాది కాలం క్షణంలో జరిగిపోయినట్టు అనిపిస్తోంది. కానీ నరెడ్ల శ్రీనివాస్ మిగిల్చిన శూన్యం ఇంకా అలాగే ఉంది. కరోనా ఎంతోమందిని నిర్దాక్షిణ్యంగా తనతోపాటు తీసుకుపోయింది. వారిలో నరెడ్ల శ్రీనివాస్ కూడా ఒకరు. శ్రీనివాస్ వామపక్ష భావజాలం నుంచి వచ్చిన వ్యక్తి. అందుకే ప్రపంచం మొత్తం మారాలని అతనేమీ ఆశించలేదు. కానీ దేశంలో ఉన్న చట్టాలు, శాసనాలు ఏ రకంగా వాడుకోవచ్చునో అందరికీ తెలియచెప్పారు. చట్టాలు ఏవీ పనికిరావని ఆయన అనుకోలేదు. ఉన్న చట్టాలతో సామాన్యులకు ఏ విధంగా సహాయం చేయవచ్చు అన్న విషయాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. ఆ దిశగా తన ప్రయత్నాలను తుదివరకు కొనసాగించారు. అది వినియోగదారుల రక్షణ చట్టం కావచ్చు.. సమాచార హక్కు చట్టం కావచ్చు.. అవినీతి నిరోధక చట్టం కావచ్చు.. చట్టాన్ని ఉపయోగించి సామాన్యులకు న్యాయం చేయాలని సంకల్పించిన వ్యక్తి నరెడ్ల శ్రీనివాస్.**



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామంలో ఓ పేద కుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ విద్యార్థి దశలోనే ప్రగతిశీల భావాలతో ప్రేరేపితం అయ్యారు. 1972-73 ప్రాంతంలో మిత్రులతో కలిసి ఒక సాహితీ సంస్థను ప్రారంభించి శ్రీశ్రీని రప్పించి ఊరేగించిన వ్యక్తులలో ఆయన కూడా ఒకరు. ఆయన చదువంతా కరీంనగర్‌లోనే సాగింది. డిగ్రీ చదువు పూర్తిచేసిన తర్వాత సివిల్స్ రాద్దామని అనుకున్నంతలోనే యూనియన్ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. బ్యాంకులో వచ్చిన ప్రమోషన్ కారణంగా గుజరాత్ వెళ్లి అక్కడ ఉధృతంగా జరుగుతున్న ఉద్యమ స్ఫూర్తిని గమనించారు. కరీంనగర్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఆ ఉద్యమాన్ని ఇక్కడ కూడా చేపట్టారు. వినియోగదారుల రక్షణ చట్టం దేశంలోకి రావడానికి ముందే కరీంనగర్‌లో వినియోగదారుల కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఈ కౌన్సిల్ ద్వారా దాదాపు పదివేల కేసులను పరిష్కరించారు. రూ.25 కోట్ల మేరకు నష్టపరిహారాలను సామాన్యులకు ఇప్పించారు. కరీంనగర్‌లోనే కాకుండా స్టేట్ కమిషన్లు, జాతీయ కమిషన్లలో కూడా కేసులను బాధితుల తరపున వేస్తూ ముందుకు సాగారు. అమల్లో ఉన్న చట్టాలైన వినియోగదారుల రక్షణ చట్టం, సమాచార హక్కు చట్టాన్ని, అవినీతి నిరోధక చట్టాన్ని ఆధారం చేసుకొని న్యాయపోరాటం చేసి, జనంతో శెభాష్ అనిపించుకున్నారు.

**కోటి ఉత్తరాల కార్యక్రమం..**

సమాచార హక్కు చట్టం వల్ల అవినీతి తగ్గుముఖం పడుతుందని భావించి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని కరీంనగర్‌లో చేపట్టారు. మొదటి ఉత్తరాన్ని డాక్టర్ నాగభూషణంతో రాయించారు. డాక్టర్ కాని వాడు డాక్టర్‌గా చలామణి కావడాన్ని వ్యతిరేకించారు. కార్పొరేట్ వైద్య సంస్థలు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు స్వాగతం చెబుతూ బ్యానర్లు పెడితే ఆ పద్ధతిని విమర్శించారు. వాళ్లు సమాజానికి చేస్తున్న మోసాన్ని బహిర్గతం చేశారు. కార్పొరేట్ వైద్య సంస్థల దుర్మార్గాలను ఎండగట్టారు. ఎంతోమంది బోగస్‌గా గౌరవ డాక్టరేట్ డిగ్రీ పెట్టుకోవటం చూసి, యూజీసీ నుంచి వివరణ తెప్పించుకొని అలాంటి వ్యక్తులను తన చర్యల ద్వారా నిరోధించారు. అదే విధంగా వినియోగదారుల రక్షణ చట్టం నుంచి డాక్టర్లను తొలగించే కుట్రను గట్టిగా వ్యతిరేకించారు.

**చెప్పడమే కాదు.. ఆచరణలో పెట్టారు**

ఏదైనా చెప్పడం వేరు.. దానిని ఆచరణలో పెట్టడం వేరు. హైదరాబాద్ లాంటి మహానగరంలో ఉంటూ ఎవరైనా ఎవరినైనా విమర్శించవచ్చు. కానీ కరీంనగర్‌లాంటి చిన్న టౌన్‌లో ఉంటూ అవినీతికి వ్యతిరేకంగా పోరాడటం మాత్రం శ్రీనివాస్‌కే చెల్లింది. అన్యాయం ఎక్కడ జరిగినా ఎదిరించారు. ప్రజల్లో మార్పు కోసం జీవితం చివరి వరకూ కృషి చేశారు. జీవితాంతం సామాన్యునికి అండగా నిలిచారు. అమల్లో ఉన్న చట్టాలతో ప్రజలకు ఏ విధంగా మేలు చేయవచ్చో, వాటిని ఏ విధంగా ఆయుధాలుగా మలుచుకోవచ్చో అందరికీ చేసి చూపించారు. తన చర్యల ద్వారా ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఏఎస్ఐ మోహన్‌రెడ్డి బాధితులను ఐక్యం చేసి వారికి న్యాయం జరిగే విధంగా పోరాటం చేశారు.

## సామాన్యులకు శ్రీనన్నగా..

**యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శ్రీనివాస్ పనిచేసినప్పుడు అవసరమున్న ఎంతోమందికి లోన్లు ఇప్పించి సహకరించారు. కరీంనగర్ జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లకుండా శ్రీనివాస్ దగ్గరికి వెళ్లేవాళ్లంటే అతిశయోక్తి కాదు. మోహన్‌రెడ్డి దగ్గర నుంచి సామాన్యుల ఆస్తిపాస్తులను కాపాడుకునేలా చేయడానికి ఎంతగానో కృషి చేసిన ధైర్యశాలి శ్రీనివాస్. ప్రభుత్వ ఆఫీసుల్లో తలెత్తుతున్న సమస్యలను తీర్చుకోవడానికి ప్రజలు నేరుగా లోక్‌సత్తా కార్యాలయం వైపు పరుగులు తీసేవారు. శ్రీనివాస్ ఇస్తున్న చేయూత వారిని ఆ విధంగా పరుగులు పెట్టించేది. ఆయన చేసిన కృషి వల్లే మోహన్‌రెడ్డిపై అవినీతి నిరోధక శాఖ తమ దర్యాప్తు మొదలుపెట్టింది. తన ఆఫీసుకు వచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా వినడం, వాటి పరిష్కారం కోసం ఏ అధికారి దగ్గరికి వెళ్లాలో సూచించడమే కాదు ఎలాంటి దరఖాస్తులు ఇవ్వాలి, ఎలాంటి ఫిర్యాదు ఇవ్వాలి అన్న విషయంలో అందరికీ మార్గదర్శకత్వం చేసిన వ్యక్తి ఆయన. అవసరమైన వ్యక్తులకు దరఖాస్తులను, ఫిర్యాదులను కూడా రాసి ఇచ్చేవారు. చదువుకున్నవాళ్లకు ఆయన శ్రీనివాస్ అయితే, సామాన్యులకు మాత్రం శ్రీనన్న.**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టి.. వాటికి వ్యతిరేకంగా మాట్లాడిన ఏకైక గొంతు శ్రీనివాస్‌ది.

**చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో..**

అంపశయ్య నవీన్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఫిల్మ్ సొసైటీ బాధ్యతల్ని 1980లో చేపట్టిన శ్రీనివాస్, దానికి ఉద్యమ రూపాన్ని ఇచ్చారు. కరీంనగర్ ఫిలిం సొసైటీకి మొదటిసారిగా 16 ఎంఎం ప్రొజెక్టర్‌ను, ఆ తర్వాత 35 ఎంఎం ప్రొజెక్టర్లను సమకూర్చుకుని సమాంతర, అర్థవంతమైన సినిమాలకు వేదికగా ఆ సంస్థను తీర్చిదిద్దారు. సినిమా అప్రిసియేషన్ కోర్సులను జిల్లా వ్యాప్తంగా నిర్వహించి సమాంతర సినిమాకు ఒక మంచి వాతావరణాన్ని కల్పించారు. కరీంనగర్ నుంచి వెలువడిన జీవగడ్డ పత్రికలో 'పెన్నుపోటు' పేరుతో ఓ కాలమ్ కూడా నిర్వహించారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి భూకబ్జా, గ్రానైట్ రాళ్ల కుంభకోణాలను వెలికి తీశారు. కొత్త చట్టాల కోసం ఎదురుచూడకుండా ఉన్న చట్టాలను ఉపయోగించుకుని ప్రజలకు ఏ విధంగా సహాయం చేయవచ్చు అని చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలిచారు శ్రీనివాస్. ఈ ప్రయత్నంలో ఆయనకు వచ్చిన ఒత్తిడులను, బెదిరింపులను ఏమాత్రం ఖాతరు చేయలేదు. వాటికి బెదిరి ఆగిపోలేదు. ధైర్యంగా ముందుకు సాగి ఎంతోమందికి స్ఫూర్తిదాయకమయ్యారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తి ఇంకా కరీంనగర్‌లో కొనసాగాల్సిన అవసరం ఉంది. దాన్ని కొనసాగించడం కోసం కరీంనగర్‌లోని ఓ వీధికి ఆయన పేరు పెడితే శ్రీనివాస్ సేవలకు అర్థం ఉంటుంది. ఆ దిశగా స్థానిక నాయకత్వం ప్రయత్నం చేస్తుందని ఆశిద్దాం. అదే మనం నరెడ్ల శ్రీనివాస్‌కు ఇచ్చే ఘన నివాళి.

# మేకపాటి గౌతమ్ అకాల మరణం పెద్ద వెలితి

**మేకపాటి గౌతమ్ హఠాన్మరణం ఆంధ్రప్రదేశ్‌కు, తెలుగు ప్రజలకు అశనిపాతమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తెలివి, ఉత్సాహం, అంకితభావం గల ఒక యువ, స్ఫూర్తిదాయక నాయకుడ్ని అకాల మరణం కబళించిందన్నారు. సమర్థులను, నిజాయతీపరులను కులం, మతం వంటి సంకుచితాలతో సంబంధం లేకుండా సమాజం గుర్తించాలన్నారు. అటువంటి వారిని నిరాదరిస్తే సమాజమే నష్టపోతుందన్నారు. 40-50 ఏళ్ల వయసు వారు ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ పెట్టాలని, ప్రాథమిక స్థాయి నుండే ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తగిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వాలు తక్షణం అమలు చేయాలన్నారు. మేకపాటి మృతి ప్రజాజీవితంలో పెద్ద వెలితి అని ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు జేపీ ప్రగాఢ సంతాపం తెలిపారు.**

## కొఠియా గిరిజనుల మనోభావాల్ని ప్రభుత్వాలు గౌరవించాలి



ఆంధ్రా-ఒడిషా సరిహద్దులోని వివాదాస్పద కొఠియా గ్రామాల పరిధిలోని కొన్ని ఊళ్లలో ఒడిషా ప్రభుత్వం నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్ని గిరిజనులు బహిష్కరించటం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఎన్నికల్లో పాల్గొనటానికి ఇష్టపడని గిరిజనులు ఒడిషా వద్దు.. ఆంధ్రా ముద్దు అని నినదించి పోలీసులు, అధికారుల ముందు తమ అభిప్రాయం నిర్భయంగా చెప్పారన్నారు. దీంతో ఖంగుతిన్న అధికారులు కొన్ని చోట్ల తామే గిరిజనుల ఓట్లు వేసుకుని ఎక్కువ శాతం పోలయినట్లు చెప్పుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆంధ్రా అధికారులు, నాయకులు కనీసం స్పందించ చకపోవటం దారుణమన్నారు. ఒడిషా ప్రభుత్వ ఎన్నికలు బహిష్కరించాలని లోక్‌సత్తా గతంలోనే పిలుపునిచ్చింది. అలాగే కొఠియా గ్రామాల ప్రజలు ఒడిషా పాలనను వ్యతిరేకిస్తున్నారని, ఏపీ ప్రభుత్వం తగురీతిలో స్పందించాలని లోక్‌సత్తా పార్టీ అఖిల పక్షంతో కలిసి పర్యటనల అనంతరం పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వాలు గిరిజనుల మనోభావాల్ని గౌరవించాలని బాబ్జీ అన్నారు.

## నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



ప్రయివేటు ఉపాధికి తగిన చర్యలు తీసుకోవటంలో విఫలమవటంతోపాటు, ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల సర్కారీ పోస్టులను భర్తీ చేయటంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా పార్టీ నేత ఆనందాచారి, రాయలసీమ యూనివర్సిటీ నేతలు సురేంద్ర, మధు అన్నారు. ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకోకపోవటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, ఎక్కడికక్కడ ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగురీతిలో స్పందించకపోతే నిరుద్యోగులంతా ఆందోళన చేపట్టటం మినహా మార్గం లేదన్నారు.

**వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలి:** వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిలకలూరిపేట వద్ద తహసీల్దార్ కార్యాలయం ముందు నాలుగురోజులుగా ఆందోళన చేస్తున్న వీఆర్ఏల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అధికారంలోకి వస్తే వీఆర్ఏలకు రూ.21వేల జీతం ఇస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, సంఘ నాయకులు ఆనంద్ కుమార్, నాగేశ్వరరావు, సురేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులూ! సిగ్గుపడండి

విజయనగరం జిల్లాలో ధాన్యం రైతులు, చిన్న మిల్లర్లు ప్రభుత్వం ప్రకటించిన చెత్త విధానం వల్ల నలిగిపోతున్నారని భీశెట్టి బాబ్జీ అన్నారు. రాంభద్రపురం, సాలూరు మండలాల్లో పర్యటించి రైతులు, మిల్లర్ల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. సంక్రాంతిలోగా రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని ప్రకటించి ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఎందుకు చెయ్యలేకపోయారో ప్రభుత్వం చెప్పాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి నేటి వరకు డబ్బులు రైతుకి చేరలేదన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నా పాలకులు మొద్దునిద్రలో ఉన్నారన్నారు. పలు చోట్ల పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌కి తరలిపోతోందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ తూతూ మంత్రంగా సమీక్షలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. జిల్లాలో పాలన తీరుపై వైకాపా ప్రజాప్రతినిధులే జిల్లా సమీక్షా సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారని, జిల్లా ఇంఛార్జి మంత్రి వెల్లంపల్లి, బొత్స సిగ్గుతో తలదించుకోవాలని బాబ్జీ అన్నారు. కార్యక్రమంలో పౌరవేదిక జిల్లా కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, ఇప్పలవలస గోపీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్య రాజ్యాంగంలో ఉందా?

యూనియన్ బడ్జెట్ 2022-23ను ప్రకటించిన రోజునే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అందులో రాష్ట్రానికి కేటాయింపుల పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బీజేపీని తూర్పార పట్టారు. ఈ క్రమంలోనే ఓ తీవ్రమైన మాట అనేశారు. భారతదేశానికి ప్రస్తుతమున్న రాజ్యాంగం పనికిరాదని, కొత్త రాజ్యాంగం రాయాలన్నారు. దీనిపై పెద్ద దుమారమే రేగింది. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో కలిగిన అసంతృప్తి.. ఫెడరలిజంపై యూనియన్ దాడిగా అభివర్ణించటానికి, ఆ తర్వాత రాజ్యాంగాన్నే తిరగరాయాలనటానికి తక్షణ కారణంగా మారింది. దీన్ని ముఖ్యమంత్రి నోరు జారటంగా కొందరు అభివర్ణించారు.

గతంలో వాజ్‌పేయి నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా.. రాజ్యాంగాన్ని సమీక్షించాలని ప్రతిపాదించినప్పుడు కూడా ఇదే తరహాలో నిరసనలు రేగాయి. కేసీఆర్ మాటలపై తీవ్ర విమర్శలు రావటంతో, నష్టనివారణ చర్యల్లో భాగంగా టీఆర్ఎస్ నాయకులు వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ సమీక్షా సంఘం ఏర్పాటును ప్రస్తావించాయి. అయితే ఆనాడు వాజ్‌పేయి ప్రభుత్వం కొత్త రాజ్యాంగం కావాలన్న మాటను ఉపయోగించలేదన్న అంశాన్ని మాత్రం దాటవేసే ప్రయత్నం చేశాయి. అప్పట్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య నేతృత్వంలో రాజ్యాంగ సమీక్షా సంఘాన్ని ఏర్పాటు చేసినప్పుడు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చాలా స్పష్టమైన సూచనల్ని అందించారు. ఆ సంఘంలో పనిచేయవలసిందిగా అభ్యర్థన వచ్చినా కూడా బయటి నుండే తన సూచనల్ని తెలియచేశారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి పరిధిలోనే మార్పులు చేయాలి తప్ప, కొత్త రాజ్యాంగం జోలికిపోవాల్సిన అవసరం లేదని జేపీ అప్పట్లో మీడియా ద్వారా కూడా ప్రకటించారు. తాజాగా కేసీఆర్ ఫెడరలిజం, కొత్త రాజ్యాంగం గురించి మాట్లాడగానే, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా 2014లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో పార్లమెంటులో ప్రస్తావించారు. ఎవరి మనసులో ఏముందో తెలియదుగానీ, ఆ తర్వాత కేసీఆర్ తన వాదననే మొండిగా కొనసాగించే ప్రయత్నం చేశారు. తాను కొత్త రాజ్యాంగం రాయాలనటం నోరు జారటం కాదని, దాని వెనక ఎంతో కథ, వ్యూహం ఉందని చెప్పుకొచ్చారు. అయితే దీనిపై చర్చ జరగాలని మాత్రమే తాను చెబుతున్నానని కొంత పట్టు సడలించారు. అలాగే గాంధీ అహింసా మార్గం, అంబేద్కర్



ఆశయాలు పరిధిలోనే తాను చెబుతున్న రాజ్యాంగ నిర్మాణం కూడా ఉంటుందని సర్దుబాటు ధోరణిని వ్యక్తం చేశారు.

ఇంతకీ కేసీఆర్ చెబుతున్న వాదన ఏమిటంటే, తెలంగాణలో జరిగిన నీటిపారుదల, దళితబంధు వంటి పథకాలు, కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలు జరగటానికి, దేశంలో అన్ని ప్రాంతాలకూ నిరంతర విద్యుత్తు ఉండటానికి, పెరిగిన జనాభా సంఖ్యకు అనుగుణంగా ఎస్.సి రిజర్వేషన్ల పెంపునకు, ఆర్థిక వృద్ధి జరగటానికి, అంతరాలు తొలగటానికి కొత్త రాజ్యాంగం రాసుకోవాల్సి ఉంది. అలాగే ప్రస్తుత రాజ్యాంగమే కొనసాగితే చైనా, సింగపూర్ తరహా అభివృద్ధిని సాధించటం అసాధ్యమని కూడా కేసీఆర్ ఢంకా బజాయించి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ వాదనలకనుగుణంగా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలను సమీకరించే కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ పట్ల మాత్రం కొంత మృదుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా కేసీఆర్ ప్రత్యామ్నాయ వాదనల పట్ల గతం కంటే ఎక్కువగా ఈసారి సానుకూలంగా స్పందించారు. కర్ణాటక నుండి జేడీఎస్ కూడా కేసీఆర్‌కు మద్దతు ప్రకటించింది. ఈ మొత్తం వెనుక పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయత్నం ఉందంటున్నారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఉన్నాడంటున్నారు. అయితే ఆయా ముఖ్యమంత్రులు, పార్టీల నేతలు రాజ్యాంగం ప్రస్తావన తేకుండా, ఫెడరలిజం కోణంలోనే కేసీఆర్‌కు మద్దతిస్తున్నారు. యూనియన్‌లో మోదీ ప్రభుత్వం అధ్యక్ష తరహా పాలన వైపు మళ్లుతోందని, రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు.

ఈ ముఖ్యమంత్రులు, ఇతర నేతలు కేసీఆర్‌తో ఫోన్‌లో టచ్‌లో ఉంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేతో, ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌తో ఇప్పటికే కేసీఆర్ సమావేశమయ్యారు. ఢిల్లీ, ఉత్తరాది రాష్ట్రాల్లో మరిన్ని సమావేశాలు నిర్వహిస్తున్నారు.

అయితే నిజంగా మన ఫెడరలిజం అంత ప్రమాదంలో ఉందా? ఈ క్రమంలో రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఉందా?

కొంచెం లోతుగా పరిశీలిద్దాం.

నిజానికి రాజ్యాంగంలో ఏముందో నేటికీ మన దేశంలో చాలామందికి స్పష్టత లేదు. మన దేశంలో ప్రతి రాజకీయ పార్టీ రాజ్యాంగం ప్రాతిపదికనే ఏర్పడుతుంది, అలాగే అధికార వ్యవస్థలోని ప్రతి ఎన్నికా రాజ్యాంగంలో ఉన్న ఏర్పాటు ద్వారానే జరుగుతుంది, ఎన్నికైన ప్రజాప్రతినిధులు రాజ్యాంగం మీద ప్రమాణం చేసే పదవీబాధ్యతలు చేపడతారు. ఇవన్నీ ఉన్నా కూడా.. ప్రజాస్వామ్యంలో కీలకమైన రాజకీయ పార్టీలలో అత్యధిక నేతలకు కూడా రాజ్యాంగం గురించి లోతుగా తెలియదు. లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ్ దగ్గర తప్ప, ఏ రాజకీయ నాయకుడి వద్దా రాజ్యాంగం ప్రతి కూడా ఉండేది కాదు. తెలుగునాటే కాదు, యావత్ భారతదేశంలోనూ ఇదే పరిస్థితి. ఇప్పుడు కొంచెం పరిస్థితి మారినా, ఇంకా రాజ్యాంగం గురించి విస్తృత ప్రజానీకానికయితే తెలియదు. అలాంటిది ఏడున్నర దశాబ్దాల క్రితం స్వతంత్రం వచ్చిన కాలంలోనే, ఒక విశిష్ట రాజ్యాంగాన్ని భారత్ ఏర్పాటు చేసుకుంది. అది కూడా




ప్రజలు తమకకోసం తాము రూపొందించుకున్నట్లుగా, అంకితమిచ్చుకున్నట్లుగా రాజ్యాంగం అమలు ప్రకటన జరిగింది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే, అప్పట్లో ఉన్న జాతీయోద్యమ నాయకుల విశ్వసనీయత, సామర్థ్యం, చిత్తశుద్ధిల వల్ల! ప్రజాస్వామ్యం, అందుకు కావలసిన హక్కులు, నైతిక పద్ధతులు, ఇతరత్రాలతో ఒక సమగ్ర రాజ్యాంగాన్ని అందించే ప్రయత్నం ఆ నేతలు చేశారు. మన దేశంలో అవిద్య, పేదరికం ఎక్కువ కాబట్టి.. ఎక్కడా గందరగోళానికి అవకాశం లేకుండా సాధ్యమైనంత వివరంగా అన్నీ తెలియచేస్తూ ఓ పెద్ద లిఖితపూర్వక రాజ్యాంగాన్ని మన నేతలు తయారు చేశారు. తుది ప్రతిలో 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి.

స్వతంత్రం వచ్చే సమయంలో, భారతీయుల్లో అత్యధికులు తమకు ఇలాంటి ప్రజాస్వామ్య రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ కావాలని కూడా అడగలేదు. గాంధీగారు, నెహ్రూగారు, ఇతర పెద్దలు చెప్పారు కాబట్టి.. అనుకుంటూ శిరసావహించారంతే.

అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచనా సంఘం రూపొందించిన సంవిధానం.. ఆ తర్వాత మన జాతీయోద్యమ నేతల ఆశల్ని నెరవేర్చటంలో గణనీయ విజయం సాధించిందనటంలో సందేహం లేదు. రాజ్యాంగాన్ని పూర్తిగా భారతీయ సాంప్రదాయాలకు అనుగుణంగా తయారుచేయాలని రాజ్యాంగ సభలో కొందరు సభ్యులు పట్టుబట్టినా, ఆధునిక దృక్పథం గల నెహ్రూ, అంబేద్కర్ వంటి నేతల కృషి, పటేల్ వంటి నేతల ఉదాత్త భావాలు మన రాజ్యాంగానికి ఆధునిక, శాస్త్రీయ దృక్పథాన్ని అందించాయి. వలసవాద బానిస ధోరణుల్ని వదిలించుకుని ప్రపంచంలో ఏ దేశంతోనైనా పోటీపడగలిగేందుకు కావలసిన చట్రాన్ని అందించాయి. ఆధునిక ఆత్మ గలిగిన ఆ సంవిధానమే లేకుంటే.. ఈవేళ మన పురాతనమైన కుల, మత వివక్షల తీవ్రత ఏ స్థాయిలో ఉండేదో ఊహించను కూడా లేము. వివక్షలు అంత భయంకరంగా తయారై ఉండేవి. దళితులు, ఇతర అణగారిన వర్గాల్లో పలువురు సహా ఈ దేశంలోని అత్యధికులు ఇప్పటికీ అంతగా గుర్తించకున్నా.. రాజ్యాంగం ఒక ఛత్రంలా ఈ దేశంలో కోట్ల మంది సామాన్యుల హక్కుల్ని కాపాడుతోంది. దేశానికి స్వతంత్రం తేవటం కన్నా.. ఎన్నో కులాలు, మతాలు, తెగలు, భాషలు, సంప్రదాయాలు, సంస్కృతులు, ఆచారవ్యవహారాలు ఉన్న భారతదేశాన్ని ఒక దేశంగా ఏకం చేయటం గాంధీ సాధించిన అద్భుత విజయం కాగా.. దాన్ని నిలబెట్టే రాజ్యాంగాన్ని అంబేద్కర్ అందించారు. స్వతంత్ర పోరాటకాలంలో గాంధీ చేసిన కృషిని రాజ్యాంగం ద్వారా స్వతంత్ర భారతదేశ ప్రజాస్వామ్యంలో వ్యవస్థీకృతం చేసేందుకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారు.

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ దాదాపు దశాబ్దకాలం క్రితం చెప్పినట్లు.. "గాంధీజీ భారతీయ సమాజంలో యధాతథస్థితిని కొనసాగనివ్వలేదు. అలా అని సంఘర్షణ స్థాయికీ పోనివ్వలేదు. సృజనశీలమైన ఉద్వేగస్థితికి మాత్రం తీసుకెళ్లారు.. స్వతంత్రం వచ్చాక మన రాజ్యాంగం చేసింది కూడా ఇదే! స్వేచ్ఛ అనే మాట మరచి వెయ్యేళ్లు దాటిపోయిన సమాజానికి ఆ స్వేచ్ఛను ఇస్తూనే, దానిని ఏకతాటిపై నిలిపింది మన రాజ్యాంగం. సమత్వం గురించి ఏనాడూ ఆలోచించని సమాజాన్ని అదే ఆశయానికి కట్టుబడి ఉండేటట్లు మలిచింది. ఫెడరల్ లక్షణం లవలేశమైనా లేని మనదేశం విజ్ఞతాయుతమైన ఒక ఫెడరల్ వ్యవస్థలో ఒదిగేటట్లు చేసింది ఈ రాజ్యాంగమే. సమాజాన్ని కలిపి ఉంచడం రాజ్యాంగం బాధ్యత. ఆ పని అది అద్భుతంగా నిర్వహించింది".

పాలకులు వస్తుంటారు, పోతుంటారు.. కానీ భారత ప్రజలు, రాజ్యాంగ ప్రజాస్వామ్యం శాశ్వతం అని ప్రజలు తమ మాటలు, చర్యల ద్వారా స్పష్టం చేశారు.

అయితే.. గొప్ప జాతీయోద్యమం, ఆ వారసత్వం, ప్రపంచ అనుభవాల నుండి రూపొందిన విశిష్ట రాజ్యాంగంతో స్వతంత్ర భారతదేశ ప్రస్థానం ప్రారంభమైనా, ఈవేళ్టికీ మన ప్రజాస్వామ్యం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వీటన్నింటి సారాంశంగా ప్రజలకు రోజువారీ సేవలు, జీవన భద్రత వంటి రూపాల్లో నెరవేరాల్సిన సామాజిక ఒప్పంద లక్ష్యాల్లో మన దేశం ఇంకా ఎంతో వెనుకబడి ఉంది. ఈ వైఫల్యానికి మూలం రాజ్యాంగంలో ఉందా?

నిజానికి మన దేశం అనేక అపనమ్మకాలు, అపశకునాల మధ్య స్వతంత్ర దేశంగా ప్రస్థానాన్ని ప్రారంభించి కూడా వాటన్నిటినీ అధిగమించి ఒక బలమైన దేశంగా నిలదొక్కుకోవటం ఒక అద్భుత విజయంగానే చెప్పుకోవాలి. కానీ మన దేశం సాధించగలిగిన విజయాలతో పోలిస్తే, సాధించిన విజయాలు ఎంతో తక్కువ. ఇదీ అసలు సమస్య! మన జాతీయోద్యమ నాయకులు వ్యక్తిగత నిజాయతీకి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, వ్యవస్థీకృత నిజాయతీని విస్మరించటం ఇందుకు ఒక కారణం కాగా, నాటి దేశ విభజన సమయంలో తలెత్తిన భయానక పరిస్థితుల ప్రభావంతో జాతీయస్థాయిలో అధికారాల్ని కేంద్రీకరించేలా రాజ్యాంగంలో యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా కాకుండా.. కేవలం యూనియన్‌గా భారత్‌ను ప్రకటించటం. వెరసి.. మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న బూజు పట్టిన భావాలు, రాజ్యాంగం రూపకల్పన సమయంలోనే చోటుచేసుకున్న కొంత గందరగోళం వల్ల మన ప్రజాస్వామ్యం 'ఓటింగ్, షౌటింగ్'ల స్థాయిలోనే కొట్టుమిట్టాడుతోంది.

అందుకే, జేపీ వివరించినట్లు, "సుమారు 200 ఏళ్ల క్రితం 1820లలో ఎలాంటి పాలనా వ్యవస్థ అమలైందో, ఇప్పుడు కూడా అదే కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్లు, వారి హోదాలు. అఫీషియల్స్, నాన్‌అఫీషియల్స్. అసలు ఈ రెండు మాటలు మన దేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా వాడరు".

అయితే రాజ్యాంగంలోని లోపాన్ని సవరించుకునే వెసులుబాటును కూడా రాజ్యాంగమే మనకు అందిస్తోంది. మనమే ఆ పనులు సవ్యంగా చేయటంలా. మనం వేసే ఓటుకు, మన జీవితాలకు సంబంధం లేకుండా ఎన్నికలు వ్యాపారంగా, డబ్బుమయంగా మారిపోవటానికి, అధ్వాన్న పాలనతో రోజువారీ జీవితాలు దుర్భరంగా ఉండటానికి, జీవన భద్రత లేకపోవటానికి, ఎదిగే అవకాశాలు కొరవడటానికి, అసమానతలు పెరిగిపోవటానికి ప్రధాన మూలం మన ఫ్యూడల్, వలసవాద రాజకీయంలో ఉంది తప్ప రాజ్యాంగంలో లేదు.

రాజ్యాంగం ద్వారా జాతీయ స్థాయిలో జరిగిన అధికార కేంద్రీకరణను కూడా సవరించుకునే వెసులుబాటు మన రాజ్యాంగమే మనకు అందిస్తోంది. ఇప్పటికే ఈ దిశగా కొన్ని బలమైన అడుగులు పడ్డాయి. 1980ల నుండి రాష్ట్రాలకు అధికారాలు బదిలీ అవుతూ క్రమంగా ఫెడరలిజం బలోపేతమవుతోంది. ఈవేళ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను ఇష్టానుసారం డిస్మిస్ చేసే సాహసం ఎంత బలమైన ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉన్నా చేయలేదు. అలాగే ఆర్థిక సంఘం వల్ల యూనియన్ నుండి నేరుగా నిధులు రాష్ట్రాలకు బదిలీ అవుతున్నాయి. ఈ వికేంద్రీకరణనే ఇంకా విస్తరించి, మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాల స్థాయికి తీసుకెళ్లకుండా మనం అలవిమాలిన తాత్సారం చేస్తున్నాం.

జేపీ చెప్పినట్లు, "మనది ఎంతో వైవిధ్యమున్న సమాజం. ఇక్కడ గుర్తించిన భాషలే 22 ఉన్నాయి. ఎన్ని జీవన విధానాలు, ఎన్నెన్ని సంస్కృతులు మన దేశంలో ఉన్నాయి! ఊహించటం కూడా కష్టం. కానీ పౌరురాలు/పౌరుడు, కమ్యూనిటీల కేంద్రంగా మన అధికార వికేంద్రీకరణ జరగలేదు. రాజ్యాంగంలో ప్రస్తావించని ప్రతి అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందని ఇక్కడ అన్నారు. అదే అమెరికాలో రాజ్యాంగంలో లేనివన్నీ రాష్ట్రాలకు చెందుతాయని అన్నారు. విచిత్రం ఏమిటంటే రాజ్యాంగంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వం అన్న మాటే లేదు. అలా అధికారం కేంద్రీకృతం కావటంతో మొదట దెబ్బతిన్నది మన గ్రామీణ వ్యవస్థే. గ్రామాలు రిపబ్లిక్‌లుగా ఉండాలన్నది గాంధీజీ ఊహ. కానీ గ్రామానికి ఎక్కువ అధికారం ఉంటే పెదధోరణులు ప్రబలుతాయన్నది అంబేద్కర్ దృష్టి. ముఖ్యంగా కులప్రభావం గురించి అంబేద్కర్ ఆలోచించారు. అలా 40వ అధికరణం మేరకు పంచాయతీలు ఆదేశిక సూత్రాల్లో భాగంగా ఉండిపోయాయి. అధికారస్వామ్యం, ఎమ్మెల్యే రాజ్యం కలిసే సరికి ప్రజాభిప్రాయానికి దగ్గరగా ఏ నిర్ణయమూ జరగడం లేదు. వ్యవసాయ రంగానికి, వృత్తులకు న్యాయం జరగడం లేదు. ఇప్పుడు ఇండియాకు కావలసింది, మనం చేయాల్సింది గాంధీని, అంబేద్కర్‌ని కలపటం. అందుకే లోక్‌సత్తా భావజాల ఐకాన్లుగా వారిద్దరినీ ఎంచుకున్నాం. అధికారాన్ని వికేంద్రీకరించి.. ఓ గ్రామానికి బదులు గ్రామాల సమూహమనే పెద్ద యూనిట్‌ను గణతంత్ర భారతదేశం ప్రాతిపదికగా తీసుకుంటే, సాంప్రదాయ గ్రామాలను 20,000 – 30,000 జనాభాకొకటి చొప్పున సమూహంగా కలిపి, ఆ సముదాయాన్ని (క్లస్టర్) చిన్న పట్టణ తరహా ప్రాంతాలుగా స్థానిక ప్రభుత్వాలకు ప్రాథమిక యూనిట్‌గా ఏర్పాటు చేస్తే ఆ ఇద్దరు మహనీయులు ఆశించిన ఓ పెద్ద మౌలిక లక్ష్యం నెరవేరుతుంది, దేశ ఉజ్వల భవితకు పటిష్ట పునాదులు ఏర్పడతాయి. దీనివల్ల ప్రాథమిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరతాయి, నిర్వహణ సామర్థ్యం కొరత కూడా తీరుతుంది. చిన్న పట్టణ ప్రాంతంలా గ్రామాల సముదాయంగా ఉండే ఒక పెద్ద యూనిట్ ప్రాతిపదికన సార్వత్రిక ఓటు హక్కుకి ఉండే ప్రభావం వల్ల కుల అసమానతలు పలచబడతాయి. అటువంటి స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత, వికేంద్రీకరణను స్వతంత్ర అంబుడ్స్‌మన్‌కి జవాబుదారీతనంతో అందిస్తే ప్రజలకు సేవలు మెరుగవుతాయి. జనాభాలో అత్యధికంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పేదలకు ప్రాతినిధ్యం వహించే వారికి నిజమైన నాయకత్వం,

సాధికారత లభిస్తుంది. స్థానిక ప్రభుత్వాల్లో గణనీయంగా కల్పించిన రిజర్వేషన్లకు కూడా సార్థకత చేకూరుతుంది. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ వార్డుల వరకూ స్థానిక సాధికారత ఉండే మూడో అంచె ఫెడరలిజం ఇప్పుడు మనకు ఎంతో అవసరమైన మార్పు".

ఈ రకమైన వికేంద్రీకరణను ఇప్పుడున్న రాజ్యాంగం ద్వారానే చేసుకోవచ్చు. విస్తరించే వలయాల మాదిరిగా అధికార వికేంద్రీకరణ జరగటం ప్రజాస్వామ్య లక్షణం. ఇందుకు మన రాజకీయ లోపమే అవరోధంగా నిలుస్తోంది.

ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేసి కొత్త రాజ్యాంగాన్ని తయారుచేయాలనే ప్రతిపాదనను చూస్తే, ఏ మాత్రం చర్చకు నిలబడదు. దీనివల్ల దేశవ్యాప్తంగా రాజకీయ అవసరాలరీత్యా తనకో గుర్తింపును తెచ్చుకోవటానికి కేసీఆర్‌కు అవకాశం లభించి ఉండొచ్చు గానీ, దాని వల్ల కలిగే గందరగోళం వల్ల దేశానికి నష్టం జరిగే అవకాశాలే ఎక్కువ. భారత రాజ్యాంగంలో భారతీయత లేదని కొందరు, రాజ్యం యొక్క అంగం కాబట్టి అని ఇంకొందరు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి తొలి నుండీ అవరోధాలు కల్పిస్తున్నారు. వలస పాలన నాటి ఆందోళనా పద్ధతులను అనుసరిస్తూ, ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఇలాంటి వారికి కేసీఆర్ వాదన లాభం చేకూర్చేలా ఉంది. దీంతో, ఎవరికి లాభం చేకూర్చటానికి కేసీఆర్ రాజ్యాంగంపై ఈ రకమైన వాదనల్ని ఎత్తుకున్నారనే అనుమానాలూ కలగక మానవు.

రాజ్యాంగంపై చర్చను ఎవరూ తప్పుపట్టరు. చర్చ అవసరం కూడా. అంబేడ్కర్ రాశారు కాబట్టి రాజ్యాంగాన్ని ప్రశ్నించకూడదు లాంటి వాదనలు కేసీఆర్ వాదనల తరహాలోనే అప్రజాస్వామికం, అహేతుకం. రాజ్యాంగం ఎంత గొప్పదైనా, అది మార్పులకి అతీతం కాదు. రాజ్యాంగం అనేది కేవలం సదాశయాల ప్రకటనపత్రంగానే మిగిలిపోయి రాజ్యవ్యవస్థ స్వభావాన్ని మలచటంలో ఎటువంటి పాత్రనూ పోషించలేకపోతే, అటువంటి రాజ్యాంగం చిత్తుకాగితంతో సమానం. 'రాజ్యాంగాలు సజీవ పత్రాలు' అని భారత రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చిన అమెరికా రాజ్యాంగ రచయిత, రాజనీతిజ్ఞుడు థామస్ జఫర్సన్ ఎంతో వాస్తవిక దృష్టితో స్పష్టం చేశారు. "రాజ్యాంగాల్ని నైతిక ఆధిపత్యంతో కూడిన పవిత్ర గ్రంథాల్లా, ముట్టుకుంటే మైలపడిపోతాయన్నట్లుగా కొంతమంది వ్యవహరిస్తుంటారు. గతకాలాల్లోని వారికి మానవాతీత విజ్ఞతను ఆపాదిస్తారు. పెద్దలు పొందుపరిచిన ప్రతిదీ సవరణలకు అతీతమన్నట్లు భావిస్తారు. కానీ, చట్టాలు, వ్యవస్థలు.. మానవ మేధస్సు అభివృద్ధితో కలిసిమెలిసే సాగాలి. కొత్త ఆవిష్కరణలు చేస్తున్నకొద్దీ, కొత్త సత్యాల్ని కనుగొంటున్నకొద్దీ మారిన పరిస్థితులకనుగుణంగా వ్యవహారశైలులు, అభిప్రాయాలు మారుతుంటాయి. వీటిని మనం గుర్తించాలి. కాలానుగుణంగా వ్యవస్థలు కూడా ఎదుగుతూండాలి" అన్నారాయన. కానీ, రాజ్యాంగంలో మార్పు ఎందుకు, ఎలాంటి అంశాలకు సంబంధించి, ప్రత్యామ్నాయం ఏమిటి మొదలైన విషయాల్ని హేతుబద్ధంగా, అందరికీ ఆమోదయోగ్యంగా చెప్పకుండా.. కొత్త రాజ్యాంగం ఓ నినాదమైతే అది దేశానికి ప్రమాదకరం కూడా అవుతుంది.

ఈ మొత్తం నేపథ్యంలో ఏ రకంగా చూసినా, ఏ ప్రమాణాలతో చూసినా.. మన రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చాల్సిన పన్లేదు. భారత్ లాంటి దేశానికి, దేశం ఇప్పుడున్న పరిస్థితులకు మన రాజ్యాంగం ఎంతో చక్కటి సంవిధానంగా మనకు సరిపోతుంది. మూడో అంచెకు వికేంద్రీకరణ లాంటి కొన్ని మార్పుల్ని చేసుకుంటే చాలు.

తెలంగాణలో వచ్చిన మార్పు దేశవ్యాప్తంగా రావటం కోసమే కొత్త రాజ్యాంగం కావాలంటున్నానని కేసీఆర్ అంటున్నారు. తెలంగాణలో తెచ్చిన విధానాలన్నీ దళితబంధు సహా ఏదైనా సరే.. రాజ్యాంగం ద్వారా తప్ప వేరే రకంగా సాధ్యమయ్యాయా? రాజ్యాంగం అవకాశం ఇచ్చింది కాబట్టే.. కేసీఆర్ చేయగలిగారు. ఒకవేళ అవి గొప్ప కార్యక్రమాలనుకుంటే, వాటితో బంగారు తెలంగాణ వస్తుందనుకుంటే.. బంగారు భారత్ కోసం అదే రాజ్యాంగం ద్వారా దేశవ్యాప్తంగా కూడా అమలు చేయవచ్చు. లోపాలుంటే ఇప్పుడు సవరణలు చేసుకుంటున్నట్లే చేసుకోవచ్చు. రిజర్వేషన్ల శాతం వంటి అంశాలపై కూడా చర్చించి మార్పులు చేసుకోవచ్చు. కొత్త చట్టాలు తెచ్చుకోవచ్చు. అంతేతప్ప, రాజ్యాంగాన్ని తిరగరాసి చైనా నమూనాలో అభివృద్ధికి కొత్త రాజ్యాంగం కావాలనటం ఇంకా ప్రమాదకరం. చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నాణ్యమైన పౌర సేవలు అందించవద్దని భారత రాజ్యాంగం చెప్పిందా? వాటిని హక్కుగా ఇస్తామని చెప్పి కూడా అమలు చేయలేకపోవటం రాజకీయ వైఫల్యం తప్ప.. రాజ్యాంగ వైఫల్యం కాదు. అలాగే ఎన్నికల్లో ఓటుకు నోటు, తాయిలాలు పంచకుండా గెలిచేలా తగిన సంస్కరణలు చేసుకోవద్దని రాజ్యాంగం చెప్పిందా? పార్టీల్ని సొంత ఆస్తుల్లా తయారుచేసుకొమ్మని రాజ్యాంగం చెప్పిందా? దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికకు కావలసిన వెసులుబాటును రాజ్యాంగం ఎంతో ముందుచూపుతో అందించింది. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించటానికి.. సమానస్థాయిని, అవకాశాల్ని కల్పించటానికి.. వ్యక్తి గౌరవాన్ని పరిరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి.. భారత రాజ్యాంగం తన పీఠికలోనే ఇచ్చిన నిర్దిష్ట హామీలు అమల్లోకి రాకుండా కుట్రపన్నినట్టు అడ్డుకుంటున్నది రాజకీయమే తప్ప సమస్య రాజ్యాంగంలో లేదు. నీది ఏ పేపర్, ఏ ఛానల్, దమ్ముంటే నేను చెప్పింది రాయి, చూపించు.. లాంటి మాటలతో జర్నలిస్టులను చైనా తరహా నియంతృత్వ పోకడలతో సతాయించటానికా కొత్త రాజ్యాంగం? స్వేచ్ఛను కాపాడుకుంటూనే, చైనా తరహాలో హేతుబద్ధ విధానాలను అనుసరించి వేగంగా ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవటం ఇప్పుడు మనం చేయాల్సిన అసలైన పని.

# కొత్త రాజ్యాంగం తేవాలన్న వాదన అసంబద్ధం

## -కేసీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో జేపీ-

రాజ్యాంగం చేసేది మనకు ఒక ప్రజాస్వామ్య పునాదినివ్వటం, ఒక వ్యవస్థ నిర్మాణం చేయటం. అధికారం ఎక్కడ ఉంటుంది, ఎలా వస్తుంది, ఎలా ఉపయోగించాలి అని తెలియచేస్తుంది. అంతేగానీ, మీరేం చేస్తారో రాజ్యాంగం నిర్ణయించదు. రాజ్యాంగం కేవలం లా ఆఫ్ లాస్. అంతే. ఒక వైవిధ్యభరితమైన సమాజానికి, ప్రజాస్వామ్య అనుభవం లేని సమాజానికి, అక్షరజ్ఞానం లేని సమాజానికి, పేదరికం ఉన్న సమాజానికి ఒక అద్భుతమైన రాజ్యాంగాన్ని మన జాతి నిర్మాతలు ఇచ్చారు. చాలా ముందుచూపుతో. అదే సమయంలో భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా మార్పులు కావాలంటే అందుకు కూడా అవకాశం కల్పించారు. 105 సార్లు మార్చుకున్నాం మనం. మొన్న ఆగస్టు 2021లో చివరిసారిగా మార్చుకున్నాం రాజ్యాంగాన్ని. తాజా సవరణతో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం బి.సిల జాబితాని తయారుచేసే హక్కుని రాజ్యాంగబద్ధంగా ఇచ్చుకున్నాం. కాబట్టి మౌలికంగా రాజ్యాంగంలో తప్పు ఉంది, రాజ్యాంగంలో తప్పు వల్ల పరిపాలన బాగా లేదు అన్నది సరైన వాదన కాదు. మీకు చిన్న ఉదాహరణ చెబుతాను. లోక్‌సభను, శాసనసభను తీసుకోండి. 81వ అధికరణం ప్రకారం లోక్‌సభ, 170వ అధికరణం ప్రకారం రాష్ట్రాల శాసనసభ. వాటిని ఇప్పుడున్న రీతిన పెట్టమని రాజ్యాంగం చెప్పలా. రాజ్యాంగం ఎంత వెసులుబాటు ముందుచూపుతో చేసిందంటే, నిజంగా ఈ దేశ నాయకత్వం కావాలంటే దామాషా ఎన్నికల పద్ధతిలో తేవటానికి రాజ్యాంగంలో ఏర్పాటు ఉంది. దీనికి రాజ్యాగం మార్చక్కర్లేదు. మనం పెట్టుకున్నాం విఫల ఎన్నికల వ్యవస్థని. బ్రిటిష్ వారి సంప్రదాయాన్ని గుడ్డిగా అనుసరించాం. రాజ్యాంగం చెప్పలా ఆ మాట.

అట్లాగే మీకు రాష్ట్రాలు, జాతీయ స్థాయి అధికారాలు విభజించినప్పుడు కొన్ని పొరపాట్లు దొర్లాయి. ఎందుకంటే రాజ్యాంగాన్ని మొదట ప్రతిపాదించినప్పుడు ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్‌లో వికేంద్రీకృత భారతాన్ని వాళ్లు ప్రతిపాదించారు. కానీ అంతలో దేశ విభజన వచ్చింది. 15 లక్షల మంది హింసాకాండకి గురయ్యారు. కోటిన్నర మంది అటూఇటూ వలసపోయారు. దేశమంతా అరాచక వాతావరణం. 500కి పైగా సంస్థానాలు. ఏమవుతుందోనన్న గందరగోళం ఉంది. ఈ నేపథ్యంలో ఒక కేంద్రీకరించిన సమాఖ్య వ్యవస్థకు దారితీశారు. కానీ గత 30 ఏళ్లలో మనం చూసినట్లయితే, ఎన్.టి.ఆర్ గానీ, జ్యోతిబసు, బిజూ పట్నాయక్, కరుణానిధి గానీ వీరంతా దీర్ఘకాల పోరాటాన్ని సాగించి, రాష్ట్రాలకు సమతూకాన్ని సాధించి



బలమైన అధికారాల్ని అందించారు. ఒకప్పుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రుల్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసిపారేసేవారు. ఇప్పుడలా లేదు. బొమ్మయ్ కేసు తీర్పు తర్వాత. అలాగే నిధులు ఇష్టారాజ్యంగా ఉండేవి. ఇప్పుడలా కాదు. మన రాష్ట్రానికి చెందిన వై.వి రెడ్డి 14వ ఆర్థిక సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా, పైవారి ఆశీస్సులకు, పక్షపాతానికి సంబంధం లేకుండా రాష్ట్రాలకు నిధులు అందించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అలాగే ఎప్పుడైతే ఆర్థిక సరళీకరణ జరిగి లైసెన్స్-పర్మిట్ రాజ్యం పోయిందో, ప్రతి పనికీ ఢిల్లీ అనుమతులు పోయాయి. పెట్టుబడులు, ఓడరేవులు, విమానాశ్రయాలపై కూడా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాయి. కాబట్టి మనం పొరపాట్లని చాలా మేర సవరించుకోగలుగుతున్నాం. రాజ్యాంగంలో ఏదైనా మార్పు కావాలీ అంటే - ఒక్క అంశంలో రాజ్యాంగంలో పొరపాటు జరిగింది. జాతీయ స్థాయి, రాష్ట్రం తప్ప స్థానిక ప్రభుత్వాల గూర్చి పట్టించుకోలా. ఆదేశిక సూత్రాల్లో 40వ అధికరణంలో పంచాయతీలు ఏర్పాటు చేయాలని ఏదో ఒక మాట అన్నారు తప్ప, అసలు మూడవ అంచె ప్రభుత్వాల గురించి పట్టించుకోలేదు. ఆ తర్వాత 73, 74 రాజ్యాంగ సవరణల్ని తీసుకొచ్చినా అవి చాలా పేలవమైన సవరణలు. అధికారం లేదు, జవాబుదారీతనం లేదు. పనికిరాకుండా తయారుచేశారు. పంచాయతీ ఎన్నికలు, మునిసిపాలిటీ ఎన్నికలు బోలెడంత ఆర్భాటంతో జరుగుతాయి. ఎందుకూ కొరగానటువంటి సంస్థలు.

# ఈ ఏడాది బడ్జెట్‌నే చూడండి

యూనియన్, రాష్ట్రాల మధ్య కచ్చితంగా పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఈ ఏడాది బడ్జెట్‌నే చూడండి. 27 లక్షల కోట్లు జాతీయ స్థాయిలో పన్నుల ఆదాయాన్ని అంచనా వేశారు. దాంట్లో 16 లక్షల 11 వేల కోట్ల రూపాయలు వివిధ రూపాల్లో రాష్ట్రాలకు రానున్నాయి. దాన్లో 8 లక్షల 16 వేల కోట్లు ఆర్థిక సంఘం పేరుతోనే. రాజ్యాంగం ఏర్పాటు చేసిన ఆర్థిక సంఘం అది. అదే రాష్ట్రాలకు ఆర్థిక సంఘం పెట్టారు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా. ఎందుకని ఒక్క ఆర్థిక సంఘాన్ని కూడా సరిగా నియమించటం లేదు? చిత్తశుద్ధితో అధికారాల విభజన గాని, వనరుల పంపిణీ గాని జరగటం లేదు? ఈ పని జాతీయస్థాయిలో అద్భుతంగా జరుగుతున్నది. రాజ్యాంగం ఈ రకంగా ఏర్పాట్లు చేసింది. ఒక సుప్రీంకోర్టు గానీ, ఎన్నికల సంఘం గానీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ గానీ. ఐఏఎస్, ఐపీఎస్‌లు ఎంపికయ్యాక సరిగా పనిచేయటం లేదనే ఆరోపణలున్నాయి గానీ, ఎంపికలో అవకతవకలు జరిగాయని, అవినీతి, పక్షపాతం ఉన్నాయని గానీ నిరూపించదగ్గ ఆరోపణలు లేవు. రాజ్యాంగంపై ప్రతి తరంలో అవసరాన్ని బట్టి మార్పులు మార్పులు చేసుకోవాలి. ఏం మార్పులు, ఎందుకు అని ఆలోచించాలి గానీ మొత్తంగా తుంగలో తొక్కేస్తామంటే, వ్యవస్థ కూల్చేస్తాం, రాజ్యాంగాన్ని పక్కన పెట్టేస్తాం అంటే.. అది నిస్పృహతో చర్య అవుతుంది. ఏం మార్పులు కావాలో చెప్పండి. అలాగే రాజ్యాంగంలో చెబితే పనులై పోవు. రాజ్యాంగంలో రాసుకున్నాం, అందరికీ విద్య అందవలెను అని. విద్యాహక్కు చట్టం తెచ్చుకున్నాం. రాజ్యాంగంలో రాయకపోతే విద్య అందించవద్దని చెప్పిందా? రాజ్యాంగంలో రాసినంత మాత్రాన విద్య అందుతోందా? తెలంగాణలో 14–18 ఏళ్ల మధ్యవయసున్న పిల్లల్లో 50 శాతం మందికి గడియారం చూసి గంటలు, నిమిషాలతో సమయం చెప్పటం రావటం లేదు. రాజ్యాంగం ఇవ్వొద్దని చెప్పిందా? రాజ్యాంగంలో ఇవాళ పరిస్థితులకనుగుణంగా మార్పులు చేసుకునే సౌలభ్యం ఉంది. ఒక్క పెద్ద మార్పు తీసుకురావాల్సి ఉంది. 73, 73 రాజ్యాంగ సవరణల స్థానంలో అధికారాల్ని స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో బదిలీ చేయాలి. డబ్బులు, తాయిలాలకు బదులు ఓటు ఎందుకు వేస్తున్నామో అర్థమై సద్వినియోగం చేసుకోవటం ప్రజలు మొదలుపెడతారు. ఆ మార్పు చేసుకోవటం మన చేతుల్లో ఉంది. కచ్చితంగా ఫెడరలిజం ఇంకా బలపడాలి. కానీ ఢిల్లీ పాత్ర ఢిల్లీకి ఉండాలి.

# శాసన మండలి కూర్పు, ఎన్నికల వ్యవస్థలో మార్పులు వద్దని రాజ్యాంగం చెప్పిందా?

శాసన మండలి ఉంది. కౌన్సిల్ నిర్మాణం ఎలా పెట్టారు రాజ్యాంగంలో? ఆనాడు వలస పాలన రీతిన గవర్నర్ కౌన్సిళ్లు ఉండేవి. అందుకే టీచర్స్ నియోజకవర్గాలు, పట్టభద్రుల నియోజకవర్గాలు కొనసాగుతూ వచ్చాయి. అందుకే రాజ్యాంగంలో ఏం పెట్టారో తెలుసా, మీరు చట్టప్రకారం పార్లమెంటులో దీన్ని మార్చేంతవరకూ కొనసాగించుకోవచ్చన్నారు. అంటే ఈ మార్పు అవసరం, అది కూడా మామూలు చట్టం ద్వారా చేసుకోవచ్చు అని రాజ్యాంగంలో పెట్టారు. ఎంత ముందుచూపు ఉంది! 71వ రాజ్యాంగ అధికరణ. మనం చేయలా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కౌన్సిల్ ఏర్పాటు సమయంలో నేను పార్లమెంటరీ కమిటీ ముందు స్పష్టంగా చెప్పాను– కౌన్సిల్ ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఈరోజు వయోజన ఓటు హక్కు ఉన్న మన దేశంలో మీరు మూడో అంచె ప్రభుత్వాలున్న స్థానిక ప్రభుత్వాల సభగా మండలిని ఏర్పాటు చేయండి అని. ఎలాగైతే రాజ్యసభ రాష్ట్రాల సభగా ఉందో, అలా స్థానిక ప్రభుత్వాల సభగా చేయమన్నాను. అంతేగానీ, గ్రాడ్యుయేట్లు, టీచర్ల నియోజకవర్గాలు ఇవన్నీ పాత కాలపు ఆలోచనలు అని చెప్పాను. విషయం తెలుసు గానీ రాజకీయ కారణాలతో అలాగే కొనసాగించారు. రాజ్యాంగం చేయలేదు ఆ పని. అలాగే ఎన్నికల వ్యవస్థ. హుజూరాబాద్‌లో రూ.150 కోట్లు ఖర్చు పెట్టమని రాజ్యాంగం చెప్పిందా? మనం ఎన్నికల వ్యవస్థను మార్చుకునే వెసులుబాటును కూడా రాజ్యాంగం అందించింది. దామాషా పద్ధతిని తేలిగ్గా తెచ్చుకునే అవకాశం మనకుంది. మనం చేయటం లేదు అంతే. జస్టిస్ వెంకటాచలయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమీక్షా సంఘంలో మన రాష్ట్రానికి చెందిన జస్టిస్ జీవన్‌రెడ్డి సభ్య కార్యదర్శిగా ఉన్నారు. జస్టిస్ హెచ్.ఆర్ ఖన్నాతో కలిసి నేను ఆ సంఘంతో సన్నిహితంగా పనిచేశారు. రాజ్యాంగం పనితీరు ఇన్నేళ్లలో ఎలా ఉంది అని పరిశీలించటానికి తప్ప రాజ్యాంగాన్ని కొత్తగా రాయటం కోసం కాదు ఆ కమిటీని ఏర్పాటు చేసింది! మన దేశంలో జాతీయ స్థాయి ప్రభుత్వం పెత్తనం చేస్తోందని ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రులు రాష్ట్రాల్లో తిరుగులేని అధికారాలను చెలాయిస్తున్నారు. ఫెడరలిజం గతం కంటే ఎంతో బలపడిందనటంలో సందేహం లేదు.

## ముఖ్యమంత్రి హీరో, మంత్రులు జీరో

ప్రతి రాష్ట్రంలో ముఖ్యమంత్రులు సమష్టి బాధ్యత ఉన్నా కూడా, మకుటం లేని మహారాజుల్లా వ్యవహరిస్తున్నారన్నది పచ్చి వాస్తవం. ఒక శాఖ పరంగా బాధ్యత వహించాల్సిన మంత్రులకు ఎటువంటి అధికారాలు లేవు. కారు, ఫ్యాను, ఫోను తప్ప మంత్రులకు చెప్పుకోవటానికి ఏమీ లేదు. వ్యవస్థీకృతంగా ఈవేళ రాష్ట్రాల మీద పెత్తనం చెలాయించే అవకాశం యూనియన్‌కు లేదు. కాకపోతే వ్యక్తిగత వ్యవహార శైలి వల్ల కొంత ఆధిపత్యం ప్రదర్శిస్తున్నట్లు అనిపించవచ్చు. పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ లాంటి నేతలు కొంత మృదువుగా, ఒప్పించేరీతిలో వ్యవహరించారు. అదే నరేంద్ర మోదీ కొంచెం కరకుగా, దూకుతున్నట్లు వ్యవహరిస్తారు. ఆ వ్యక్తిగత శైలిని వ్యవస్థకు అన్వయించనక్కర్లేదు. కొందరి వ్యక్తిగత ధోరణులతో మారిపోయే స్థాయి దేశం కాదు భారత్. మన దేశం గురించి, మన ప్రజల గురించి కాకుండా నా అధికారం, నా పెత్తనం అని ఆలోచించే రాజకీయ ధోరణులే అసలు సమస్య తప్ప.. రాజ్యాంగం కాదు.


THE CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity;

and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

Signature of the artist Beohar Rammanohar Sinha as 'Ram'
अलंकरणकर्ता ब्यौहार राममनोहर सिंहा के संक्षिप्त हस्ताक्षर 'राम'

ప్రపంచంలో ఏ దేశంలో ఇంతటి కేంద్రీకరణ లేదు. ఆ పొరపాటు ఒక్కటి జరిగింది. దాన్ని సవరించుకోవటం మన చేతుల్లో ఉంది. మనం చేసుకోవటంలా. అది తప్ప, రాజ్యాంగం ద్వారా పరిపాలన బాగా లేదన్నది పూర్తిగా అవాస్తవం. అందుకే అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పారు – 'ఎంత గొప్ప రాజ్యాంగమైనా కూడా అమలు చేసేవారి చిత్తశుద్ధి, వాళ్ల సామర్థ్యం, సంకల్పం వీటి మీద ఆధారపడి ఉంటుంది' అని. అలాగే రాజ్యాంగ సభ అధ్యక్షుడు, భారత తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చెప్పారు – 'ఒక వేళ రాజ్యాంగంలో పొరపాట్లు ఉన్నా కూడా పాలించేవాళ్లు నిజాయతీపరులు, సమర్థులు అయితే అద్భుతంగా చేయవచ్చు. రాజ్యాంగం అద్భుతంగా ఉన్నా కూడా, పాలించేవాళ్లలో సత్తా లేకుంటే, చిత్తశుద్ధి లేకుంటే అది సరిగ్గా నడవదు'. రాజ్యాంగాన్ని చించి కొత్త రాజ్యాంగం రాసుకోవటం ప్రపంచంలో దాదాపు ఏ దేశంలోనూ పెద్ద ఫలితాన్నివ్వలేదు. మన రాజ్యాంగంలో మౌలికంగా పెద్ద ఇబ్బందులు లేవు. చిన్నవి ఏమన్నా ఉంటే సవరించుకోవటంలో తప్పు లేదు..

# విభజన సమస్యలపై జగన్, చంద్రబాబు గళం విప్పాలి

ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు యూనియన్ హోం శాఖ కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలోనైనా గళం విప్పాలని అనంతపురం జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు వెంకట రమణ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాయితీలు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయం మొదలైన అంశాలను ఎందుకు యూనియన్ ప్రభుత్వం దాటవేస్తోందో ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీల ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు విభజన హామీల అమలుపై ఇంకా డ్రామాలాడితే ప్రజలు సహించరన్నారు.

రాష్ట్ర విభజన సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆదోని డివిజన్ కన్వీనర్ సి.శేఖర్ కూడా డిమాండ్ చేశారు. ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జి రామదాసు గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమగ్ర నివేదికను రూపొందించారని, ఇతర రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులు కూడా దాన్ని ఆమోదించారని, ఈ నివేదిక ఆధారంగా హేతుబద్ధంగా యూనియన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. సమావేశంలో దేవనకొండ మండలం అధ్యక్షుడు పెద్ద రాజు, ప్రధాన కార్యదర్శి నాయుడు, చిరంజీవి, దొడ్డి రామాంజనేయులు, పెద్దయ్య, కుంకనూరు శీను, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి లోబడే మార్పుచేర్పులు

## -డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



**రెండో ప్రపంచ యుద్ధం తరవాత వలసవాద సంకెళ్ల నుంచి విముక్తి పొంది, రిపబ్లిక్‌గా అవతరించడంతోపాటు ప్రజాస్వామ్యం, సార్వత్రిక వయోజన ఓటు హక్కు, చట్టబద్ధపాలన, రాజ్యాంగబద్ధ వ్యవస్థ, లౌకిక వాదం, పీడితులకు రక్షణ వంటి విశిష్టతలతో ముందడుగు వేసిన మొట్టమొదటి గొప్పదేశం ఇండియానే. ప్రతి ఏటా జనవరి 26న మనం ఎంతో ఆనందోత్సాహాలతో పండగ చేసుకోవాలనడంలో సందేహం లేదు. భారత రాజ్యాంగం మానవతకు, స్వేచ్ఛకు, వివేకానికి ప్రతీక!**

**మన రాజ్యాంగం మనకు బాగానే ఉపయోగపడిందా అని అనుమానించేవారు ఎందరో ఉన్నారు. మన రాజ్యాంగం, మన ప్రజాస్వామ్యం బాగా పనిచేశాయనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.**

భారత రిపబ్లిక్ యాభై అయిదో వార్షికోత్సవాన్ని ఎల్లుండి జరుపుకోబోతున్నాం. ఈ పవిత్ర సందర్భం ఆత్మశోధనకు మనకు మంచి అవకాశం కల్పిస్తుంది. రాజ్యాంగసభ సభ్యులు ఎన్నో ఆశలు, ఆశయాలతో 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించారు. 1950 జనవరి 26న కొత్త రాజ్యాంగం కింద రిపబ్లిక్ ఆవిర్భవించింది. ఏ ప్రమాణాల ప్రకారం చూసినా అదో అసాధారణ సన్నివేశం. ఆధునిక ప్రపంచంలో తొలి రిపబ్లిక్- అమెరికా సంయుక్త రాష్ట్రాలు. ప్రముఖ తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు థామస్ జఫర్సన్ 1776లో రూపొందించిన ముసాయిదా ప్రకారం స్వాతంత్ర్య ప్రకటన విడుదలైంది. ఫిలడెల్ఫియాలో జరిగిన కాంటినెంటల్ కాంగ్రెస్ దానిని ఆమోదించింది. దాంతో పదమూడు అమెరికా వలస ప్రాంతాలు బ్రిటిష్ పాలనను తోసిపుచ్చినట్లయింది. ఆ తరవాత అమెరికా విప్లవంలోను, స్వాతంత్ర్య పోరాటంలోను అమెరికా దళాలు విజయం సాధించాయి. పదమూడు స్వతంత్ర రాజ్యాలను ఏకీకృతం చేసి, గట్టి ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పని మాత్రం మిగిలిపోయింది. 1787లో కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశమై, భవిష్యత్ రాజ్యాంగంపై సమాలోచనలు ప్రారంభించింది. రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రాలు సర్వసత్తాక, సార్వభౌమాధికారాలు కలిగి ఉండాలని రిపబ్లికన్లు అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలను సమైక్యపరచి, నియంత్రించే పటిష్ఠమైన ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఫెడరలిస్టులు సూచించారు. చివరికి రాజీ కుదిరింది. 1789లో అమెరికా రాజ్యాంగానికి ఆమోదం లభించింది. స్వాతంత్ర్య యుద్ధ యోధుడు జార్జి వాషింగ్టన్ అమెరికాకు తొలి అధ్యక్షుడయ్యారు. ఎనిమిదేళ్లపాటు అధికారంలో ఉన్న ఆయన, వైరివర్గాలను ఒక్కతాటిపై నిలపగలిగారు. 1797లో స్వచ్ఛందంగా పదవిని త్యాగం చేయడం ద్వారా ఆయన మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఆధునిక ప్రపంచపు తొలి రిపబ్లిక్‌గా అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించింది.

అమెరికా రాజ్యాంగం తొలి లిఖిత రాజ్యాంగంగా చరిత్రకెక్కింది. కానీ తొలి సంవత్సరాల్లో అమెరికా రిపబ్లిక్ తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. జఫర్సన్, మాడిసన్‌ల సారథ్యంలోని రిపబ్లికన్ గ్రూపు, హామిల్టన్, ఆడమ్స్ నాయకత్వంలోని ఫెడరలిస్టు వర్గానికి మధ్య దాదాపు దశాబ్దకాలంపాటు అమీతుమీ కొనసాగింది. పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని ఫెడరలిస్టులు, రాష్ట్రాలు గట్టిగా ఉండి పరిమిత సమన్వయ అధికారాలు కలిగిన ఫెడరల్ ప్రభుత్వం ఉండాలని రిపబ్లికన్లు పట్టుపట్టారు. శాంతిసాధనకు, దక్షిణాది రాష్ట్రాల మద్దతు పొందేందుకు బానిసత్వ సమస్యను తొలుత కావాలనే పక్కన పెట్టారు. చివరికి 1800లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జఫర్సన్ అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో ఫెడరలిస్టులపై రిపబ్లికన్లదే పైచేయి అయింది. రిపబ్లికన్లు రాష్ట్రాల హక్కులను పరిరక్షిస్తూనే కొంతవరకు ఫెడరలిస్టు సిద్ధాంతాన్నీ అనుసరించారు. బానిసత్వ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. 1861 నుంచి 1865 వరకు జరిగిన అంతర్యుద్ధం, వివేకవంతమైన అబ్రహాం లింకన్ నాయకత్వం పుణ్యమా అని చివరికి సంక్షోభం పరిష్కారమైంది. ఆఫ్రో-అమెరికన్ బానిసలు విముక్తులయ్యారు. అయినా, అనేక దశాబ్దాల పాటు మహిళలకు, నల్లవారికి నిజమైన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అందని మావిపళ్లుగానే మిగిలిపోయాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చాక 140 ఏళ్ల తరవాత, 1920లలో మాత్రమే మహిళలకు ఓటుహక్కు లభించింది. నల్లజాతి పురుషులకు, ఓటువేసే హక్కును అంతర్యుద్ధం తరవాతే కల్పించినప్పటికీ, 1960లలో పౌరహక్కుల ఉద్యమంలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ స్ఫూర్తిదాయక నాయకత్వం తరవాతే దక్షిణాది రాష్ట్రాలలోని ఆఫ్రో-అమెరికన్ జనాభాకు ఆ హక్కు సాకారమైంది. టెలివిజన్ కారణంగా అత్యంత వేగవంతంగా వ్యాప్తి చెందిన మొట్టమొదటి గొప్ప ఉద్యమమది. వాషింగ్టన్‌లోని లింకన్ మెమోరియల్‌కు మిలియన్ మార్చ్ వంటి ఆనాటి శక్తిమంతమైన ఉద్యమాలు, ఉద్విగ్న సన్నివేశాలెన్నింటినో ముందుతరాల వారి కోసం కెమెరాల్లో భద్రం చేసి ఉంచారు.

**విప్లవాత్మకం**

అమెరికాలో స్వాతంత్ర్య ప్రకటన సమయంలోను, మొట్టమొదటి

రిపబ్లిక్ రాజ్యాంగ నిర్మాణ సందర్భంగాను ఇచ్చిన హామీలు నెరవేర దానికి 180 ఏళ్లు పట్టింది. చాలా నిదానంగా చోటుచేసుకున్న పరిణామ క్రమమది. దాంతో పోలిస్తే భారత రాజ్యాంగం ఎంతో విప్లవాత్మకమైనది. మహిళలు, దళితులు సహా పౌరులందరికీ ఒక్కసారిగా ఇది ఓటు హక్కు ప్రసాదించింది. మన స్వాతంత్ర్య యోధులు గొప్ప ఆదర్శవాదాన్ని, మన ప్రజానీకం పట్ల అపార విశ్వాసాన్ని ప్రదర్శించి వయోజన ఓటు హక్కు కల్పించారు. రిపబ్లిక్ సూత్రాలను అనుసరించారు. ఆనాడు మన దేశాధినేతగా ఉన్న గవర్నర్ జనరల్, రాజ్యాంగాన్ని స్వయంగా ఆమోదించలేదు. రాజ్యాంగ సభ సభ్యులు విశిష్టమైన, ఆలోచనయుతమైన నిర్ణయం తీసుకొని కొత్త రాజ్యాంగంపై సంతకాలు చేశారు. రాజ్యాంగపత్రం ప్రజలకు ఎవరో ఇచ్చిన బహుమతి కాదు. "మేము, ప్రజలము"- అంటూ రాజ్యాంగ పీఠిక నిర్ద్వంద్వంగా ప్రకటించడాన్ని బట్టే రాజ్యాంగం మనదని స్పష్టమవుతోంది. రాజ్యాంగ సభ, గొప్ప దార్శనికుడైన బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పాటైన రాజ్యాంగ రచన సంఘం మనకు స్వయం పాలనకు సంబంధించి విశిష్టమైన డాక్యుమెంటును అందజేశాయి. ఉక్కుమనిషి సర్దార్ పటేల్ 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడం మరో గొప్ప పరిణామం. ఒక్క బుల్లెట్ పేల్చకుండానే, ఒక్క నెత్తుటి చుక్క రాల్చకుండానే సంస్థానాలు విలీనం కావడం మహాద్భుతమే. మన ప్రత్యేక చరిత్ర నేపథ్యంలో రాష్ట్రాల హక్కుల గురించి తీవ్రస్థాయి చర్చ ఎన్నడూ జరగలేదు. దేశ విభజన అనంతరం పటిష్ఠమైన యూనియన్ ప్రభుత్వాన్ని రాజ్యాంగ సభ ఏర్పరచింది. వికేంద్రీకృత, రాష్ట్రాలకే ప్రాముఖ్యం గల రిపబ్లిక్ ఏర్పడితే బాగుంటుందని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. కానీ దేశ విభజన రగిలించిన గాయాలు, రేకెత్తించిన భయాందోళనలు దాదాపు ఫెడరల్ స్థాయిలో పటిష్ఠమైన కేంద్రం ఏర్పాటుకు దారితీశాయి.



శతాబ్దాలుగా మన సమాజాన్ని కుల వ్యవస్థ గుల్లబారుస్తోంది. కులాన్ని బట్టి మనిషికి ప్రాధాన్యం లభిస్తుండటం- తీవ్ర అసమానతలకు దారితీస్తోంది. ఈ రుగ్మతను తొలగించేందుకు ప్రయత్నించడం మన రాజ్యాంగ నిర్మాతలు చేపట్టిన మహత్కార్యం. అంటరానితనాన్ని నిషేధించారు. సమానత్వం, చట్టపర, న్యాయబద్ధ పాలన మన రాజ్యాంగంలో కీలకాంశాలయ్యాయి. కులం, మతం, ప్రాంతం, భాష, లింగ భేదాలకు అతీతంగా పౌరులంతా చట్టం ముందు సమానులయ్యారు. మన రిపబ్లిక్‌లో ఆవిర్భవించిన నాయకులు మరో అడుగు ముందుకు వేశారు. శతాబ్దాల తరబడి వివక్షకు గురైన అడుగు, బడుగు వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించారు. విద్య, ఉపాధి, ఇతర ప్రభుత్వ విధానాలు, పథకాల్లో వారికి ప్రాధాన్యం ఇచ్చారు. మైనారిటీలకు ప్రత్యేక హక్కులు ఇవ్వడం, చట్టం ముందు వారినీ సమానులను చేయడం మరింత గణనీయమైన పరిణామం. మధ్యయుగాల్లో భారతదేశ చరిత్ర అంతా అలజడులు, అల్లకల్లోలాల మయమే. దేశ విభజన సందర్భంగా అనూహ్యమైన, అసాధారణమైన స్థాయిలో హింసాకాండ చెలరేగి నెత్తురు పారింది. అయినప్పటికీ లౌకికవాదానికి గట్టిగా కట్టుబడి, అల్పసంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక హక్కులు కల్పించడమంటే మానవత్వానికి హారతి పట్టడమే. మత దురభిమానాన్ని, మతపరమైన అసహనాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడమే.

రెండో ప్రపంచ యుద్ధం తరవాత వలసవాద సంకెళ్ల నుంచి విముక్తి పొంది, రిపబ్లిక్‌గా అవతరించడంతో పాటు ప్రజాస్వామ్యం, సార్వత్రిక వయోజన ఓటు హక్కు, చట్టబద్ధపాలన, రాజ్యాంగబద్ధ వ్యవస్థ, లౌకికవాదం, పీడితులకు రక్షణ వంటి విశిష్టతలతో ముందడుగు వేసిన మొట్టమొదటి గొప్ప దేశం ఇండియానే. ప్రతి ఏటా జనవరి 26న మనం ఎంతో ఆనందోత్సాహాలతో పండగ చేసుకోవాలనడంలో సందేహం లేదు. భారత రాజ్యాంగం మానవతకు, స్వేచ్ఛకు, వివేకానికి ప్రతీక! మన రాజ్యాంగం మనకు బాగానే ఉపయోగపడిందా అని అనుమానించేవారు ఎందరో ఉన్నారు. మన రాజ్యాంగం, మన ప్రజాస్వామ్యం బాగా పనిచేశాయనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. మనం నాలుగు గొప్ప విజయాలు సాధించాం. అందులో మొదటిది క్రమం తప్పకుండా ఎన్నికలు జరపడం, శాంతియుతంగా అధికారాల బదిలీ. భారత్ గత 55 ఏళ్లుగా ఈ పంథాలో సాగుతోంది. మన వ్యవస్థలు మనుగడ సాగించగలగడం రెండో విజయం. వాటిలో అనేకం మన ఆశలను నెరవేర్చలేకపోయి ఉండవచ్చు. కానీ మన రాజ్యాంగ మౌలిక స్వరూప - స్వభావాలు, మన పాలన నిర్వహణ సంస్థల్లో చాలా భాగం చెక్కు చెదరలేదు. సునామీ విసిరిన సవాలును భారత్ ఎదుర్కొన్న తీరు మన పాలన నిర్వహణ సంస్థల మౌలిక శక్తి సంపన్నతకు నిలువుటద్దం. దేశంలో ఏళ్ల తరబడి రాజకీయ పరమైన శాంతియుత వాతావరణం నెలకొనేలా చేయడంలో మన పార్టీలు, రాజకీయవాదులు సఫలం కావడం- మూడో విజయం. రాజకీయ నాయకులు అనేక విషయాల్లో మన నమ్మకాన్ని వమ్ముచేసి ఉండవచ్చు. కానీ రాజకీయ ప్రక్రియలో అందరినీ కలుపుకొని పోవడంలో, ప్రజాస్వామిక సంవిధానంలో అన్ని వర్గాల ప్రజలకు భాగస్వామ్యం కల్పించడంలో వారు అనుసరించిన దృఢమైన, సమతుల్యమైన, వివేకవంతమైన వైఖరిని మనం గుర్తించాలి, గౌరవించాలి. మన రాజకీయ వ్యవస్థలో అనేక లొసుగులు, లోటుపాట్లు ఉండవచ్చు. కానీ మొత్తం మీద ప్రజాస్వామ్యం మరింతగా విస్తరిస్తోంది. చొచ్చుకుపోతోంది.

దేశ విభజన తాలూకు చేదు జ్ఞాపకాలు క్రమేపీ మరుగున పడుతుండటంతో ఇండియా ఫెడరల్ తరహా ప్రజాస్వామ్యం నుంచి నిజమైన ఫెడరల్ వ్యవస్థగా రూపుదాల్చడం నాలుగో విజయం. దశాబ్దాల తరబడి వాదోపవాదాలు, పోరాటాల దరిమిలా ఇది సాధ్యపడింది. ఇందుకు మూడు అంశాలు దోహదపడ్డాయి. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పు తరవాత 356వ అధికరణకు దాదాపు ఆయువు తీరింది. ప్రభుత్వ రంగ పెట్టుబడుల ద్వారా లేనిపోని దాతృత్వాన్ని ప్రదర్శించుకొనే విచక్షణాధికారం ఒకప్పుడు కేంద్రానికి ఉండేది. ఆర్థిక సరళీకరణ వల్ల ఇప్పుడు దాని అవసరం తీరింది.

సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి కావడంతో రాష్ట్రాలపై కేంద్రం స్వారీ చేయడం అసాధ్యమైపోయింది. ఇందుకు అదనంగా ఆర్థిక సంఘం ద్వారా న్యాయబద్ధంగా సజావుగా నిధులు కేటాయించడం వల్ల మన ఫెడరలిజం మరింత బలపడింది.

**గొప్ప అవకాశం**

మన ప్రజాస్వామ్యంలో, రాజకీయాల్లో అనేక లోపాలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో రాజ్యాంగం పనితీరునే మార్చాల్సి వచ్చింది. రాజ్యాంగానికి వంద సవరణలు చేశామంటే, దాన్ని మనం ఎంతగా దుర్వినియోగపరిచామో అర్థమవుతుంది. మన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకురావలసిన సమయమిదే. అవినీతి, నేరగ్రస్థత మన రాజకీయాలను మహమ్మారిలా పట్టిపీడిస్తున్నాయి. శక్తి సామర్థ్యాలను రుజువు చేసుకొనే అవకాశాలు లభించక పేదలు, అణగారిన వర్గాల వారు మరింతగా కుంగిపోతున్నారు. ప్రజాస్వామిక ప్రక్రియ చట్టబద్ధత క్షీణిస్తుండటంతో తరచు హింసాకాండ తలెత్తుతోంది. మన రాజకీయాల్లో, పాలన వ్యవస్థలో మౌలికమైన సంస్కరణలు తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. మన వ్యవస్థ రోగగ్రస్థమైపోయింది. దీనికి తక్షణ చికిత్స అవసరం. కానీ, మహోన్నతమైన, మానవతా విలువలు కలిగిన రాజ్యాంగం మనకు ఉన్నదని, అది సంతృప్తికరంగా పనిచేస్తోందని మనం గుర్తించాలి. సంక్షోభాన్ని తిప్పికొట్టే సామర్థ్యం గల ప్రజాస్వామిక వ్యవస్థ మనకు ఉంది. ముందుచూపు కలిగిన నాయకత్వం మనకిప్పుడు కావాలి. సొంత, సృజనాత్మక ఆలోచనలను మనం అమలు చేయాలి. తమ ప్రయత్నాల ద్వారానే నిజమైన పరివర్తన సాధ్యమని ప్రజలు గుర్తించడం అంతకన్నా ముఖ్యం. అదేసమయంలో మనకు సార్వభౌమత్వాన్ని, మన రిపబ్లిక్‌ను పునరుత్తేజితం చేసే అవకాశాన్ని కల్పిస్తున్న మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసుకోవాలి. మనం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే మన రిపబ్లిక్ 60వ వార్షికోత్సవానికి ముందే మన ప్రభుత్వ సంస్థలను, మన రాజకీయాలను, పరిపాలన వ్యవస్థను సంస్కరించుకోగలం. ఇది మన ముందున్న గొప్ప అవకాశం.

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా జనవరి 24, 2005న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)**

# అధికారాన్ని పునర్నిర్వచించటమే మన పోరాటం కావాలి

మన రాజ్యాంగంలో ఎంతో ముందుచూపుతో ఏర్పాటు ఉన్నా, దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటంలో మన రాజకీయ వ్యవస్థ విఫలమైందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలిచినట్లే, తక్కువ వస్తే మాత్రం ఎన్ని ఓట్లు వచ్చినా ప్రయోజనం లేదు.. అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ మన దేశం ఉన్న పరిస్థితులకు తగదన్నారు. దీని వల్ల డబ్బు, మద్యం, ప్రలోభాలు, తాత్కాలిక పథకాల రాజకీయం పెరిగిపోయి ఓటుకు-ప్రజల జీవితాలకు సంబంధం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల వ్యవస్థలోని సంక్షోభం వల్ల ప్రజాస్వామ్యానికి కీలకమైన రాజకీయ పార్టీలు కూడా భ్రష్టుపట్టి కొందరు నేతల ప్రయివేటు ఎస్టేట్‌లుగా తయారయ్యాయని, దీని వల్ల భారత్ భారీ మూల్యం చెల్లిస్తోందన్నారు. మంచి రాజకీయం చేసే పార్టీలు దామాషా ఎన్నికల పద్ధతి వల్ల వేళ్లూనుకోగలుగుతాయన్నారు. దామాషా ఎన్నికల పద్ధతికి బదులు కమ్యూనల్ అవార్డును ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను నిర్వంద్వంగా తోసిపుచ్చారు. 1932లో కమ్యూనల్ అవార్డు, రిజర్వుడు నియోజకవర్గాల మధ్య అమీతుమీ తేల్చుకునేరీతిలో వ్యవహరించకుండా.. గాంధీ, అంబేద్కర్‌లు దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెడితే బాగుండేదన్నారు. అయితే అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో దామాషా పద్ధతికి రాజ్యాంగంలో అవకాశం కల్పించారన్నారు. గ్లోబల్ ఎన్నారై ఫోరం ఆధ్వర్యంలో 'భీమ్ బాట' మొబైల్ అప్లికేషన్ యాప్ ఆవిష్కరణ సందర్భంగా 'చట్టసభల్లో, పౌర సమాజాల్లో సమాన నిష్పత్తి ప్రాతినిధ్యం' అంశంపై హైదరాబాద్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. బీఎస్‌పీ రాష్ట్ర సమన్వయకర్త ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ చర్చను నిర్వహించగా, శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి తదితరులు మాట్లాడారు. దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటం కోసం కొన్నేళ్ల క్రితం తాను విశ్వప్రయత్నం చేశానని, కానీ వ్యక్తిగతంగా ఎంతో నిజాయతీపరులైన కొందరు కమ్యూనిస్టు నాయకుల మూర్ఖత్వం వల్ల 2005లో ఆ అవకాశం తృటిలో తప్పిపోయిందని జేపీ తెలిపారు. జాతీయ స్థాయిలో తక్కువ శాతం ఓట్లతో ఎక్కువ సీట్లు పొందుతున్న ఈవేళ్టి పాలకులు దామాషా పద్ధతికి అంగీకరించరని, అందుకే ఎక్కువ శాతం ఓట్లు వచ్చిన పార్టీకి అదనపు సీట్లు వంటి ప్రతిపాదనలతో వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలన్నారు. అలాగే అధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు స్థాయికి వికేంద్రీకరించటం ఇప్పుడు భారత్‌కు ఎంతో అవసరమన్నారు. వీటన్నిటితోపాటు అధికారం ఎందుకో కూడా మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలందరికీ ఎదిగే అవకాశాల కోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం, చట్టబద్ధపాలన అమలు చేయటం వంటివి రాజకీయాలకు కేంద్రబిందువు కావాలన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఎజెండా కోసం రాజీ లేకుండా ప్రవీణ్ చేస్తున్న కృషిని జేపీ అభినందిస్తూ, అణగారిన వర్గాల నుండి ఈ డిమాండ్లు రావటం అభినందనీయమని, ఒక్క గొంతు కాకుండా వందల సంఖ్యలో ఇలాంటి నాయకులు ఆవిర్భవించాలన్నారు. వ్యవస్థలో ప్రోత్సాహకాల్ని మారిస్తేనే మనందరం కోరుకుంటున్న మౌలిక మార్పు సాధ్యమవుతుందని, ఇందుకోసం జీవితకాల పోరాటానికి సిద్ధపడాల్సుంటుందని, కానీ కచ్చితంగా గెలుస్తామని జేపీ స్పష్టం చేశారు.





# సమతా విగ్రహం-రాజ్యాంగ కర్తవ్యం

హైదరాబాద్ ముచ్చింతల్ వద్ద రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ ఆస్తిక, నాస్తిక, ఇతర విశ్వాసాలతో సంబంధం లేకుండా ప్రజానీకంలో అనేకమందిని ఆకట్టుకుంది. శిల్పకళా చాతుర్యం, భారీ ప్రచారం, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధికార పార్టీల, సంపన్నుల, జీయర్ స్వామి భక్తులు, వైష్ణవ పంథా విశ్వాసుల అండదండలతో మాత్రమే అది సాధ్యం కాలేదు. అంతటి భారీ మోహరింపునకు తగిన అర్హతను కలిగివుండటంతోపాటు.. నేటి ఆధునిక ప్రజాస్వామిక కాలానికి కావాల్సిన ఒక గొప్ప అర్హతను ఎప్పుడో వెయ్యేళ్ల క్రితమే మూటగట్టుకుని ఉండటం వల్లే రామానుజుని విగ్రహానికి అంతటి ఆకర్షణ సమకూరింది. పురాణ పురుషులైన దేవుళ్ల ఆలయాలకు కూడా ఇంత ఘనత లభించలేదేమో!



రామానుజుడు హిందూ మత మౌలిక సూత్రాలను ప్రశ్నించలేదు కానీ, ఆ మతాన్ని ప్రజాస్వామీకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే అష్టాక్షరి మంత్రాన్ని బహిరంగంగా గుడి గోపురం మీద ఎక్కి ప్రజలందరికీ అందించారు. హిందూ మత మనుగడకు ఆ ప్రజాస్వామీకరణ ఎంత కీలకమో గుర్తించారు కాబట్టే.. ఆ తర్వాత వచ్చిన మత గురువులు, సాధువుల్లో అనేకమంది రామానుజాచార్యుల ప్రభావంతోనే తమ రచనల్ని, బోధనల్ని, కార్యక్రమాల్ని మలచుకున్నారు. అందుకే అపార సనాతన నిష్ఠాగరిష్టులయిన మతగురువుల కంటే కూడా అనేకరెట్లు ఎక్కువగా రామానుజులు ఆదరణను పొందగలిగారు. ఆధునిక ప్రజాస్వామ్య యుగం కావటంతో.. రామానుజుని సమానత్వ ప్రవచనం ఈవేళ్టి తరాన్ని మరింత త్వరితంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలోనే.. రామానుజుడి కట్టు, బొట్టుని ఛాందసం అనుకున్నా, చివరికి రామానుజుడెవరో కూడా సరిగా తెలియకున్నా కూడా ఆయన సమతావాదం, ఆ సమత్వాన్ని చాటేందుకు ఆ రోజుల్లో ఆయన చేసిన సాహసోపేత ప్రయత్నం, సమాజహితం కోసం సొంత సుఖాన్ని త్యాగం చేసిన వైనం ఈవేళ ఆయన విగ్రహావిష్కరణను ఆకర్షణీయం చేశాయి.

సాధువుగా బతకాలనుకునేవారు వ్యక్తిగత సుఖాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. కానీ సాధువులకు ఉండే మోక్షం పొందాలనే స్వార్థాన్ని కూడా సమాజహితం కోసం త్యాగం చేయటంతోపాటు, జనం కోసం, సమానత్వం కోసం నరక కష్టాల్ని కూడా అనుభవించటానికి రామానుజుడు సిద్ధపడ్డారు. ఇది ప్రపంచస్థాయి ఆకర్షణీయ ఘట్టానికి కావలసిన నాయక స్థాయిని రామానుజునికి చేకూర్చింది. రామానుజుడు, ఆయన విగ్రహం ఏర్పాటు వెనక ఉన్న వారి విశ్వాసాల గురించి పెద్దలోతుగా ఎవరూ పట్టించుకోవటం లేదు. సమతా సిద్ధాంతమే ప్రజలను ఆ మూర్తి వైపు ఆకర్షింప చేస్తోంది. నిర్వాహకులు కూడా మత కార్యక్రమాలు ఎన్ని చేస్తున్నా.. సమానత్వం చుట్టూనే ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. కరోనా మహమ్మారిపై వ్యాక్సిన్‌లాగా.. కుల వివక్ష వైరస్‌పై రామానుజుని స్ఫూర్తితో పోరాడదామని ఆయన సహస్రాబ్ది సమారోహ ఉత్సవాల ప్రారంభ సమయంలోనే పిలుపునిచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన హాల్ ఆఫ్ ఫేమ్‌ను కూడా సమానత్వం కోసం కృషి చేసిన అబ్రహం లింకన్, మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా వంటి వారితోనే ఏర్పాటు చేశారు. ఏతావాతా ఈ దేశంలో అత్యధికులు ఆచరించే ఓ మతం కన్నా కూడా.. ఓ సార్వజనీన మానవ విలువ రామానుజుని విగ్రహం ఏర్పాటుకి పునాది అయింది. ఆ విలువ పేరుతోనే స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీగా రామానుజుని విగ్రహం ఆవిష్కృతమైంది.

ప్రధాని కూడా సమానత్వం అంశం మీద ఎక్కువ వక్కాణింపు ఇచ్చారు. దేశంలో ఎలాంటి వివక్ష లేకుండా అందరూ అభివృద్ధి చెందాలని, భేదాభిప్రాయాలు లేకుండా ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయం పొందాలన్నారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్' మంత్రంతో కొత్త భవిష్యత్తుకు పునాదులు ఏర్పడతాయని, శతాబ్దాలుగా వేధింపులకు గురవుతున్న వారంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**తెలుగునాట రామానుజుని విగ్రహావిష్కరణపై రాజకీయ స్పందనలు కూడా అత్యధికం సమానత్వ జపమే చేశాయి.**

+ రామానుజాచార్యులు మోదీ కలలోకి వచ్చి తెలంగాణను గుజరాత్‌తో సమానంగా చూడాలనే ఉపదేశమివ్వాలి. అన్ని రాష్ట్రాలనూ సమానంగా చూసే దృష్టిని ఆయనకు ప్రసాదించాలని కోరుకుంటున్నా.. అని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు.
+ సమాజంలో సమతా విలువలు నెలకొల్పేందుకు వెయ్యేళ్ల క్రితమే పరితపించిన రామానుజులులాంటి వ్యక్తి గురించి భావితరాలకు తెలియాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్

జగన్ అన్నారు.

+ ప్రధానమంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా 'తెలంగాణకు సమానత్వం' (ఈక్వాలిటీ ఫర్ తెలంగాణ) హ్యాష్‌ట్యాగ్‌తో ట్విటర్‌లో కూడా తెలంగాణ మంత్రులు, టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణకు యూనియన్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, వివిధ రంగాలపై వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. సమతామూర్తి విగ్రహావిష్కరణ సందర్భంగానైనా తెలంగాణను సమానంగా చూడాలని కోరుతూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొందరు భారీ ఈక్వాలిటీ ఫ్లెక్సీని ప్రదర్శించారు.

విగ్రహాల ఏర్పాటుపై మౌలిక చర్చను అలా ఉంచితే, రామానుజుని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీకి బహుశా గుజరాత్‌లోని సర్దార్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ స్వదేశీ స్ఫూర్తి కావచ్చు. సమతామూర్తి విగ్రహం నుండి మరికొన్ని భారీ విగ్రహాలు కూడా రావచ్చు. స్టాచ్యూ ఆఫ్ వన్‌నెస్‌ను నెలకొల్పనున్నట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సమతామూర్తి విగ్రహ సందర్శన సమయంలోనే ప్రకటించారు. కానీ ఎన్ని విగ్రహాలున్నా, కొత్తగా ఎన్ని వచ్చినా స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ.. అన్నిటికీ పునాదిగా నిలిచే భావన! సమానత్వం లేకుండా దేశ ఐక్యత కూడా నిలబడదు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి, ఆ తర్వాత సందర్శించి రామానుజుల బంగారు విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.

"భారతదేశ ఐక్యత, సమగ్రతకు జగద్గురువు రామానుజాచార్యులు ప్రేరణ. రామానుజుల విగ్రహంతో భారతదేశం మానవ శక్తిని, స్ఫూర్తిని పొందుతుంది" అని ప్రధాని అన్నారు. దక్షిణాదిన పుట్టినా, ఈ క్రమంలో రామానుజుని ఖ్యాతి యావత్ భారతదేశాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరించారు.

"రామానుజులు ప్రవచించిన సమానత్వమనే మౌలిక సూత్రమే మన రాజ్యాంగానికి ఆలంబన. ఆ బాటలోనే మనం నిర్దేశించుకున్న ప్రాథమిక హక్కులు రాజ్యాంగాన్ని పరిపుష్టం చేస్తున్నాయి" అని రాష్ట్రపతి అన్నారు.

.. కానీ ఇంత విలువైన సమానత్వాన్ని సాధించటం ఈవేళ రామానుజుని మార్గం ద్వారా సాధ్యమా? ఒక ఆధునిక రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో అత్యున్నత పదవుల్లో ఉన్నవాళ్లు రామానుజ దర్శనంలో అంత మేరకేనా పరిమితమవ్వాల్సింది?.. ప్రశ్నించుకోవాలి.

ఆ రోజుల్లో రామానుజుడిది విప్లవాత్మకమైన, విశేషమైన చర్య అయివుండవచ్చు.

ఆ అష్టాక్షరి – మహావిముక్తి మంత్రం అని ఆరోజుల్లో రామానుజులు సహా నాయకత్వ స్థానంలోని పలువురు భావించి ఉండవచ్చు.

ఆ మహామంత్రంతో ఈతిబాధలు తీరి జీవితాలు గట్టెక్కుతాయని అప్పట్లో సామాన్య ప్రజలు కూడా అనుకుని ఉండవచ్చు. కానీ ఆ మంత్రాన్ని రామానుజులు చెప్పి వెయ్యేళ్లయినా, ప్రజల సమస్యలు తీరలేదు. ప్రజల జీవిత ప్రమాణాలు మెరుగుపడ్డాయా అంటే.. మానవుడు చేసిన నూతన ఆవిష్కరణల ద్వారా తప్ప, శాస్త్రీయ విద్య ద్వారా తప్ప.. మంత్రతంత్రాల ద్వారా జనం జీవితాల్లో మౌలిక మార్పు రాలేదు. ఒక మంచి ఆశయానికి కొన్ని అక్షరాలతో ఒక రూపం కల్పిస్తే మనకు (లక్ష్యం గుర్తుంటూ) విశ్వాసం పెరుగుతుందేమో గానీ, లక్ష్యం దానంతటదే లభించదు. మేరాభారత్‌మహాన్ అంటూ కూర్చుంటే భారతదేశ సమస్యలు పరిష్కారమవుతాయా, మనకు ఎదిగే అవకాశాలు లభిస్తాయా? కాబట్టి సమానత్వాన్ని నినాదం నుండి ఆచరణగా మార్చేందుకు సరైన మార్గాన్ని అనుసరించాల్సిన సమయమిది.

వెయ్యేళ్ల క్రితం రామానుజాచార్యులు ఉచ్చరించిన మంత్రాన్ని జపిస్తూ, ఆయన విగ్రహాన్ని సందర్శించటం, పూజించటంతోనే సరిపెడితే.. అది 21వ శతాబ్దంలో సమానత్వ సాధన అనిపించుకోదు.

రామానుజుడు ఈ 21వ శతాబ్దంలోనే పుట్టి ఉంటే మంత్రాలు, నినాదాల గురించి ఆలోచించేవారు కాదేమో. మంత్రాలకు చింతకాయలు రాలవని ముచ్చింతల్ సందేశంగా వినిపించేవారేమో. ఆయనకున్న విప్లవాత్మక దృక్పథానికి.. మత వ్యవస్థ ద్వారా కంటే, ఆధునిక పాలనా వ్యవస్థగా ఉన్న ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేయటం ద్వారానే ప్రజలకు ఫలితాల్ని అందించేందుకు కృషి చేసి ఉండేవారు. ఎందుకంటే, ప్రజాస్వామ్యం అంటేనే మౌలికంగా 'వ్యవస్థీకృత సమానత్వం' అని అర్థం!

కానీ ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్న మనం.. వెయ్యేళ్లు గడిచినా కూడా ఆ సమానత్వాన్ని ఇంకా మంత్రం, నినాదం, ఆదర్శంలో భాగంగానే చూస్తున్నాం. ఈ సమానత్వం కోసమే మనం రాజ్యాంగాన్ని రాసుకున్నా, పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నా, సమానత్వ భావన యువతను, సామాన్యుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నా, సాటి మానవుల పట్ల సహానుభూతి సైతం లేని వారు సైతం విధిగా మద్దతివ్వక తప్పని అంశమైనా.. సరైన ఆచరణను మాత్రం మనం ప్రదర్శించటం లేదు. చివరికి, రామానుజుడ్ని సైతం ప్రాచీనత పరిధిలో గుర్తించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం తప్ప, ఆయనలోని ఆధునిక ప్రజాస్వామికతను గుర్తించటానికి ఇష్టపడటం లేదు. సమతామూర్తి సాక్షిగా మనకు కనిపిస్తున్న చేదు నిజాలివి.

వివక్ష లేకుండా అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలుండాలంటే.. అందుకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం జేబుఖర్చు లేకుండా అందాలి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. న్యాయం వేగంగా, చౌకగా అందాలి.. ఈ పనుల కోసమే గదా మనం ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నది? కానీ ప్రధానమంత్రి నుండి రాష్ట్ర నేతల వరకూ ఎవ్వరూ పొరపాటున కూడా సమసమాజానికి సరైన మార్గాలుగా తమ చేతుల్లోనే ఉన్న ఈ

అంశాల గురించి మాట్లాడలేదు. ఏ రాజ్యాంగం ద్వారా తాము అధికారంలోకి వచ్చారో, ఆ రాజ్యాంగం నిర్దేశించిన మౌలికాంశాల గురించి, వాటిని అమలు చేయాల్సిన తమ బాధ్యత గురించి మాత్రం మాట్లాడలేదు. వివక్షకు గురైన దళితులు, ఇతర వర్గాల గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి పథకాల గురించి చెప్పుకొచ్చారు తప్ప.. రాజ్య వ్యవస్థ మౌలిక బాధ్యతల తీరుతెన్నులను సమీక్షించలేదు. దేశంలో అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలతో దళిత, గిరిజన, బహుజన, మహిళలు, ఇతర అసహాయులందరికీ న్యాయం జరుగుతోందన్నారు తప్ప.. విద్యలో నాణ్యత ఎందుకు లేదు? సరైన ఆరోగ్యం ఎందుకు అందించలేకపోతున్నారు? చట్టబద్ధపాలన ప్రక్షాళన ఎలా? అంశాలను మాట్లాడలేదు. ఈ మౌలిక రంగాల్లో రాజ్య వ్యవస్థ పాత్ర సక్రమంగా లేకుంటే, ఎన్ని అభివృద్ధి పథకాలను అమలు చేస్తే మాత్రం అణగారిన వర్గాల జీవితాలు బాగుపడతాయి? కిలో బియ్యం రూ.2కి ఇవ్వటం ప్రారంభించి నలభై ఏళ్లవుతున్నా, జాతీయ స్థాయిలో ఆహార భద్రతా చట్టం ఉన్నా, ప్రతి ఎన్నికకీ ఓ కొత్త పథకం వస్తున్నా పేదరికం ఎందుకు పోలేదు? కోట్ల మందికి ఎదిగే అవకాశాలు ఇంకా ఎందుకు అందుబాటులోకి రాలేదు?

భారతదేశంలోని గొప్ప వ్యక్తులతో తనను పోల్చుకుని ఆనందం పొందే స్వభావమున్న మోదీ, ఈ కార్యక్రమానికి కూడా రామానుజుని విగ్రహం రంగుతో పోటీ పడేలా బంగారు రంగు పట్టువస్త్రాలతో హాజరయ్యారు గానీ.. సమానత్వానికి రామానుజుల కంటే అనేకరెట్లు ఎక్కువగా కృషి చేసేందుకు తనకున్న అవకాశాల్ని, బాధ్యతల్ని తప్పించుకునే రీతిలో వ్యవహరించటం వల్ల ఒక సగటు రాజకీయ నేతలా మాత్రమే కన్పించారు. రామానుజుని చుట్టూ ఆకర్షణ విజువల్ ఎఫెక్ట్ కన్నా.. సమూల మానసిక పరివర్తనవాదిగా అలుపెరగని కృషి నుండి వచ్చిన గుర్తింపు!

సమానత్వం విషయంలో చైనా మన కంటే మెరుగ్గా ఉంది. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించటం ద్వారా సమానత్వానికి అవసరమైన మౌలిక పునాదిని చైనా తన సమాజానికి అందించింది. అలాగే ప్రజలకసంపదను కొల్లగొడుతూ వారి ఎదిగే అవకాశాలను దెబ్బతీసే, అసమానతల్ని పెంచే అవినీతిని తుదముట్టించేందుకు కఠిన చర్యల్ని చేపడుతోంది.

ధీరత్వానికి, శక్తికి, వివేకానికి ప్రతీకగా చెప్పుకునే నూతన 'టైగర్' చంద్రమాన సంవత్సరంలోకి చైనా ఇటీవల అడుగుపెట్టిన సందర్భంగా 'ఉమ్మడి శ్రేయస్సు' (కామన్ ప్రాస్పరిటీ) అంశాన్ని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అత్యంత ప్రాధాన్య ఎజెండాగా ప్రస్తావించారు. ఈ క్రమంలో అన్ని స్థాయిల్లో అవినీతిని రూపుమాపేందుకు కఠిన చర్యలకు ఆదేశించారు. అవినీతి వ్యతిరేక చర్యలను ముమ్మరం చేశారు. 'పెట్టుబడుల్లో లాలూచీ' అనే పదాన్ని అధ్యక్షుడు తన సందేశంలో వినియోగించారు.

అవినీతిలో కూరుకుపోయిన ఉన్నతస్థాయి పులులను, దిగువస్థాయి ఈగలను అణచివేస్తామని అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పుడే జిన్‌పింగ్ ప్రకటించారు. ఇప్పటివరకూ సుమారు పది లక్షల మంది అధికారులపై కొరడా ఝుళిపించారు. ఇందులో 50కి పైగా సైనిక అధికారులు కూడా ఉన్నారు. "దశాబ్దకాలంలో సుమారు 400 మంది మంత్రిత్వ శాఖల్లోని అవినీతిపరులైన ఉన్నతాధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆర్థిక నేరాలకు పాల్పడి, అప్పులు ఎగ్గొట్టి 120 దేశాలకు పారిపోయిన సుమారు 8,300 మందిని వెనక్కు తీసుకొచ్చింది" అని చైనా అధికార మీడియా పేర్కొంది. హాంగ్ జౌకు చెందిన రాజకీయ ప్రముఖుడు జౌజియాంగ్ యాంగ్‌ను.. పెట్టుబడుల్లో లాలూచీ ఆరోపణలపై ఇటీవల అరెస్టు చేయటం ద్వారా కార్పొరేట్ వర్గాలకు జిన్‌పింగ్ గట్టి హెచ్చరిక పంపారు. "మొదట్లో సాంకేతిక సంస్థలకే పరిమితమైన అవినీతిపరుల ఏరివేతను, ఆ తర్వాత ఇతర ప్రయివేటు సంస్థలకూ వర్తింపచేశారు. అవినీతిపరులైన సీనియర్ అధికారులు, వ్యాపారులపై మరింతగా ఉక్కుపాదం మోపనున్నారు" అని బీజింగ్ వర్గాలు తెలిపాయి. దీనివల్ల సంపద సృష్టి తగ్గుముఖం పడుతుందని వాదిస్తున్నవారు ఉన్నప్పటికీ.. అవినీతిని అంతం చేయకుండా అభివృద్ధి సాధ్యం కాదని పలు ప్రపంచ దేశాల అనుభవాలు రుజువు చేస్తున్నాయి. వ్యాపారాభివృద్ధికి అందరికీ సమానావకాశాలు, ప్రభుత్వ సామర్థ్యం వంటివి తప్ప అవినీతిని ప్రోత్సహించటం కాదని సింగపూర్ ఉదాహరణ చాలా స్పష్టంగా తెలియచేస్తోంది. ప్రజల ఎదిగే అవకాశాలకు అవసరమైన సంపదను కొల్లగొడుతూ, అసమానతల్ని పెంచే అవినీతిపై చైనా ఇలా హేతుబద్ధమైన విధానాలతో వెళ్తుంటే.. మన దేశం మాత్రం గతిలేక ప్రభుత్వోద్యోగులకు లంచాలిచ్చే ప్రజలను ఆ అధికారుల కంటే ముందు అరెస్టు చేసి జైలుకు పంపేలా పనికిమాలిన చట్ట సవరణ తీసుకొచ్చింది. అవినీతిలో అధికారులతో లాలూచీ పడిన సందర్భాల్లో కఠిన శిక్షలు ఉండాలని, హక్కుగా అందాల్సిన సేవలకు గతిలేక లంచాలిచ్చే ప్రజలు నేరస్తులు కాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పదేపదే చెప్పినా యూనియన్‌లోని మోదీ ప్రభుత్వం వినిపించుకోలేదు. అంతకుముందు 2జీ స్పెక్ట్రం కేటాయింపుల కేసులో కూడా లాలూచీ అవినీతి ఉందని సుప్రీంకోర్టులో నిరూపించటం ద్వారానే 122 లైసెన్సుల్ని రద్దు చేయించి దేశానికి లక్షన్నర కోట్ల దాకా నష్టాన్ని జేపీ నివారించారు. అప్పటి నుండే ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పాటల విధానం మన దేశంలో మొదలైంది. అవినీతి నిర్మూలనకు రాజకీయ సంకల్పం, సరైన విధానాలు లేకపోవటం వల్లే మోదీ ఎన్ని పెద్ద నినాదాలిచ్చినా, పెద్ద నోట్లను రద్దు చేసినా భారతదేశం అవినీతిలో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది.

మన దేశంలో అసమానతలు ఎంత తీవ్రంగా ఉన్నాయో, ఇటీవల ఆక్స్‌ఫాం నివేదిక కూడా వెల్లడించింది. భారత్‌లోని

# ఆ లేఖపై మనవాళ్లెవరి సంతకాలూ లేవు

కొవిడ్ వల్ల పేదల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిందని, ఇదేసమయంలో ధనవంతుల సంపద కూడా భారీగా పెరిగిందని ఆక్స్‌ఫామ్ సంస్థ ఇచ్చిన నివేదిక కొంతమంది మిలియనీర్లు పెద్ద మనసుతో స్పందించారు. 102 మంది మిలియనీర్లు ఓ లేఖను విడుదల చేస్తూ, ప్రపంచ ధనవంతులపై 'ధనం పన్ను' విధిస్తే.. ఏటా రూ.186 లక్షల కోట్లు (2.5 ట్రిలియన్ డాలర్లు) వసూలవుతుంది. ఆ డబ్బుతో అందరికీ కొవిడ్ వ్యాక్సిన్లు వేయటమే కాకుండా, 230 కోట్ల అభాగ్యులను పేదరికం నుండి బయటకు తీసుకురావచ్చని సూచించారు. ప్రతి దేశమూ స్థానిక ధనవంతుల నుండి పన్ను రూపంలో న్యాయమైన వాటా రాబట్టాలని అభిప్రాయపడ్డారు. 'ఇప్పుడున్న పన్ను విధానం న్యాయసమ్మతం కాదు. సంపన్నులను మరింత సంపన్నులు చేసేలా దీన్ని రూపొందించారు' అని లేఖలో వారు వ్యాఖ్యానించారు. 50 లక్షల డాలర్లకు పైగా సంపద ఉన్నవాళ్లకు రెండు శాతం, 500 లక్షల డాలర్లకు పైగా సంపద ఉన్నవాళ్లకు మూడు శాతం, వంద కోట్ల డాలర్లు దాటితే అయిదు శాతం పన్ను విధించాలని సూచించారు. అసమానతల్ని తగ్గించటంలో వ్యక్తిగత దాతృత్వాన్ని ప్రదర్శించే ఈ లేఖ రాసినవారిలో అమెరికా, కెనడా, జర్మనీ, బ్రిటన్, డెన్మార్క్, నార్వే, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, ఇరాన్ దేశాల మిలియనీర్లు ఉన్నారు తప్ప భారత్ నుండి ఎవరూ లేరు.

సంపన్నుల ఆదాయం 2021లో కొత్త రికార్డుల్ని అందుకుందని తెలిపింది. భారత్‌ను అత్యంత అసమానతల దేశంగా అభివర్ణించింది. ఇండియాలో పైస్థాయిలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు మొత్తం దేశ సంపదలో 57 శాతంపై యాజమాన్యాన్ని కలిగివున్నారు. అదే దిగువన ఉన్న యాభై శాతం మంది వద్ద కేవలం 13 శాతం వాటా ఉంది. 'వరల్డ్ ఇనీక్వాలిటీ నివేదిక' ప్రకారం.. భారత వయోజనుల సగటు జాతీయాదాయం రూ.2,04,200గా ఉంది. ఇందులో 50 శాతం ప్రజల సగటు ఆదాయం రూ.53,610 మాత్రమే. దేశంలో సగటు కుటుంబ సంపద రూ.9,83,010గా ఉంది. అలాగే కార్మికుల ఆదాయంలో స్త్రీల వాటా 18 శాతం మాత్రమే. ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాల వల్ల కొవిడ్ సంక్షోభం మరింత తీవ్రంగా ప్రజలను దెబ్బతీసి పేద, ధనిక అంతరాల్ని మరింత పెంచింది. భారత్‌లో 84% శాతం కుటుంబాల ఆదాయం 2020 నుండి తగ్గిపోయిందని, కొవిడ్ కారణంగా అన్ని దేశాలూ నష్టపోయినా ఇంత శాతం జనాభాకు ఆదాయం తగ్గటం ఎక్కడా లేదని ఓ ప్రముఖ ఆర్థిక నిపుణుడు విశ్లేషించారు.

సమతామూర్తి మన ప్రజాస్వామ్యంలోని ఈ ఘోరవైఫల్యాల్ని మనకు గుర్తుచేయాలి. మన దేశంలో అసమానతలకు కారణ మైన ఫ్యూడల్ సంస్కృతి నుండి మనం బయటపడేలా.. మంత్రం, నినాదం దశ నుండి మనల్ని ఆచరణ వైపు మళ్లించాలి. ప్రాచీనతల గురించి ఉపన్యాసాల చుట్టూ కాలక్షేపం చేయకుండా.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన మొదలైన ప్రభుత్వాలు చేయాల్సిన రాజ్యాంగబద్ధ మౌలిక బాధ్యతల్ని పాలకులు నెరవేర్చేలి, వాటి కోసమే ప్రజలు డిమాండ్ చేయాలి.

సమతామూర్తి క్షేత్రం రూపుదిద్దుకోవటంలో కీలక పాత్ర పోషించిన చిన జీయర్ స్వామి సహా కొందరు మత కోణం, పక్షపాత రాజకీయ ప్రయోజనాల మీద దృష్టి పెట్టి సహస్రాబ్ది సమారోహణలో కొన్ని సందర్భాల్లో మాట్లాడారు. రామానుజుని నుండే సమానత్వ భావన భారతదేశంలో మొదలైందన్నట్లు కూడా వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ధోరణులు సమతామూర్తి స్ఫూర్తికి విరుద్ధం. క్రీస్తుకు పూర్వం నుండే బౌద్ధం మనకు ఆధ్యాత్మికతలో, పాలనలో ధర్మం, సౌభ్రాతృత్వం, సమానత్వం వంటి విలువల్ని అందించింది. భారత రాజ్యాంగానికి కూడా ఈ విలువలు స్ఫూర్తినిచ్చాయని రాజ్యాంగ రచనా సంఘం సారథిగా డా॥ అంబేద్కర్ సైతం ప్రకటించారు. బౌద్ధం భారతీయ సమాజాన్ని ఎంత ప్రభావితం చేసిందో తెలియచేయటానికి మన జాతీయజెండా మీద ఉన్న ధర్మచక్రం పెద్ద సాక్షి. సమతామూర్తి పేరు మీద, ఆయన చుట్టూ కొన్ని సంకుచిత, విపరీత మాటలు, చర్యలు రామానుజుల విశిష్టతకేమీ కొరతలు కాలేవు కానీ, ఇలాంటి లోపాల్ని కూడా దిద్దుకోవటం అవసరం.

ఎవరెలా వ్యవహరించినా, ప్రజలు సమతామూర్తి సందర్శనను ఓ మతానికి మాత్రమే పరిమితమైన అంశంగా భావించనక్కర్లేదు. రామానుజుడి భావాలు, ఆచరణ ఈ సంకుచితాలకు అతీతమయినవి, విశ్వజనీనమైనవి. అందుకే భారతీయ సంస్కృతిలో భాగంగా ప్రతి ఒక్కరూ సమతామూర్తిని సందర్శించి ఆస్వాదించవచ్చు. అదేసమయంలో ఆ సమనత్వాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు విధిగా చేయాల్సిన పనులు, వాటిని పాలకుల చేత చేయించటానికి రాజ్యాంగం మనకు అందించిన అవకాశాలపైనా అందరూ దృష్టి పెట్టాలి. ఇందుకోసం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రతిపాదిస్తున్నట్లు రాజ్యాంగాన్ని తిరగ రాయాల్సిన అవసరం లేదు. మన రాజ్యాంగం ఉదాత్తమయినది, అందరినీ కలిపి ఉంచేది, అందరికీ ఎదిగేందుకు సమానావకాశాల్ని అందించేది, లోపాలుంటే స్వయందిద్దుబాటు శక్తి కలిగినది. రాజ్యాంగంపై చర్చ చేయటంలో తప్పు లేదు. కానీ అసమానతలు పోవటానికి, అందరికీ సమానావకాశాలు రావటానికి రాజ్యాంగాన్ని మార్చాలనటం పొరపాటు, ప్రమాదకరం కూడా. అసమానతలు పోవాలి అని రాసుకుంటే అసమానతలు పోవు గదా. అందుకు తగ్గ విధానాలు, వాటి అమలు కావాలి. అందుకు ఇప్పుడున్న రాజ్యాంగం సమగ్రంగా సరిపోతుంది. రాజకీయమే చాలటంలా. మన రాజ్యాంగబద్ధ కర్తవ్యానికి సమతామూర్తి విగ్రహం మనకు గొప్ప స్ఫూర్తినిస్తుంది.

# కోట్ల బతుకుల్ని బాగుచేసే అద్భుతావకాశం..

# ఈ సమగ్ర ఆరోగ్య విధానం

ప్రజలకు జేబుఖర్చు, ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించేలా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య పథకం నమూనా ('Towards Viable Universal Healthcare') ను రాజకీయ వ్యవస్థ, సమాజంలోకి తీసుకెళ్లి అమలు సాధించేందుకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం చేస్తున్న కృషిని వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు. విధానాన్ని లోతుగా అధ్యయనం చేయాలని, అవగాహనతో, చిత్తశుద్ధితో పనిచేస్తేనే మనం ఎదుటివారిని ఒప్పించగలమన్నారు. ఈ దేశం కోసం ఇంకా చాలా చేయాల్సి ఉన్నా, ఈ ఒక్క విధానాన్ని అమల్లోకి తేగలిగితే ఎంతో పెద్ద విజయం సాధించినట్లేనన్నారు. పేరు కోసం చూసుకోకుండా లక్ష్యసాధన కోసం పనిచేయాలని సూచించారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ విభాగం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో జేపీ ప్రసంగం స్థూల పాఠం:




లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర విభాగాన్ని మనసారా అభినందిస్తున్నాను. ఈవేళ మీరు చేస్తున్నది నిజమైన రాజకీయం. పత్రికలు, టీవీలు చూస్తే అదేదో రాజకీయం అనుకుంటాం. కానీ అది రాజకీయం కాదూ, పాడూ కాదు. అది అధికార క్రీడ. ఒక ఫ్యూడల్ ప్రక్రియ. పచ్చిగా మాట్లాడుకుందాం. నిజమైన రాజకీయం ఇది, ఇప్పుడు మీరు చేస్తున్నది మాత్రమే! మీరంతా ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారనుకోండి. ఏమిటి లక్ష్యం? ఇప్పుడు మీరు కృషి చేస్తున్న ఎజెండాను సాధించటమే. దాని కోసం ప్రయత్నం చేయటం, సాధించటం నిజమైన రాజకీయం.

మనం పత్రికలు, రాజకీయ పార్టీలు, ప్రజలకు అర్థమయ్యేట్లు నడిచి ఈ అంశాలపై ప్రజల్లో ఆసక్తిని పెంచాలి.

ఎందుకు ఆరోగ్యం? చాలా ఉన్నాయి గదా అనుకోవచ్చు.

చాలా ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వాలు ఈ దేశంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. అవన్నీ వదిలేసి, చేయకూడని పనులన్నీ నెత్తిన వేసుకుని, రెండు పక్కలా మనల్ని భ్రష్టుపట్టిస్తున్నాయి.

ప్రభుత్వాలు చేయాల్సింది మళ్లీ మళ్లీ చెబుతున్నాను. బట్టీపట్టి అర్థరాత్రి లేపినా మన మనసులో ఉండాలి. చట్టబద్ధపాలన, న్యాయాన్ని అందరికీ ఖర్చు లేకుండా, వేగంగా, ధర్మంగా అందించటం మొట్టమొదటిది. క్రిమినల్ న్యాయం కావచ్చు, సివిల్ న్యాయం కావచ్చు, మన హక్కుల రక్షణ వగైరా కావచ్చు. రెండోది, మౌలిక సదుపాయాలు. అంటే, స్థానికంగా మంచినీటి సరఫరా, మురుగునీరు పారుదల, వర్షపు నీటి నిర్వహణ వంటివి. వర్షమొస్తే వరదలొస్తే, రోడ్ల మీద గోతులుంటే ఏమి రాజకీయమది? ఎన్ని మాట్లాడుకుంటే ఉపయోగమేంటి, చెత్తాచెదారం. ఆ తర్వాత విద్యుత్తు, రవాణా. ఈ మధ్యకాలంలో విద్యుత్తు, రవాణా కొంత బాగుపడుతున్నాయి. ఎట్టకేలకు. ఎప్పుడో 70 ఏళ్ల క్రితం చేయాల్సింది. ఇంకా చాలా చేయాల్సుంది. కానీ పూర్వం కంటే చాలా మెరుగు. ఇవి అయిపోయాక, అందరికీ పుట్టుకతో నిమిత్తం లేకుండా, ఏ కుటుంబంలో పుట్టినా మంచి ప్రమాణాల విద్య. ఉత్తుత్తి విద్య, గ్రేస్ మార్కులు, కాపీ కొట్టడాలు, చెత్త పరీక్షలు కాదు. బండగా మాట్లాడుకుందాం. ఈ పరీక్షలు, ఈ కాపీ కొట్టడాలు, ఈ గ్రేస్ మార్కుల వల్ల ఏమీ ఉపయోగం లేదు. మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం. మనందరి పిల్లలకీ, ప్రతి కుటుంబంలో, ప్రతి కులంలో ప్రతిభ ఉన్నది. ప్రతిభ దేవుడు ఇచ్చాడు. అదృష్టంకొద్దీ దేవుడు అనేవాడు ఉంటే, దేవుడికి కులమతాలు లేవు, మనకు మూర్ఖులకు ఉంది గాని. తెలివితేటల్ని ఆ దేవుడు అందరికీ పంచాడు. ఈవేళ ఏదో పత్రికలో సంజీవయ్య గారి గురించి చదివాను. 39 ఏళ్ల వయసులో ఆయన ముఖ్యమంత్రి అయ్యాడు. ఏ అండా లేదు, కేవలం ప్రతిభతో. ఒకసారి ఏదో మంత్రి పదవి వస్తే వెళ్లిపోలా. అది చూసి ముఖ్యమంత్రిని చేశారు. అక్కడ బాగా చేశారని చూసి జాతీయ స్థాయి మంత్రిని చేశారు. అక్కడ బాగా ఉన్నారని జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిని చేశారు. దురదృష్టం కొద్దీ చిన్న వయసులోనే పోయారు. ప్రతిభ అందరిలో ఉంది. ఆ ప్రతిభ వికసించే అవకాశం ఉందా, లేదా?.. కులవ్యవస్థ పోవాలీ అంటే ఇంకో మార్గం లేదు. నాణ్యమైన విద్య ద్వారా తప్ప. మిగతావన్నీ గ్యాస్. అట్లాగే ఆరోగ్యం.

ఒక్కసారి మీరు చుట్టూ ఉన్న పేదలనందరినీ గమనించండి. దిగువ మధ్యతరగతివారిని గమనించండి. అనారోగ్యం కారణంగా, అకాల మరణాల వల్ల ఆ కుటుంబాలు ఎంత అస్తవ్యస్తమవుతున్నాయో చూడండి. మనం ఎక్కడికో వెళ్లనక్కర్లా. మనకు పెద్ద పెద్ద గణాంకాలు, పుస్తకాలు అక్కర్లా. జీవితానుభవం నేర్పుతుంది. నాతో 25 ఏళ్లు పనిచేసిన వారిని

చూస్తే.. అనారోగ్యం, అకాల మరణాల వల్ల ఎంత నలిగిపోతున్నారో, అవకాశాల్ని కోల్పోయి పేదరికంలో ఎలా మగ్గుతున్నారో కళ్ల ముందే కనిపిస్తుంది. కాబట్టే ఆరోగ్యం. ఏదో మన పుర్రెలో బుద్ధి పుట్టిందని కాదు. ప్రపంచంలో వందలాది అంశాలున్నాయి. కానీ కొన్ని కీలకమయినవి. ఇవి లేకపోతే అసలు సమాజమంతా అల్లకల్లోలమైపోతుంది. మిగిలినదంతా భ్రమ. ఇవి జరపనటువంటి ప్రభుత్వ వ్యవస్థ, రాజకీయం, ఎన్నికలు ప్రహసనాలు. అది ప్రజాస్వామ్యమవదు.

ప్రజాస్వామ్యం అంటే కేవలం స్వేచ్ఛ ఉంటే చాలదు, ఎన్నికలు ఉంటే చాలదు. ఈ మధ్య కాలంలో కొన్ని సందర్భాల్లో కొంచెం కఠినంగానే చెబుతున్నాను. నన్ను నక్సలైట్‌గా కూడా అనుకుంటారు. కాకపోతే ప్రజల్లో ఆ భావం లేదు కాబట్టి, నన్ను క్షమిస్తున్నారు. మన దేశంలో కంటే చైనా లాంటి దేశంలో ప్రజాస్వామ్యం కొంత ఎక్కువ ఉందని నేను బహిరంగంగా మళ్లీ మళ్లీ చెబుతున్నాను. వాస్తవం అది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు, అరిచే హక్కు, మన పత్రికల్లో, టీవీల్లో చూస్తున్నట్లుగా బూతులు తిట్టుకునే హక్కు కాదు. అట్టడుగున ఉన్న మనిషికి కూడా మౌలిక సదుపాయాల్ని కల్పించి, అవకాశాల్ని ఇచ్చి, వివక్షలేని సమాజాన్ని నిర్మాణం చేస్తే అది ప్రజాస్వామ్యం. దానికి విద్య, ఆరోగ్యం మించి సాధనాలు వేరే లేవు. ఈ రెండూ ప్రభుత్వ కర్తవ్యం. ఇంకా ఎన్నో ఉన్నాయి. కానీ అవన్నీ సమాజం చేతుల్లో ఉన్నాయి. మీరు పెళ్లి ఎట్లా చేసుకుంటారు, ఇలాగే చేసుకోండి అని మనం చెప్పలేం. అవి సమాజం చూసుకోవాలి. కానీ ప్రభుత్వం మాత్రమే చేయాల్సిన పనులు, ఇంకెవరూ అంతగా చేయలేనివి ఈ రంగాలు. ఈ రంగాల్లో ప్రభుత్వం విఫలమవుతున్నది. అందుకోసం విద్య, ఆరోగ్యం.

విద్య మీద ఎందుకు పట్టుపట్టటం లేదు? మనం చాలా కష్టపడుతున్నాం, కొందరితో కలిసి పట్టుపట్టి పనిచేశాం కాబట్టి, ఒక మంచి విద్యావిధానమంటూ వచ్చింది. అది అమలుకు కొంతకాలం పడుతుంది. కనీసం ఒక విధానమంటూ వచ్చింది. విద్య కోసం డబ్బులు కూడా ఖర్చుపెడుతున్నాం. ఇంకా ఖర్చు పెడితే మంచిదేగానీ, పెడుతున్న ఖర్చు తక్కువేమీ కాదు.

ఆరోగ్యంలో విధానమూ లేదు, ఖర్చూ లేదు. దీంతోపాటు ఇటీవల కొవిడ్ నేపథ్యం వల్ల ఇది సరైన సమయం. కాబట్టి మనం ఊరికే గుడ్డెద్దు చేలో పడ్డట్లు ఒక అంశాన్ని తీసుకోలేదు. ఈ దేశ భవిష్యత్తుకి, ప్రతి కుటుంబానికీ, ముఖ్యంగా పేద కుటుంబాలకి ఇది ప్రాణాధారం.

**విడివిడిగా, పొంతన లేకుండా చేయటం వల్ల ఫలితాలు రావటం లేదు, ఆస్పత్రి ఖర్చులు తగ్గటం వేరు.. ఆరోగ్య స్థాయి పెరగటం వేరు**

చాలామంది చాలాకాలంగా మాట్లాడుతున్నారు ఆరోగ్యం గురించి. ఏ ప్రభుత్వమైనా ఆరోగ్యం ఇవ్వాలనే కోరుకుంటుంది. ఇవ్వకూడదని ఎవరూ అనరు. మరి ఏమిటి సమస్య?.. చేస్తున్నారు, కానీ ఐసొలేటెడ్‌గా. విడివిడిగా. కుడి చెయ్యికి, ఎడమ చెయ్యికి పొంతన లేకుండా చేస్తున్నారు. దాంతో అనుకున్న ఫలితాలు రావటం లేదు. ఆరోగ్యశ్రీ తెలుగునాట నుండే ప్రారంభమైంది. మనం గర్వపడాలి. ఇతర రాష్ట్రాలు అనుకరిస్తున్నాయి. చివరికి జాతీయ స్థాయిలో ఆయుష్మాన్ భారత్ పేరుతో వచ్చింది. అది వేరేది కాదు, ఆరోగ్యశ్రీయే. కాకపోతే వాళ్లు పేరు వేరే పెట్టుకున్నారు. కచ్చితంగా, ఆరోగ్యశ్రీ వల్ల చాలామంది పేదలుకు ఆస్పత్రి భారం తగ్గింది. సంతోషం. కానీ ఆరోగ్యం బాగుపడిందా అని



చూస్తే నిరాశ కలుగుతుంది. ఈ రెండూ వేరు. ఆస్పత్రి ఖర్చులు తగ్గటం వేరు, ఆరోగ్య స్థాయి పెరగటం వేరు. రెండూ ఒకటి కాదు. ఆరోగ్య స్థాయిలో పెరుగుదల లేదు. నేను ఆహ్వానిస్తున్నాను ఆరోగ్యశ్రీని. మనం రూపొందించిన విధానంలో ఆరోగ్యశ్రీని కొనసాగించాలి, మరింత విస్తృత పరచాలి అని చెబుతున్నాం. కానీ అది చాలదు. ఎందుకంటే, ఖర్చు భారం తగ్గింది కాబట్టి సంతోషపడుతున్నాం, ఓట్లు వేస్తున్నాం గానీ ఆరోగ్యం స్థాయి పెరగలా. దానికి ఎన్నో గణాంకాలు ఉన్నాయి. సర్వేలు, రకరకాల పద్ధతులున్నాయి. నేను సొంతంగా ఏమీ చెప్పటంలా. ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. మనం విడివిడిగా చేస్తున్నాం.

దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య రంగానికి సంబంధించి మనం ముందంజలో ఉన్నాం. ఆరోగ్యశ్రీగానీ, తమిళనాడులో కేంద్రీకరించిన పద్ధతిలో జనరిక్ మందులు గానీ, మిగతావి గానీ సేకరించి పీహెచ్‌సీల నుండి బోధనాస్పత్రుల దాకా పంపిణీ చేస్తుండటం గానీ. ఔషధాల సేకరణ, పంపిణీ మంచి ప్రమాణాలతో చేస్తున్నారు. ఇంకొంచెం మెరుగుపరచవచ్చు. కానీ చాలా మెరుగుపరిచారు. అలాగే ఏపీలో ఉచిత డయాగ్నొస్టిక్‌లు. ఏదో ప్రయివేటు సంస్థ ద్వారా పీహెచ్‌సీ స్థాయి నుండి జిల్లా ఆస్పత్రి వరకూ రోగనిర్ధారణ పరీక్షలకు ఏర్పాటు చేశారు. బోధనాస్పత్రుల వద్ద కూడా ఏర్పాట్లు చేశారు. నేను రాష్ట్రమంతా తిరిగి చూశాను. ఊరికే ఇన్వెస్టిగేషన్లు చేస్తే ఉపయోగం లేదు కదా. రిపోర్టు ద్వారా డాక్టర్ చెప్పగలగాలి. ఖరీదు మరీ ఎక్కువ లేకుండా మంచి ప్రమాణాలతో చేస్తున్నారు. ఇది కూడా మన వైపు నుండి వచ్చిన చొరవే. తెలంగాణలో కూడా ఈ మధ్య డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లను పెద్దఎత్తున ప్రారంభించారు. యథాతథంగా ఏపీ నమూనా కాకపోయినా కూడా లక్ష్యం అదే, సంకల్పం అదే. ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ అవసరం. కానీ చాలవు. విడివిడిగా జరుగుతున్నాయి. ఈ రోజు పుర్రెలో ఏ బుద్ధి పుడితే అది చేసేస్తున్నాం, ఇంకోటి చేస్తున్నాం, ఇంకోటి చేస్తున్నాం. ఇవి ఫలితాలు ఇచ్చేస్తాయి అనుకుంటున్నాం.

**కొత్త మెడికల్ కాలేజీల వల్ల లాభం లేదు**

ఇప్పుడు 50 మెడికల్ కాలేజీలు పెడతామంటున్నారు. నష్టం లేదు గానీ, లాభం కూడా లేదు. మన సమస్య వైద్యులు లేకపోవటం కాదు. ఆ లోతుకి నేను వెళ్లను. వైద్య వృత్తి, వైద్య విద్యను గూర్చి గానీ. కాబట్టి తపన ఉంది. ఏదో చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రంలో గానీ.

**నీతి ఆయోగ్ మూర్ఖపు వాదన**

అలాగే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా విధానాన్ని చూసి ఈ మధ్య నీతి

ఆయోగ్ వాళ్లే సమావేశం కోరారు. నేను సంతోషపడ్డాను ఏదో ఆలోచిస్తున్నారని. నాకు చాలా బాధ కలిగింది ఆ మీటింగ్ తర్వాత. ఏం చెప్తున్నారు వాళ్లు – ఇదేం కాదు సార్, అసలు ఎలాగూ పేదలు ఖర్చు పెడుతున్నారు కాబట్టి, ఇన్సూరెన్స్ తీసుకోవాలని అందరినీ మనం ప్రోత్సహిద్దాం – అంటున్నారు. ప్రభుత్వం నుండి కనీసం డబ్బు కూడా పెట్టరంట, కేవలం ప్రోత్సహిస్తారంట, పెద్ద క్యాంపెయిన్ చేస్తారంట, మన దగ్గరున్న ఆధార్ కార్డులు, ఈ-డేటా అంతా ఇన్సూరెన్స్ వాళ్లకి ఇచ్చేస్తారంట. వీళ్లంతా ఉన్నారయ్యా, ఇన్సూరెన్స్ కట్టించుకోండి అని అప్పచెబుతారట, ప్రభుత్వంలో ఉన్న పెద్దలంతా ప్రచారం చేస్తారట.. ఇది జరిగితే అయిపోతుంది గదా, ఆరోగ్యం వచ్చేస్తుంది కదా అన్నారు. నాకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. గట్టిగా తిడితేనేమో, వాళ్లు కనీసం కొద్దిగానైనా ఆలోచించరని భయం. తిట్టకుండా ఉంటేనేమో తాము అనుకుంటున్నదే బాగుందని ముందుకెళ్లి పోతారేమోనని భయం. నీతి ఆయోగ్ చేస్తున్న వాదన కంటే చెత్త ఆలోచన ఇంకోటి లేదు. పచ్చిగా చెబుతున్నా. దాన్లో దురుద్దేశం లేదు. ఏదో చేయాలనే తపన ఉంది. కానీ చాలా మూర్ఖమైనటువంటిది. కాబట్టి ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టటం లేదని నేనటంలా. కానీ లోతులేనటువంటి శ్రద్ధ. చాలా తాత్కాలికమైనటువంటిది. బాగున్నట్లు కనిపిస్తుంది లోతుగా ఆలోచించకపోతే. కానీ ఫలితాన్నివ్వదు.

**జబ్బు వల్ల కాదు.. బలహీన వ్యవస్థ వల్ల లక్షల ప్రాణాలు పోయాయి**

ఆరోగ్య రంగంలో మన దేశంలో గొప్ప అవకాశాలున్నాయి. వ్యాక్సిన్లు మనం చూశాం. 2021 ఏప్రిల్, మే నెలల దాకా మనం కొంచెం వెనకబడ్డాం. కరోనా డెల్టా వేవ్‌లో ఎన్ని లక్షల మంది ప్రాణాలు కోల్పోయారో మనందరికీ తెలుసు. అధికారికంగా లెక్కలు ఎలా ఉన్నా, వాస్తవాలు మనకు తెలుసు. ఎవర్నీ తిట్టాలనుకోవటం లేదు. ఈ పరిస్థితి ఒక రోజు, ఒక ప్రభుత్వంతో మారేది కాదు. కానీ మనకు తెలుసు. అంతర్జాతీయ అంచనా ప్రకారం ఓ 20-25 లక్షల మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారు. కొందరైతే 70 లక్షల దాకా చెబుతున్నారు. అయిందేదో అయిపోయింది. అమెరికా లాంటి దేశంలోనే 8 లక్షల మంది పోతే, దానికి 4 రెట్లు జనాభా ఉన్న మన దేశంలో పోవటంలో పెద్ద ఆశ్చర్యం లేదు. కానీ చాలా ప్రాణాలు అనవసరంగా కోల్పోయాం. జబ్బు వల్ల కాదు. మౌలికంగా ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం వల్ల. జబ్బు అన్నది కేవలం ఒక తాత్కాలిక ఆరోగ్య సమస్య. మౌలికమైన సమస్య ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం. ఆక్సిజన్ లేదు, ఆస్పత్రుల్లో పడకలు లేవు, డాక్టర్లు పేషెంట్లకి వెంటనే సూచనలిచ్చి దిగువ స్థాయిలోనే కాపాడే వ్యవస్థ లేదు.. ఇవన్నీ మన సమస్యలు, స్వయంకృతాపరాధాలు. నిజంగా నివారించలేని వ్యాధి వచ్చి ప్రాణం పోతే మనం ఏమీ చేయలేం బాధపడటం తప్ప. అలాంటిది కాదు ఇది. ఒక బలహీనమైన వ్యవస్థ వల్ల జరిగింది. ఇది ఒకరోజు ఏర్పడింది కాదు. ఇది ఒక బీజేపీయో, మరో పార్టీదో కాదు. ఈ దేశంలో 70 ఏళ్లుగా ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేశాం. ఇప్పుడు ఒక రకంగా అవకాశం కూడా.

**మనకు అవకాశాలు ఉన్నాయి..**

**ఆ తర్వాత 7-8 నెలల్లో ఎలా అందిపుచ్చుకున్నామో చూడండి**

కొవిడ్ కారణంగా ఏప్రిల్, మే నెలల్లో అలా జరిగినా కూడా.. ఆ తర్వాత 7-8 నెలల్లో చూడండి ఎంత అద్భుతంగా జరిగిందో. ప్రపంచంలో ఎవరికీ తీసిపోని విధంగా మంచి ప్రమాణాల వ్యాక్సిన్లు వేగంగా అందరికీ అందించే ఏర్పాట్లు చేశాం. మూడో వేవ్ వస్తే ప్రపంచంలో అందరి కంటే ధీమాగా ఉన్న దేశం భారత్. కాబట్టి మనం చేయటం లేదని అనటంలా. అది మూర్ఖుల వాదన అవుతుంది. అలాగే ఔషధ పరిశ్రమ. ప్రపంచంలో అతి తక్కువ ఖరీదుతో అత్యున్నత ప్రమాణాలతో మందులు ఈ దేశంలో తయారవుతున్నాయి. గర్వపడాలి. వ్యాక్సిన్లు గానీ, ఔషధాలు గానీ. ఎయిడ్స్ వ్యాధికి గురై ప్రపంచంలో ఇప్పటి వరకు దాదాపు 4 కోట్ల మంది చనిపోయారు గత 20-30 ఏళ్లలో. మందులు వచ్చినా కూడా 20 ఏళ్ల క్రితం. కానీ మందులు వచ్చినా ఆకాశమంత ధరలో వచ్చాయి. మామూలు ధర కాదు. లక్షల రూపాయలు. పేద దేశాల్లో వాటిని ఉపయోగించుకోవటం అసాధ్యమైన పరిస్థితి వచ్చింది. మన దేశంలో కంపెనీలు ఎప్పుడైతే తయారీ మొదలుపెట్టాయో – మొదట బెంగళూరులోని సిప్లా కంపెనీ, ఆ తర్వాత ఇతర కంపెనీలు కూడా – ధరలు అమాంతం దిగివచ్చాయి. అది వరకు 100 ఉన్నది ఒక రూపాయికి తగ్గింది. ప్రపంచమంతా కొన్ని కోట్ల మంది భారతదేశంలో ఔషధాల వల్ల బతికారు. ముఖ్యంగా ఆఫ్రికా, మన లాంటి దేశాల్లో. మనకు గొప్ప అవకాశాలున్నాయి. మొన్నటికి మొన్న కొవిడ్‌కు ఒక మందు అమెరికాలో కనిపెట్టారు. మెర్క్ కంపెనీ అనుకుంటా. అది 10 ట్యాబ్లెట్లు రోజుకు 2 చొప్పున వాడాలి. ఒక్కొక్క బిళ్ల ధర 700 డాలర్లు. అంటే రూ.50,000. పది ట్యాబ్లెట్లు రూ.5,00,000. మన వాళ్లు ఆ ట్యాబ్లెట్లను ఒక్కోటి రూ.50-70కి తెచ్చారు. యాభై వేలు ఎక్కడ యాభై ఎక్కడ! మనకు బోలెడు అవకాశాలున్నాయి. ఇందాక మిత్రులు మరీ మరీ అన్నారు. అతి తక్కువ ఖర్చుతో అద్భుతాలు ఈ ఆరోగ్య విధానం ద్వారా జరుగుతాయి అని. ఇదేదో జేపీ గారు అబద్ధాలు ఆడుతున్నాడా అనిపిస్తుంది. అసెంబ్లీలో ఒకసారి నీటిపారుదల కార్యక్రమం గురించి మాట్లాడుతూ, 2 లక్షల ఎకరాలకు నీరు అందించాను ఎకరాకు రెండు వేల ఖర్చుతో అని నేను చెప్పినప్పుడు.. ఏంటిసార్! సాధ్యమా అన్నారు ఇరిగేషన్ మంత్రి. వాళ్లకు ఎకరాకు రూ.5 లక్షలు అలవాటైపోయింది. 2 వేలు అంటే ఏదో హాస్యంగా అనిపించింది. మనకు ఆ అదృష్టం ఉంది. మనకు ఆ అవకాశాలున్నాయి. అన్నిట్లో అదే రీతి అని చెప్పటంలా. ఎం.ఆర్.ఐ ఉందనుకోండి, అమెరికాలో ఎంత రేటు ఉందో, మనకీ అంతే. మెషీన్ అదే. అన్నిట్లో అనటంలా. కానీ నేను ఇటీవల వేరే కారణాల పరిశీస్తూ ఒక అంశం చూశాను. ఆ దేశాల్లో రూ. 1 కోటి అయ్యే ఆపరేషన్‌ను మన దేశంలో లక్షన్నర – రెండు లక్షల్లో చేస్తున్నారు. అదే ప్రమాణాలతో చేస్తున్నారు. మన పేద దేశంలో అది కూడా ఎక్కువే. కానీ మరీ ఒక స్థాయి మించి ఖరీదు తగ్గించలేం. అది మన చేతిలో లేదు. ఇంత తక్కువలో చేయటం సామాన్య విషయం కాదు. అద్భుతమైన అవకాశాలు మనకున్నాయి.

**ప్రభుత్వాలు ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాల్ని జాగ్రత్తగా ఉపయోగించుకుంటూనే ఈ ఆరోగ్య విధానాన్ని రూపొందించాం**

ఇప్పుడు మన ప్రయత్నం ఏమిటంటే, ప్రభుత్వాలు ఇప్పటికే చేపట్టిన వివిధ కార్యక్రమాల్ని జాగ్రత్తగా ఉపయోగించుకుంటూ, ఈ విధానాల్ని, మన దేశంలో ఉన్నటువంటి అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ ఒక సమగ్రమైనది, విడివిడిగా కుడి చేయి, ఎడమ చేయితో సంబంధం లేకుండా కాకుండా.. ఆ లింక్‌లు అన్నీ సరిగా ఉండేది – కేవలం ఖర్చు

తగ్గటం, పేదలపై భారం లేకుండా చేసేది ఆరోగ్యాన్ని గణనీయంగా పెంచేది – దాని కోసం మనం కసరత్తు చేశాం. అంతేగానీ మనం కొత్తగా ఇందులో వైద్యాన్ని కనిపెట్టలేదు. ఆరోగ్య వ్యవస్థలో ఇలాంటి మార్పుల గురించి చాలామంది చాలా కసరత్తులు ప్రపంచమంతటా చేశారు. మన దేశంలో చేశారు, చేస్తున్నారు. అవన్నీ మనం దీనిలో ఇముడ్చుకున్నాం అంతే. కాబట్టి ఇది అదేపనిగా జేపీ గారు, ఇంకోటి అని కాదు. అదేం లేదు. దీనికి మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఒక విధాన రూపం ఎట్లా ఇవ్వాలి, ఆ ప్రయత్నాన్ని మనం చేస్తున్నాం.

**డాక్టర్ల మధ్య పోటీ.. ప్రజలకు నచ్చిన వైద్యుడిని ఎంపిక చేసుకునే అవకాశం**

చివరిగా, మనమేం చేసినా కూడా పోటీ, ఎంపిక అవకాశాలు ఉండాలి. మొన్న కటారి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన చర్చలో కూడా, ఒక రాష్ట్రం వారు మా ప్రతి పి.హెచ్.సిలో కూడా మరో నలుగురు డాక్టర్లను పెడతాం, వాళ్లను పిలుస్తున్నాం, వాళ్లు రావటం లేదు వంటివి చెప్పుకొచ్చారు. మీరు డాక్టర్లని, నర్సుల్ని ఉద్యోగాలకు పెట్టుకుని, జీతాలిచ్చి వాళ్లతో పనిచేయించుకుంటే అద్భుతాలు వస్తాయన్నది పిచ్చి భ్రమ. తృతీయ స్థాయి ఆస్పత్రుల్ని మినహాయిస్తే (అక్కడ కూడా అంత బాగా లేదు), పోటీ తీసుకురాకుండా బాగు చేయలేం. పోటీ ఎట్లా ఉండాలీ? ఆ వృత్తి బాగా నడిపేవారి మధ్య పోటీ ఉండాలి. ఎవరు బాగా చేస్తే, ఎవరి వద్దకు పేషెంట్లు ఎక్కువగా వస్తే, ఎవరి సేవల్ని పొందితే వారికి అంత ఆదాయం వచ్చే ఏర్పాటు. అంతేగానీ, మీది సేవ గదండీ, సేవాభావంతో చేయండి, దైవభక్తితో దేశభక్తితో అంటే పొట్ట గడవాలి గదయ్యా. అదేదో మీరు చేయవచ్చు గదా సేవల్ని మాట్లాడేవారంతా! సేవకు తగ్గ ప్రతిఫలం లేదంటే ఎందుకొస్తారు పనికొచ్చేవాళ్లు. పనికిరానివాళ్లు వస్తారు. కాబట్టి పోటీ ఉండాలి సేవలందించే వాళ్ల మధ్య.

అలాగే సేవలు పొందేవాళ్లకి ఛాయిస్ ఉండాలి. ఏ డాక్టర్ నాకు నచ్చితే ఆ డాక్టర్ వద్దకు వెళ్లాలి. అలాకాకుండా ఈ పి.హెచ్.సి పెట్టాను, ఈ పి.హెచ్.సిలో డాక్టర్ని పెట్టాను, ఆ డాక్టర్ వచ్చేలా బెత్తం పట్టుకున్నాను, నువ్వు అక్కడికి పోతే పని జరుగుతుందంటే, ఏం జరుగుతుందో మనకు తెలుసు. ఏదో నూటికి 10 మంది చిత్తశుద్ధితో పనిచేస్తారు, మిగతా 90 మంది వల్ల ఏం జరగదు. కాబట్టి వీలున్నంత వరకు పోటీ, మనకు ఎంచుకునే స్వేచ్ఛ. మార్కెట్‌లోకి వెళ్లినప్పుడు ఏమైనా కొనాలంటే ఏం చేస్తున్నాం మనమంతా. ఓ డాక్టర్ వద్దకు వెళ్లాలంటే ఏం చూస్తున్నాం ప్రస్తుతం వ్యవస్థ లేకపోయినా.. అలా వ్యవస్థను ప్రయోజనకరంగా నిర్మించాలి.

**పోటీ ఉంది కాబట్టే ఆరోగ్యశ్రీ కొంతవరకు విజయం సాధించింది**

ఈ ఆరోగ్య విధానంలో అన్ని చోట్లా వీలున్నంత వరకూ ఆ పోటీ ఏర్పాటుకు ప్రయత్నం చేశాం. ఆరోగ్యశ్రీ ఎందుకు కొంతవరకు విజయం సాధించింది? వాళ్లకు పోటీ ఉంది, పేషెంట్లు వస్తే వాళ్లకు డబ్బులు, మనకు ఛాయిస్ ఉంది ఇష్టమైన చోటికి వెళ్లే అవకాశం.

**కొన్ని స్థాయిల్ని మించి పి.హెచ్.పిలు ఫలితాలను ఇవ్వటం లేదు**

రెండోది, పి.హెచ్.పిలు కొన్ని స్థాయిలను మించి ఫలితాలను ఇవ్వటం లేదు. కొన్ని చోట్ల మాత్రం బాగా పనిచేస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో కొన్ని చోట్ల అద్భుతమైన సేవలందిస్తుయి. గుండెలు ఉప్పొంగేలా చేస్తున్నాయి. అన్ని చోట్లా జరగట్లేదు అట్లా. ఒకవేళ చేయాలనుకున్నా పి.హెచ్.సిలు వగైరాలు ఎందుకు పనికిరావటం లేదు ఒక స్థాయికి మించి?.. కొన్నిటికి పనిచేస్తున్నాయి. ఉదాహరణకు వ్యాక్సిన్లకు కోల్డ్ స్టోరేజీ చెయిన్ మన దేశంలో చాలా గట్టిగా ఉంది. పేద దేశాల్లో చాలా కొద్ది దేశాల్లో మాత్రమే మన దేశమంత సమర్థవంతమైన చెయిన్ ఉంది. అందుకే పనికొస్తాయి గానీ పి.హెచ్.సిలు డాక్టర్ దగ్గరికి పొమ్మంటే, చాలా పి.హెచ్.సిలు మనం తరచూ వెళ్లే ప్రాంతాల్లో లేవు. మనం పల్లెటూళ్ల నుండి ఎరువులు, వినోదం, సరకులు వంటి అవసరాలకు వెళ్లే ఓ కేంద్రం ఉంటుంది. అది సహజ వాణిజ్య కేంద్రంగా ఉంటుంది. చాలాచోట్ల పి.హెచ్.సికి, వాటికి సంబంధం లేదు. మనం వెళ్లేది రోజువారీ ఇక్కడ ఉంటే, పి.హెచ్.సి ఆ ఊళ్లో ఎవరో పెద్దాయన ఎకరం దానం ఇచ్చాడని అక్కడ ఏర్పాటై శిథిలావస్థలో ఉంటుంది. కాబట్టి ఇవన్నీ ఒకరోజులో జరిగేవి కావు సంకల్పం ఉన్నా కూడా. అలాంటి ఆలోచన ఉన్నా కూడా నిజంగా ప్రజలకు సౌకర్యంగా ఉండేట్లు ఎలా చేయాలి, మందులు ఎట్లా, వైద్యపరీక్షలకు సులభమైన ఏర్పాట్లు ఎలా ఉండాలి, ఎక్కడి నుంచో కాదు, ప్రస్తుతం చేస్తున్న వాటి నుంచే మరింత బలోపేతం చేయటం ఎలా.. ఇట్లా ప్రతిదాన్లో కొంత లోతుగా ఆలోచన చేయాలి. పైపైన చేస్తే ఆరోగ్యమే మహాభాగ్యము, వైద్యోనారాయణో హరిః దగ్గరే ఆగిపోతుంది. ఈ ఆరోగ్య విధానంలో ఆ లోతైన ప్రయత్నం చేశాం.

**కొంత లోతుకెళ్లండి, శల్యపరీక్ష చేయండి**

మిమ్మల్నందరినీ కోరేది, కొంత లోతుకెళ్లండి. శల్యపరీక్ష చేయండి. ఇది బాగా లేదనుకుంటే ఇంకో రకంగా ఆలోచిద్దాం. మనందరికీ పనికొస్తుందా, మన ఊరికి, పట్టణానికి పనికొస్తుందా ఆలోచించండి. లేదంటే నేర్చుకుందాం.

ఉదాహరణకి, నేను ప్రతిపాదించింది మొదట్లో బ్రిటన్‌లో జి.పి నమూనా. జనరల్ ప్రాక్టిషనర్ విధానం. అక్కడ ప్రతి కుటుంబం ఒక జి.పి వద్ద నమోదవుతారు. ఆ జి.పి నచ్చకపోతే మరో జి.పి వద్దకు వెళ్లొచ్చు. కొన్ని పరిమితులకు లోబడి. ఆర్నెల్లకో, సంవత్సరానికో. జి.పి వద్ద ఎంతమంది నమోదయితే దాన్ని బట్టి అంత ఆదాయం వస్తుంది. ఆ కుటుంబాలకు ఏ జి.పి బాగుంటే అక్కడ నమోదవ్వవచ్చు. ఇది బాగుందనుకుని దాన్ని ప్రతిపాదించాం మొదట్లో. కానీ ఢిల్లీలో మొహల్లా క్లినిక్‌లను చూశాక, మళ్లీ మార్పులు చేశాం. మన దేశం ఉన్న పరిస్థితుల్లో మనకు సులభమైన మోడల్‌ను మొహల్లా క్లినిక్‌లో తీసుకొచ్చారు. అదేంటి, ఈ కుటుంబాలను నమోదు చేసుకోవటం, దొంగ పేర్లు రావటం వంటి సమస్యలకు ఆస్కారం లేకుండా, ఎవరైనా అనారోగ్యం వల్ల క్లినిక్‌కు వెళితే, అలా వెళ్లే ఔట్‌పేషెంట్‌కి ఇంత అని డాక్టర్‌కి ఇస్తున్నారు. కాబట్టి బ్రిటన్ పద్ధతి కంటే మన దేశానికి ఇది మెరుగైన నమూనా. కానీ ఈ నమూనాలో లోపం ఏంటి? నగరం కాబట్టి ఢిల్లీలో ఇబ్బంది అనిపించటం లేదుగానీ, పి.హెచ్.సిలోలాగా మొహల్లా క్లినిక్‌లో కూడా ఎంపిక చేసుకునే అవకాశం ఉండదు. అక్కడికే పోయి వైద్యం చేయించుకోవాలి. డాక్టర్ల మధ్య పోటీ లేదు. అసలు పర్మినెంట్‌గా ఉండే ఏర్పాటు లేదు. ఏరోజుకారోజు 300–400 మంది డాక్టర్ల పేర్లు తీసుకుని పొద్దున్నే ఫోన్ చేస్తారు. ఇవాళ మీరు ఫలానా చోట క్లినిక్‌కు రండి అని. ఆ డాక్టర్‌కి కూడా నేనిక్కడ బాగా చేస్తే నాకు రేపొద్దున ప్రాక్టీస్ పెరుగుతుందనే ప్రోత్సాహమూ లేదు. అయితే ఏదో జరుగుతోంది. అసలు మామూలుగా జరిగే తంతు కంటే, ప్రస్తుతమున్న ఢిల్లీ నమూనా మేలే. ఔట్‌పేషెంట్‌కి

ఇంతని చెల్లింపు చేయటం ఈ నమూనా బలం .. ఒక డాక్టర్‌కి బాగా పనిచేసినా చేయకపోయినా తేడా లేకపోవటం ఇందులోని బలహీనత. దీర్ఘకాలంగా పనిచేయదు. కాబట్టి మనం ఏం చేశాం? ఈ రెండు నమూనాలను కలిపాం. రేపొద్దున ఇంతకంటే ఎవరన్నా బాగా చేశారంటే దాన్ని మనం ఉపయోగించుకోవాలి. తెలివి ఎవరి సొత్తూ కాదు. పైపైన చేస్తే ఉపయోగం లేదు. లోతుకెళ్లాలి. అధ్యయనం చేయాలి. మనం ఉన్న పరిస్థితుల్లో మన ఊళ్లో, మన వీధిలో, మన కుటుంబానికి ఇలాంటి వ్యవస్థలో పరిష్కారముందా, దానికి ఏం చేయాలని అని ఆలోచించాలి. అన్నీ నూటికి నూరుశాతం అద్భుతాలు జరుగుతాయనటంలా. ఇవాళ ఉన్న స్థాయి కంటే చాలా ఎక్కువ జరుగుతుంది చాల తక్కువ ఖర్చుతో. ఒక్కసారి మొదలుపెట్టాక మన అనుభవం మనకు పాఠాలు బోలెడు నేర్పుతుంది. ఇప్పుడు కూడా అనుభవాల్ని మనం ఉపయోగించుకున్నాం. ఎక్కడ అనుభవం బాగున్నా సేకరించి పరిశీలించి వినియోగించుకున్నాం. రేపొద్దున ఈ విధానం అమలు అనుభవాల నుండి మనకు మరింత లోతు తెలుస్తుంది. మరింత పదునైన పథకాన్ని తయారుచేసుకుంటాం.

ఇదీ స్థూలంగా.

**దీన్లో మూడు స్థాయిలు**

మొట్టమొదటిది ఎక్కువగా మనం ప్రాధాన్యమిస్తున్నది ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్. గ్రామాల్లో కంటే పట్టణాల్లో అమలు సులువు. ఒక డాక్టర్ ఈ ఫ్యామిలీ డాక్టర్‌గా పనిచేయటానికి సిద్ధపడితే నెలకి నికర ఆదాయం రూ.1 లక్ష కనీసం వచ్చేలా మన ప్రతిపాదన ఉంది. ఆ మాత్రం వస్తే వాళ్లు నిరంతరం అక్కడ ఉండేందుకు ప్రోత్సాహకం లభిస్తుంది. ఎం.బి.బి.ఎస్ పట్టా తీసుకున్న డాక్టర్లకు మొదట్లో కొంత ట్రైనింగ్ ఇచ్చి, ఓరియెంటేషన్‌ను అందిస్తాం. ఎం.బి.బి.ఎస్‌లో అన్ని అంశాల్నీ సమానంగా చెబుతారు. ఫ్యామిలీ ప్రాక్టిషనర్ గుండె ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉండదు. రోజువారీ పేషెంట్లకు వచ్చే సమస్యలకు ఏం చేయాలన్నది అర్థం కావాలి అంతే. అంటే, దృష్టి కొంచెం వాటి మీద ఉండేలా చేయటం ఆ ఓరియెంటేషన్ ఇవ్వటం అంటే. నచ్చిన వాళ్లు 1,00,000 – 1,50,000 జనాభా ఉన్న ఒక చిన్న పట్టణంలో క్లినిక్ ఏర్పాటు చేసుకోవచ్చు. మొత్తం 15 మంది డాక్టర్లు అక్కడే ఉంటారు. ఔట్‌పేషెంట్లుగా వచ్చే వారి సంఖ్యను బట్టి డాక్టర్లకు చెల్లింపు ఉంటుంది. దాన్లో ఖర్చులు మినహాయించిన తర్వాత లక్ష వరకు నెలకు ఆదాయం వస్తుంది. బాగా చేసి ప్రజల మెప్పు పొందితే రూ.1,50,000 వరకు కూడా రావచ్చు. బాగా చేయకుంటే ఇంకా తక్కువ కూడా రావచ్చు. పోటీ అంటే అదే కదా. డాక్టర్లున్నారా అంటే, పుష్కలంగా ఉన్నారు. అందుకే మెడికల్ కాలేజీలు పెట్టటం పరిష్కారం కాదు. మనకి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి 5,200 మంది, తెలంగాణలో 5,000 మంది వైద్య గ్రాడ్యుయేట్లు తయారవుతున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి 9,000 – 10,000 మంది ఉత్పత్తి అవుతున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి మనకు ఈ నమూనాలో కావలసిన డాక్టర్లు – రెండు రాష్ట్రాల్లో కలిపి ఎనిమిదిన్నర కోట్ల జనాభాకు – సుమారు 6,000 మంది. ఇక సంవత్సరంలో మీరు ఉత్పత్తి చేసే డాక్టర్ల కంటే ఇక్కడ అవసరమైన సంఖ్య తక్కువ. ఇది చేశాక అవసరమైతే కొత్త డాక్టర్ల గురించి చూద్దాం. కాబట్టి డాక్టర్లు లేరన్నది కాదు సమస్య.

**డాక్టర్లు వచ్చి పనిచేసేలా తగిన విధానం రూపొందించకపోతే అసలు ప్రభుత్వం ఎందుకు?**

డాక్టర్లు లేరు, డాక్టర్లు రావటంలా అన్న వంకల్నే ఇంకా చెబితే లాభం లేదు. గత 50 ఏళ్లుగా ఇవే వంకల్ని చెబుతున్నాం. భారతదేశంలో, నా అంచనాల ప్రకారం 2,50,000 మంది పట్టా పొందిన డాక్టర్లు పెద్దగా పనిలేక తిరుగుతున్నారు అటూఇటూ. అదే 3 ఏళ్లు ఇక్కడ పనిచేస్తే, పి.జి చేసుకోవచ్చు, మంచి పేరు వస్తే సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు, లేకపోతే ప్రయివేటు ఆస్పత్రిలో చేరి మరింత ఆదాయం పొందవచ్చు. కొంతమంది అటు వెళ్తున్నా ఏటా 80,000 మంది ఉత్పత్తి అవుతున్నందున మనం డాక్టర్లను ఒక సప్లయ్ చెయిన్‌లోకి పెట్టేస్తాం. డాక్టర్లు లేరన్నది మనకు సమస్య కాదు. కానీ దాన్ని బూచిగా చూపెడుతున్నాం. ఎందుకంటే మన మేధస్సు వికసించటంలా. వైద్యోనారాయణో హరిః లాగా గ్రామానికి డాక్టర్లు వెళ్లటం లేదు అంటూ దాటవేస్తున్నాం. అవునయ్యా, వెళ్లేట్లు ఎలా చేయాలో ఆలోచించాలి. గతంలో వెళ్లలేదు, మనం ఏం చేయలేం అంటే అసలు ప్రభుత్వం ఎందుకు తగిన విధానం రూపొందించకపోతే. వారికి ఆకర్షణీయమైన ఆదాయం, వారికి ఎలా ఓరియెంటేషన్, వాళ్లు ఇక్కడికొచ్చి పనిచేస్తే ఎలాంటి ఇన్సెంటివ్‌లు కల్పించాలి, పనిచేయకపోతే నష్టం వాళ్లకే అనే విధంగా ఎలా చేయాలి అన్నది ఆలోచించాలి.

**ద్వితీయ స్థాయిలో ఆరోగ్యశ్రీ, అందరికీ వర్తించేలా**

ఇక ద్వితీయ స్థాయిలో ఆరోగ్యశ్రీ, ఆ తరహా పథకాలను కొన్ని మార్పులతో వర్తింపచేయటం. ఆరోగ్యశ్రీ అందరికీ వర్తించాలి. తెల్లకార్డు, నల్లకార్డు అని తేడా లేకుండా. అంటే దేశంలో డబ్బున్నవాళ్లు లేదా వేరే అవకాశాలున్నవాళ్లు ఉపయోగిస్తారని కాదు. కానీ ఉపయోగించే హక్కు ఇవ్వండి. కొంతమంది ఉపయోగించుకుంటారు. మిగతావాళ్లు ఇన్సూరెన్స్ ఉపయోగించుకుంటారు, లేదా వాళ్ల ఫైవ్ స్టార్ సదుపాయాల కోసం వేరే ఆస్పత్రులకు వెళ్తారు. వెళ్లనివ్వండి, అది వాళ్లిష్టం. కానీ దిగువ మధ్యతరగతి, పేదలకు అందించే సేవల్లో గొంతున్నవాళ్లు ఉంటే ఆ సేవలు నిలబడతాయి. లేకపోతే కాలక్రమంలో క్షీణిస్తాయి. ఆరోగ్య సేవలకు బడ్జెట్ రాకపోతే గొంతున్నవాళ్లు నిలదీస్తారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీలో మొదట్లో ఉన్న ఆస్పత్రులు లేవు. తప్పుకున్నాయి. ఖర్చు వాళ్ల లెక్కప్రకారం లక్ష అవుతుంటే, ప్రభుత్వం రూ.యాభై వేలే ఇస్తోందంటున్నారు. బహుశా మధ్యలో ఎక్కడో ఖర్చు ఉండొచ్చు. ఆ మేరకు పెంచకపోవటంతోపాటు డబ్బు చెల్లింపు కూడా ఆలస్యం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని అడిగేవారు లేరు. మనకెందుకుని ఆస్పత్రులు తప్పుకుంటున్నాయి. నిరుపేదలకు తప్ప ఎవరికీ పట్టటం లేదు. వాళ్లకి గొంతు లేదు. ఆరోగ్యశ్రీ ఇస్తున్నాంగా నోర్మూసుకో అంటున్నారు. అదే ఎంప్లాయిస్ సమ్మె చేస్తే వెంటనే రథం కదులుతుంది. ఎందుకంటే గొంతున్నవాళ్లు కాబట్టి. మధ్యతరగతి వాళ్లు ఉంటే, పట్టించుకుంటారు కాబట్టి సేవలు బాగుంటాయి. కాబట్టి అందర్నీ భాగస్వాముల్ని చేయండి. ఖర్చు పెట్టుకోగలం అనేవాళ్లు ఎలాగూ వారి సేవల గురించి వారే చూసుకుంటారు. రెండో మార్పు, ఆరోగ్యశ్రీ నుండి ఖరీదైన వైద్యాన్ని తొలగించి, మిగిలిన అన్ని రకాల చికిత్సల్నీ ఇందులో చేర్చండి. గుండె ఆపరేషన్, మోచిప్ప మార్పిడి, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ చికిత్స వంటివి తృతీయ స్థాయి వైద్యంలోకి తీసుకెళ్లాలి. మిగతా అన్ని జబ్బులకూ, అందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపచేయాలి. మన తెలుగు రాష్ట్రాల్లో చిన్న

నర్సింగ్ హోంలు చాలా ఉన్నాయి. వాళ్లు ఒకప్పుడు మంచి సేవల్ని అందించేవాళ్లు. కానీ ఆరోగ్య రంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా కార్పొరేటీకరించి వాటన్నింటినీ మరుగున పడేలా చేశాం. వాటిని ఆరోగ్యశ్రీతో ద్వితీయ స్థాయిలో ఉపయోగించుకోవాలి.

**తృతీయ స్థాయిలో ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రయివేటు సేవలు**

ఇక తృతీయ స్థాయి వైద్యం ఖరీదైన వైద్యం. ఇది ప్రయివేటుకు అప్పచెప్పటం సాధ్యం కాదు. నేను ప్రయివేటీకరణకు పూర్తి అనుకూలం. పిల్లి నల్లదా, తెల్లదా నాకనవసరం, ఎలుకల్ని పట్టుకోవాలని అని చాలాసార్లు ఉటంకించాను. కానీ తృతీయ స్థాయి వైద్యం ప్రపంచవ్యాప్తంగా ఖర్చు పెరిగిపోతోంది, ఫలితాలు మాత్రం తక్కువ. ఎం.ఆర్.ఐ, సి.టి స్కాన్లు ఇలా వ్యయం విపరీతమై పోతుంది. ఇది డాక్టర్ల తప్పు కాదు. ఇంత ఖర్చయినా కూడా తృతీయ స్థాయి వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అయితే ఖర్చును పరిమితం చేసేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో మాత్రమే అందించే ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో పెట్టే ఖర్చుకు నాలుగు రెట్లు ఎక్కువ ఫలితాలు వస్తున్నాయి. అయితే ఈ ఆస్పత్రుల్లో ప్రయివేటుతో పోలిస్తే పెట్టే ఖర్చు మరీ దారుణంగా ఉంటుంది. ప్రయివేటులో పడకకు 100 ఖర్చు చేస్తుంటే, ఇక్కడ 10-12 ఖర్చు చేస్తున్నాం. వందతో పది ఎలా పోటీ పడగలదు? బాత్ రూంలు, పారిశుద్ధ్యం బాగుండటం ఎలా సాధ్యం? కాబట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొంత వనరుల్ని పెంచి, సేవల్ని పెంచి ప్రయివేటు రంగంలోని నిపుణులు కూడా వచ్చే ఏర్పాట్లు చేయాలి. ఉన్నకొద్దీ నిపుణులు ప్రయివేటుకు వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం వారిని ఆకర్షించలేకపోతోంది. వారిని ఆకర్షించటానికి కొన్ని మార్గాలున్నాయి. అవి చేసి తృతీయ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వాలు బాగు చేయాలి.

స్థూలంగా ఈ మూడూ.

**ప్రాథమిక స్థాయిలో –** ఫ్యామిలీ డాక్టర్ ఏర్పాటు

**మధ్య స్థాయిలో–** ఆరోగ్యశ్రీ నమూనాను మరింత విస్తృతం చేయటం, కొన్ని మార్పులు చేర్పులతో అందరికీ వర్తింప చేయటం, చిన్న నర్సింగ్ హోంల సేవలు.

**అత్యున్నత స్థాయిలో–** ప్రభుత్వాస్పత్రుల్ని బలోపేతం చేసి, జవాబుదారీతనంతో సేవలకు కొన్ని మార్పుల్ని తేవాలి. ప్రయివేటులోని నిపుణులు ఇక్కడ కూడా కొంత సమయాన్ని కేటాయించే ఏర్పాటు చేయటం. ఇందుకు పద్ధతులున్నాయి. వాటిని అమలు చేయటం. ఖరీదైన వైద్యాన్ని ఈ ప్రభుత్వ పెద్దాస్పత్రులకే పరిమితం చేయటం. ప్రతి చిన్న జబ్బుకీ ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రాకుండా రెఫరల్ పద్ధతి పెట్టటం. ఎమర్జెన్సీ, ప్రాణాపాయం అనే పరిస్థితుల్లో మాత్రమే నేరుగా వెళ్లే సదుపాయం. గభాల్న జలుబు వచ్చిందని ఉస్మానియాకి వెళ్లకూడదు. ప్రాథమిక ఫ్యామిలీ డాక్టర్ వద్దే పనయిపోవాలి.

**90-95 శాతం మందికి సమస్య పరిష్కారమవుతుంది**

ఇవన్నీ కామన్‌సెన్స్. దీనికి ప్రపంచ అనుభవం, గణాంకాలు, ఎవిడెన్స్, తర్కం ఉపయోగించి మనం ఒక నమూనా తయారుచేశాం. ఇదేం బ్రహ్మ విద్య కాదు. లోతుకెళ్లండి. మీరందరూ దయచేసి, మీ సొంత అనుభవం నుండి ఆలోచించండి. అలాగే ఇతరుల అనుభవం నుండి ఆలోచించండి. ఇంకా మెరుగైన అంశాలను తీసుకొస్తే, మనం దాన్ని కూడా ఆలోచిద్దాం. ముందు ఇది అమలు చేస్తే, ఇంత చేసినా కూడా మారుమూల ఆదివాసీ గ్రామాలకు సరైన వైద్యం అందకపోవచ్చు. అప్పుడు చూద్దాం ఏం చేద్దామో. 90-95 శాతం మందికి బాగా అందితే, 5 శాతం సమస్య ఆలోచిద్దాం ఏం చేద్దామని. అంతేగానీ దాని గురించి ఆలోచించి 90% పక్కన పెట్టేయటం సరైన పద్ధతి కాదు. ఇవాళ అసలు అందటం లేదుగా. 6 కోట్ల మంది ఈ దేశంలో ఆరోగ్య ఖర్చులు భరించలేక అనారోగ్యం కారణంగా పేదలవుతున్నారు ఏటా అదనంగా. దాన్ని గుర్తిద్దాం. 6 కోట్ల మందిని 60 లక్షలకు ఈ విధానంతో తగ్గించగలం. 60 లక్షలు ఉండటం కూడా అన్యాయమే, కానీ 5 కోట్ల 40 లక్షలకు తగ్గించగలిగామనుకోండి, గొప్ప విజయమే కదా. అట్లా ఆలోచించాలి.

**ఏడాదికి 500 కోట్లు పెంచుతూ పోయినా చాలు..**

**తెలంగాణ ప్రభుత్వం ఒకేసారి కూడా ఇచ్చేయగలదు**

ఈ విధానం అమలుకి ఎంత ఖర్చవుతుంది అంటే తెలంగాణకు ఏటా రూ.1900 కోట్లు అదనంగా. ఏడాదికి 500 కోట్లు పెంచుతూ పోతే కూడా చాలు. ప్రభుత్వం తల్చుకుంటే రూ.2,000 కోట్లు ఒకేసారి ఇవ్వటం కూడా అసాధ్యం కాదు. కానీ మనం అంత డిమాండ్ చేయకుండా బాధ్యతాయుతంగా మాట్లాడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌కి జనాభా ఎక్కువ కాబట్టి కొంత ఎక్కువగా ఏడాదికి రూ.2,600 కోట్లు అదనంగా ఖర్చవుతుంది. అంటే తెలంగాణ బడ్జెట్‌లో 0.8 శాతం. ఒక శాతం కంటే తక్కువ ఖర్చు, క్రమక్రమంగా పెంచినా కూడా. ఏపీలో ఆదాయం, బడ్జెట్ తక్కువ కాబట్టి 1.18 శాతం అవుతుంది. అప్పుడు కూడా 1 శాతం కంటే పెద్ద ఎక్కువ కావటంలా.

**జి.ఎస్.డి.పి ప్రకారం 1 శాతంలో తెలంగాణ ఆరవ వంతు, ఏపీ పావు వంతు ఖర్చు చేస్తే చాలు**

రాష్ట్ర జి.ఎస్.డి.పి (స్థూల ఆదాయం) ప్రకారం చూస్తే, తెలంగాణలో ఖర్చు 0.16%. అంటే 1 శాతంలో ఆరవ వంతు. ఆంధ్రప్రదేశ్‌లో 0.24%. అంటే 1 శాతంలో పావు వంతు. ఇవి అసాధ్యమైన అంకెలు కావు. గొంతెమ్మ కోర్కెలు కోరటంలా మనం. చాలా నిజాయతీ అయిన అంకెలు చెబుతున్నాం. అయిదు, పది శాతం తేడా ఉండొచ్చు గానీ పెద్ద తేడా ఉండదు.

**ప్రజలకు అర్థమయ్యేంత వరకు మనం పోరాడాలి**

ఈ విధానం అమలు మొదలుపెట్టాక ప్రజలే చూసుకుంటారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ ఎత్తేస్తామంటే ప్రజలు ఊరుకుంటారా? ఒకసారి అర్థమైతే, దాన్ని సమాజం కాపాడుకుంటుంది. ఆ అర్థమయ్యే వరకు మనం పోరాడాలి. ఇది ఏ రకంగా కూడా అసాధ్యం కాదు. ఇంతకంటే ఎక్కువ డబ్బు ఖర్చు పెడుతున్నారు. ఆరోగ్యానికి కూడా ఖర్చు పెడుతున్నారు. అయితే, లోతైన ఆలోచన లేకుండా, ఈరోజు ఏం బుద్ధి పుడితే అలా ఖర్చు పెడుతున్నారు. అంచేత, డబ్బు సమస్య కాదు, మానవ వనరులు సమస్య కాదు, టెక్నాలజీ సమస్య కాదు. సంకల్పం, కొంత సమన్వయం.. ఇవి రెండూ కావాలి.

**ఎవర్నీ తిట్టొద్దు.. ఇది ఒక రోజు వచ్చిన సమస్య కాదు**

ఎవర్నీ తిట్టొద్దు. ఎందుకంటే ఇది ఒక రోజు సమస్య కాదు. ఒక సమాజంగా మన సమస్య ఇది. మన అదృష్టం కొద్దీ పరిష్కారాలున్నాయి కాబట్టి, పరిష్కారాల మీద దృష్టి పెడదాం. వీళ్లు చేస్తున్న మంచి పనుల్ని మనం మెచ్చుకుందాం. ఏపీ, తెలంగాణ, తమిళనాడు చేస్తున్న

అర్థవంతమైన చొరవల్ని మెచ్చుకుందాం.

**ఈ ఆరోగ్య విధానం అమలు చేస్తే పార్టీలు, నేతలకు ఓట్లు కూడా వస్తాయి**

రెండోది, స్వామికార్యం, స్వకార్యం. ఇది చేస్తే సమాజానికీ మంచి, మీకూ ఓట్లూ వస్తాయి. ఇది వాస్తవం. వైఎస్ పుణ్యమా అని ఆరోగ్యానికి కూడా ఓట్లున్నాయని అర్థమైంది. కచ్చితంగా ఆయన రెండోసారి గెలుపులో ఆరోగ్యశ్రీ కీలకపాత్ర వహించింది. అట్లాగే ఆయన కుమారుడి గెలుపులో ఈ ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కీలక పాత్ర వహించాయి. కాబట్టి, పార్టీలుగా మీకూ లాభం, సమాజానికీ లాభం. ఇది సాధ్యం. మీరు ఇప్పటికే కొన్ని చేస్తున్నారు. కాబట్టి సమస్య కూడా ఉండదు. ఈ ఆరోగ్య విధానం అమలు అన్ని రకాలుగా రాజకీయ పార్టీలకు, నేతలకు కూడా ఉపయోగం.

**పేరు కోసం చూసుకోవద్దు, లక్ష్యం కోసం పనిచేయండి**

కీర్తి వాళ్లనే పొందమనండి. అందుకనే జేపీ గారు, మరోటి అనకండి. కీర్తి పూర్తిగా వాళ్లనే పొందమనండి. వాళ్లనే సొంతం చేసుకోమనండి. మనకు కావలసింది లక్ష్యం నెరవేరటం. ఎన్నోసార్లు అనుకున్నాం మనం – దేవుడు అనే వాడుంటే, కీర్తి ఎవరికి దక్కుతుంది అని ఆలోచించకుండా సత్కార్యాలు చేసే వారి వల్ల అద్భుతాలు చేయిస్తాడు అని. కాబట్టి కీర్తిని గురించి ఆలోచించవద్దు.

**ఇదొక్కటే జరిగినా, మహాద్భుతాన్ని సాధించినట్లే**

ఇది జరిగితే, ఇంకేమీ జరగలేదనుకోండి, ఇదొక్కటే జరిగిందనుకోండి, మహాద్భుతాన్ని సాధించినట్లే. మన జీవితాలు ధన్యం. ఇంకా చాలా జరగాలి ఈ దేశంలో. దీంతో అయిపోదు. కానీ ఇంకేమీ జరగకున్నా సరే, మన ప్రయత్నం వల్ల ఇది కొంత ముందుకెళ్తే అది గొప్ప విజయం. అంతకంటే, మనకు సంతృప్తి అక్కర్లా.

**74 ఏళ్ల క్రితం వాళ్లు చేసింది మనం ఈవేళ కూడా చేయలేకపోతే ఎలా?**

ఎప్పుడో 1948, జులై 5న రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో దేశాలన్నీ భస్మమైపోయాక, కోట్ల మందిని యుద్ధం కబళించాక, ఆర్థిక వ్యవస్థ చితికిపోయాక బ్రిటన్‌లో అందరికీ ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆరోజు బ్రిటన్‌తో పోలిస్తే, ఆర్థికంగా, సాంకేతికంగా మనం చాలా రెట్లు ఎక్కువగా ఉన్నాం. అది జరిగి 74 ఏళ్లవుతుంది. 74 ఏళ్ల తర్వాత కూడా వాళ్లు ఆనాడు చేసింది మనం చేయలేకపోతే ఎలా? నూటికి నూరుపాళ్లూ సాధించగలం.

**లోక్‌సత్తా వెనక కోట్ల మంది జనం లేరు, కానీ..**

కాబట్టి మీరు లోతుగా అధ్యయనం చేయండి, ఆపోశన పట్టండి, లోతుకెళ్లండి, శల్యపరీక్ష చేయండి, తప్పుల్ని వెతకండి, మరింత మంచి ఆలోచనలు తీసుకురండి. మనలో ఎప్పుడైతే ఆ స్పిరిట్, కాన్ఫిడెన్స్ ఉంటుందో, ఇతరులు కూడా కన్విన్స్ అవుతారు. మనం మొక్కుబడిగా చేస్తే ఎవరూ కన్విన్స్ అవరు. లోక్‌సత్తా వెనక కోట్ల మంది జనం లేరు. వాళ్లకు అర్థమయ్యే భాషలో మనం చెప్పలేకపోయాం. మనం కోట్లు ఖర్చు పెట్టలేదు. కానీ మనం సాధించినన్ని విజయాలు ఈ దేశంలో ఎవరూ సాధించలేదు. ఎందుకంటే, హేతుబద్ధత, స్పష్టత, చిత్తశుద్ధి, ఆచరణ సాధ్యమైన పరిష్కారం, తిట్టిపోసే సాధారణ రాజకీయం కాకుండా సామరస్యంగా అందరితో కూర్చుని కలుపుకుపోయే పద్ధతి వల్ల ఫలితాలను సాధించాం.

**ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యాక చేయాల్సిన ఈ అసలైన పనుల్ని చేయండి**

నా దృష్టిలో ఇదో అద్భుతావకాశం. అందరికీ ఈ ఆరోగ్య విధానం కావాలి. మనసు పెట్టండి. ఎమ్మెల్యేలు, ఎంపీలు కావటానికి చాలామంది పోరాడుతున్నారు, ఖర్చు పెడుతున్నారు, కుటుంబాల్ని గుల్ల చేసుకుంటున్నారు. వాళ్లను వదిలేయండి. వాళ్ల తంటాలు వాళ్లు పడతారు. కానీ వాళ్లు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యాక చేయాల్సిన ఈ అసలైన పనుల్ని మీరు చేయండి. మీకు నిజమైన విజయం, సంతృప్తి, జీవన సాఫల్యత లభిస్తాయి.

కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అధ్యక్షత వహించగా, ఐఎంఏ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఆకుల నరేష్ బాబు, మెడికల్ లా ప్రపంచ అసోసియేషన్ శాశ్వత సభ్యుడు డాక్టర్ చింతల రాజేందర్, తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు డాక్టర్ కేటీఆర్ సత్యప్రకాష్ అతిథులుగా పాల్గొన్నారు. కటారి శ్రీనివాసరావు, గన్‌రెడ్డి రాజారెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. లోక్‌సత్తా పార్టీ నేతలు పాల్గొన్నారు.

(ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానపత్రం 'Towards Viable Universal Healthcare'ను www.fdrindia.orgలో చూడగలరు.)

## పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు




ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి తెలంగాణలోని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం, తెలుగుదేశం, జనసేన, ఆమ్‌ఆద్మీ తదితర పార్టీల ప్రతినిధులు ఈ విధానంలోని కీలకాంశాలను చర్చించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ వారికి ఆయా అంశాలను, ప్రతిపాదనల వెనక ఉన్న హేతుబద్ధత, వాస్తవాలు, గణాంకాలను వివరంగా తెలియచేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు కార్యక్రమానికి సారథ్యం వహించారు. సమావేశానికి హాజరు కాలేకపోయిన మరికొన్ని పార్టీలు కూడా ఈ ఆరోగ్య విధానానికి తమ సూత్రప్రాయ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపాయి.

# Online Petition:




Telangana CM should make an integrated family healthcare system free of cost
To
The Hon'ble Chief Minister,
Government of Telangana State,
Hyderabad.
Sub: Online petition for the implementation of the integrated family healthcare system for a better society. The Government of Telangana State should allocate additional 1900 crore rupees in this financial year for making healthcare for everyone at zero cost.
Ref: The Loksatta Movement under the leadership of Dr.JayaPrakash Narayan, worked on the healthcare system for the last two decades and designed a helpful model towards viable universal healthcare. The government should implement the proposals of Loksatta and make an integrated family healthcare system a right to health.
Respected Sir,
Loksatta Party Telangana State unit demands integrated family healthcare systems for making good healthcare free for every citizen of the state. The government of Telangana should provide healthcare for all at zero cost.
At present in our state, the people suffered from unhealthy conditions. Most of the people couldn't afford the expenditure of hospitalization. Then they fell into debt traps and even committed suicides.
The state government and council of ministers should allocate additional 1900 crore rupees in this financial year 2022-23, for making integrated family healthcare systems free to each and everyone in our state.
The government of Telangana should implement this plan and make Telangana an ideal state in India.
This step will help the people of Telangana to live peaceful, healthy life. Then they can contribute to the state's growth productively and positively.
Therefore, it is prayed that, on behalf of the Telangana people, I appeal to you. Kindly, the Government should allocate additional 1900 crore rupees for this financial year for implementing the Loksatta proposed model in making an integrated family healthcare system at zero cost.
Thanking you,
With Warm Regards,
Thummanapally Srinivas,
State President,
Loksatta Party (T.S).

# భారత్ ఆర్థిక, ప్రత్యామ్నాయ ఇంధన శక్తిగా ఎదగాలి



ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ ప్రపంచ వ్యవస్థను అస్థిరపరచిందని, అంతర్జాతీయ భద్రతా నియమావళిని బలహీనపరచిందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బడితె ఉన్న వాడిదే బర్రె తరహాలో బలమైన దేశాలు చెలరేగిపోవటం, బలహీన దేశాలు భయం గుప్పెట్లో నలిపోవటం వంటి కల్లోల పరిస్థితుల్ని రాబోయే కొన్ని దశాబ్దాలపాటు మనం ఎదుర్కోవలసి రావచ్చన్నారు. భద్రతా భయంతో పలు దేశాలు అణ్వాయుధాల్ని సంపాదించే ప్రయత్నం చేస్తాయన్నారు. దీని వల్ల వాటి వ్యాప్తి మరింత ఎక్కువవుతుందన్నారు. చమురు, సహజ వాయువుల అతిపెద్ద ఎగుమతిదారు అయినందున.. ఇతర దేశాల ఆంక్షలు రష్యాను ఇప్పటికిప్పుడు ఏమీ చేయలేవన్నారు. నిజానికి చమురు ధరలు పెరిగి దురాక్రమణదారయిన రష్యాకే తాత్కాలికంగానైనా లాభం చేకూరుస్తున్నాయన్నారు. వచ్చే 20 ఏళ్లలో చమురు, సహజ వాయువు వినియోగం అవసరం లేకుండా, ప్రత్యామ్నాయ ఇంధనం వైపుకి మళ్లటానికి ప్రపంచం తన ప్రయత్నాల్ని రెట్టింపు చేయాలన్నారు. ఎంత గొప్ప దేశమైనా దెబ్బతినటానికి ఒక్క నియంత చాలని రష్యా ఉదంతం నిరూపిస్తోందని, అందుకే భారత్ ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరచుకోవాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో దేశాన్ని బలహీనపరిచే రాజకీయాల్ని విడనాడాలన్నారు. రక్షణ పాటవాన్ని పరిరక్షించుకుంటూనే మన దేశం ఆర్థిక శక్తిగా ఎదగాలని, ప్రత్నామ్నాయ ఇంధన స్వావలంబన, ఎగుమతి శక్తి సాధించాలన్నారు. భారత్ ఈ రకంగా తన సామర్థ్యానికనుగుణంగా ఎదగకపోతే చైనా నుండి పెరగనున్న ప్రమాదాన్ని ఎదుర్కోవటం కష్టమని జేపీ హెచ్చరించారు.

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



ఒక్కసారి సేవల నాణ్యతకు గనక భరోసా వస్తే, ఓ.ఓ.పి.ఇ భారాన్ని తగ్గించే ఆరోగ్య సేవల వర్తింపు నుంచి లబ్ధి పొందేందుకు దేశంలోని పేదల్లో అత్యధికులు ముందుకొస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందటానికయ్యే ఖర్చు.. ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో చికిత్సకయ్యే ఖర్చు కంటే ఎంతో తక్కువ. ప్రాథమిక ఆరోగ్య వ్యయంలో అత్యధికం లేదా మొత్తం ప్రభుత్వమే భరిస్తుంది.

కాబట్టి, అతను/ఆమె అవసరాలకనుగుణంగా, మొత్తంగా రోగి ఆరోగ్యానికి సమగ్ర ఆరోగ్య సేవల్ని అందించే లక్ష్యంతో పనిచేయటం వల్ల.. ఆధునిక ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఎఫ్‌పి, రోగి మధ్య దీర్ఘకాలిక బంధం దృష్టితో పనిచేస్తుంది. అనారోగ్యాలను ముందుగానే గుర్తించటానికి, చికిత్సకి ఇది అవకాశం కల్పిస్తుంది. దీనివల్ల సమస్య ముదిరే దాకా వైద్య సాయానికి రోగులు వేచి చూడాల్సిన అవసరం లేదు. ఇదే సమయంలో, కేసును బట్టి కేవలం చికిత్సలో ప్రత్యేక శ్రద్ధ అవసరమున్న వ్యాధులను మాత్రమే ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి సిఫార్సు చేసేలా ఎఫ్.పి నేతృత్వంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ వ్యవహరిస్తుంది కాబట్టి.. ఆరోగ్య వ్యయాలు అదుపులో ఉంటాయి. అంతిమంగా, అటువంటి వ్యవస్థ.. ఆరోగ్య ఖర్చుల వల్ల పేదలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది.

**4.2.2.2. శిక్షణ**

పి.హెచ్.సిలలో ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవల్లో నాణ్యతాపరంగా చేయాల్సింది ఇంకా చాలా ఉందని ఒక దేశవ్యాప్త అధ్యయనం తెలిపింది. వివిధ రాష్ట్రాల మధ్య నాణ్యతా ప్రమాణాల్లో అంతరాలున్నప్పటికి కూడా. మరోవైపు, పెద్ద తేడా లేనప్పటికీ ప్రయివేటు ప్రాథమిక వైద్యం కంటే ప్రభుత్వ ప్రాథమిక వైద్యం నాణ్యత అధ్వాన్నంగా ఉందని తేలింది.

పి.హెచ్.సిలలో కేవలం డాక్టర్ల సంఖ్యను పెంచటం, ప్రభుత్వోద్యోగులుగా మరింతమంది డాక్టర్లను నియమించటం వల్ల వైద్య సేవలు, ఫలితాలు తప్పనిసరిగా మెరుగవుతాయనేమీ లేదు. ఫ్యామిలీ ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా వైద్య సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వటం, జవాబుదారీతనమున్న వ్యవస్థను నిర్మించటం కీలకం. స్వల్పకాలిక, సరైన రీతి రూపకల్పనతో శిక్షణా కార్యక్రమాల ద్వారా కుటుంబ ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ఫిజీషియన్లను సిద్ధం చేసే సవాలును అధిగమించగలం. నిర్దిష్ట లక్ష్యాల చుట్టూ ఒకటి నుంచి మూడు నెలల శిక్షణా కార్యక్రమాన్ని ఎం.బి.బి.ఎస్ గ్రాడ్యుయేట్లకు రూపొందించవచ్చు. వారికి కమ్యూనిటీ, కుటుంబ ఆరోగ్య సంరక్షణలో స్పష్టమైన అవసరాలకు తగ్గట్లు నవీకరణ శిక్షణ అందించవచ్చు. ఎఫ్.పికి ఉపయోగపడేలా ఫ్యామిలీ వైద్యానికి సంబంధించిన ప్రామాణిక నిర్వహణ పద్ధతులు, మార్గదర్శకాలతో కూడిన ఒక సంక్షిప్త సమాచార పుస్తకాన్ని శిక్షణ పాఠ్య విభాగాల్లో (మాడ్యూళ్లలో) భాగం చేయాలి.

దేశంలో కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య విద్యకు ప్రాధాన్యత కొరవడటం వల్ల ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ల కొరత ఉంది. వైద్య విద్యలో చాలావరకు ఆస్పత్రి చికిత్స, అధునాతన డయాగ్నోస్టిక్‌లు, వైద్య ప్రక్రియల మీదే ఆధారపడి ఉంది. కాలక్రమంలో, ఫ్యామిలీ వైద్యానికి ప్రాధాన్యతనిచ్చేలా పాఠ్యాంశాల్లో మార్పులు చేయటం అవసరం.

**4.2.2.3. 1,50,000 మంది జనాభాకి 10 మంది ఎఫ్.పిలు**

ఎఫ్.పి విధానం సక్రమంగా పనిచేయటానికి.. వారి అందుబాటు, విశ్వసనీయత ప్రధాన ప్రాతిపదికలు. తమకు అవసరమైన వస్తువుల్ని


## Form IV

1.Place of Pubilcation : Hyderabad
2. Periodicity : Monthly
3. Printers
a. Name : Dr. Jayaprakash Narayan
b. Nationality : Indian
c: Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

4. Publisher's Name : Dr.Jayaprakash Narayan
5. Editior's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082
6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jaya prakash Narayan, National Co ordinator , H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

I, Dr. Jaya prakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jaya prakash Narayan
Signature of the Publisher

కొనటానికో, అమ్మటానికో లేదా ఏదైనా ఓ సేవ, ఇతరత్రా అవసరాలకోసమో గ్రామీణ ప్రజలు అలవాటుగా వెళ్లే చిన్న పట్టణంలో, 5-10 కిలోమీటర్ల దూరంలో ఎఫ్.పి ఉండటం వల్ల సులభంగా అందుబాటులో ఉంటారు. అలా అందుబాటులో ఉన్న డాక్టర్ల బృందం నుండి తనకు నచ్చిన వైద్యుడ్ని రోగి ఎంచుకుంటే.. విశ్వాసం మరింత మెరుగవుతుంది. డాక్టర్‌కి ఉన్న మంచి పేరు, ఇతర రోగులు చెప్పే అభిప్రాయాలు, వ్యక్తిగత అనుభవం ఆధారంగా రోగి ఎంపిక చేసుకుంటారు. ఈ ఏర్పాటు వల్ల మరింత మెరుగైన సేవల కోసం అతను/ఆమె ఇంకో ఫిజిషియన్ దగ్గరికి వెళ్లే అవకాశం ఉంటుంది, వ్యవస్థ పట్ల విశ్వాసం మెరుగుపడుతుంది.

ప్రభుత్వ వైద్య సదుపాయాల్లో ప్రస్తుత వైద్య సంప్రదింపు శాతం కేవలం 0.6గా ఉన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుంటే, ప్రతి 15,000 జనాభాకి ఒక ఎఫ్.పి చొప్పున ఎఫ్.పి వ్యవస్థని ప్రారంభించటం వివేకవంతమైన చర్య అవుతుంది. ఒక్కో జనాభా యూనిట్‌కి అంతకంటే ఎక్కువమంది ఎఫ్.పిలు ఉంటే.. అవసరానికి మించిన సామర్థ్యం వృథాకు, అసమర్థతలకు దారితీసే అవకాశముంది. వ్యవస్థ ఆచరణ సాధ్యతను, మనుగడను అది ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. మరోవైపు, ఆరోగ్య రంగంలో ప్రస్తుతం ప్రయివేటు సేవలపై విస్తృతంగా ఆధారపడటం వల్ల, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రారంభించాక కేవలం 70 శాతం ప్రజానీకం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఉపయోగించుకుంటారని అంచనా. మిగిలిన 30 శాతం మంది ప్రయివేటు ఆరోగ్య సేవల వినియోగాన్నే కొనసాగిస్తారు.

అనధికారికంగా వైద్య సేవలందించేవారు భారీ సంఖ్యలో విస్తరించి ఉండటం భారత్‌కు ఇప్పుడో సవాలుగా ఉంది. దేశంలోని పేదల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కోసం మొదటగా ఈ అనధికార వైద్య సేవలదారుల వద్దకే గణనీయ సంఖ్యలో వెళ్తున్నారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే సమీపంలో అర్హులైన డాక్టర్లు అందుబాటులో లేకపోవటం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. పైన చర్చించిన రెండు సవాళ్లు - ఒకటి, భారతదేశ గ్రామాలలో అనధికారికంగా వైద్య సేవలందించేవారు అవసరానికి మించి ఉండటం, రెండు, గ్రామీణ ప్రజానీకం మెరుగైన ఆరోగ్యం కోసం మరో గ్రామానికి వెళ్లకుండా సమీపంలోని పట్టణ లేదా అర్ధ పట్టణ కేంద్రాలకు వెళ్లటం నేపథ్యంలో.. డాక్టర్లను గ్రామాలవారీగా నియమించటం పరిష్కారం కాదని, దాని వల్ల ఫలితం ఉండదని స్పష్టమవుతోంది.

కాబట్టి, ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించటానికి కనిష్టంగా ఓ చిన్న పట్టణం స్థాయిలో సుమారు 1,00,000-1,50,000 జనాభా ('సెంటర్') ఉండాలి. ఇటువంటి జనాభా యూనిట్ కలిగిన ఒక్కో సెంటర్‌లో ఆరోగ్య సంరక్షణను అందించేందుకు సేవల్లో పోటీ పడుతూ 8-10 మంది కూర్పుతో ఎఫ్.పిల బృందం ఉండాలి. అలా, సుమారు ప్రతి 15,000 జనాభాకి ఒక ఎఫ్.పి ఉంటారు. భారత జనాభా సాంద్రత చదరపు కిలోమీటరుకి 500 మంది కాబట్టి, అత్యధిక ప్రజానీకానికి 5-10 కిలోమీటర్ల పరిధిలో పదిమంది ఫ్యామిలీ ఫిజిషియన్ల బృందం అందుబాటులో ఉంటుంది.

ప్రాథమిక ఆరోగ్య 'సెంటర్లు'గా ఉండే ఈ చిన్న పట్టణాల ఎంపిక జాగ్రత్తగా జరగాలి. సదుపాయాలు, జనాభా, వాణిజ్య కలాపాలు, చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిపోయే ప్రజానీకం, ఆయా గ్రామాల నుండి వచ్చి, పోయే రవాణా సేవలు మొదలైన వాటిని బట్టి ఈ ఎంపిక జరగాలి. చుట్టుపక్కల అన్ని గ్రామాల ప్రజలు అలవాటుగా తమ వ్యాపార, సేవలు, వినోద అవసరాలకు వచ్చిపోయే 'కేంద్రం'గా ఆ చిన్న పట్టణం ఉండాలి.

ఎఫ్.పి అతను లేదా ఆమె ప్రాక్టీస్ చేస్తున్న 'సెంటర్'లోనే నివాసముంటారు. సేవలు నిరాఘాటం కాబట్టి, అటువంటి ప్రాథమిక వైద్య సంప్రదింపులు కేవలం రోగానికి చికిత్సనందించటమే కాకుండా సమగ్ర ఆరోగ్య సేవల్ని అందిస్తాయి. ఫిజిషియన్లు ఎఫ్.పి కూర్పులో భాగస్వాములవటం స్వచ్ఛందం, కొన్ని ప్రమాణాలకు లోబడి ఉంటుంది. రోగులను ఆకర్షించటానికి బృందంలోని ఇతర ఎఫ్.పిలతో వారు పోటీ పడాల్సి ఉంటుంది. రోగుల సంప్రదింపులే ఎఫ్.పిల ఆదాయాల్ని నిర్ణయిస్తాయి.

సరైన శిక్షణ, నిర్వహణ నియమాల రూపకల్పన, పనితీరు పర్యవేక్షణ, జవాబుదారీతనానికి ఏర్పాట్లతో మూడేళ్ల వ్యవధిలో దశలవారీగా ఎఫ్.పిలను అందుబాటులోకి తేవచ్చు. ఎఫ్.పి ప్రక్రియ పూర్తయిన మూడేళ్ల తర్వాత, దేశవ్యాప్తంగా మొత్తం 9,000-10,000 కేంద్రాల్లో సుమారు 1,00,000 ఎఫ్.పిలు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తుండాలి. మూడేళ్లలో అమలు అంటే, ఏటా 30,000 మంది ఎఫ్.పిలను కొత్తగా అందుబాటులోకి తేవటం. భారత్‌లోని ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం తగినంతమంది శిక్షణ పొందిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. మనం చేయవలసిందల్లా పోటీ, పనితీరు ఆధారంగా వారికి ఎఫ్.పిగా గౌరవప్రదమైన ఆదాయం వచ్చే ప్రోత్సాహకాన్ని నిర్మించటం, అదే సమయంలో ఫ్యామిలీ వైద్య అవసరాలకనుగుణంగా ఫిజీషియన్లకు స్వల్పకాలిక, లక్షిత శిక్షణను అందించటం.

ప్రాథమిక ఆరోగ్య సేవల డాక్టర్లు తగినంత మంది లేకపోవటమనే సవాలును భారతదేశం ఎదుర్కోవటానికి కారణం డాక్టర్లు లేకపోవటం కాదు. ప్రస్తుతమున్న మానవ వనరుల్ని ఒక సమగ్రమైన రీతిలో, పోటీ, ఎంపికతో కూడిన ఫ్యామిలీ ఆరోగ్యం వైపు వినియోగించకపోవటమే అందుకు కారణం. తగిన స్వల్పకాలిక శిక్షణ, సరైన ఆర్థిక ప్రోత్సాహకాలు ఉంటే.. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యా కార్యక్రమంలోకి అవకాశంలేని ఎంతోమంది ఎం.బి.బి.ఎస్ గ్రాడ్యుయేట్లకు ఆకర్షణీయమైన ఉద్యోగావకాశాలు ప్రాథమిక ఆరోగ్య రంగంలో లభిస్తాయని పట్టిక 4.7ను చూస్తే స్పష్టమవుతుంది.

**(పట్టిక 4.7: ఫ్యామిలీ ఫిజిషియన్ల ప్రతిపాదిత సంఖ్య)**

**బాక్స్ 4.3: గ్రామీణ ప్రాంతంలో అనధికారికంగా ఆరోగ్య సేవలను అందిస్తున్నవారిని సంధానం చేయటం**

ప్రస్తుతం భారత గ్రామీణ ప్రజానీకంలోని అత్యధికులు తమ ఆరోగ్య అవసరాలకు మొదటగా సంప్రదించేది అనధికార గ్రామీణ ఆరోగ్య సేవలదారులనే (ఆర్.హెచ్.పిలు). వారికి ప్రజలలో ఎంతో ఆదరణ ఉంటుంది. తాము సేవలందించే కమ్యూనిటీల్లో వారికి విస్తృత సంబంధాలుంటాయి. ఆరోగ్య సేవలదారుకి-రోగికి మధ్య ఉండే ఈ బంధాన్ని ఎఫ్.పి ఆధారిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ప్రయోజనం కోసం

మళ్లించవచ్చు. ఆర్.హెచ్.పిల నైపుణ్యాలను అంచనా వేసి తదనుగుణంగా వారిని ఎఫ్.పిలు ప్రయోజనకరమైనరీతిలో తమ క్లినిక్‌లలో ఉద్యోగాల్లో నియమించుకోవచ్చు. ఎఫ్.పి క్లినిక్‌లతో అనుసంధానమైన ఆర్.హెచ్.పిలు ఎఫ్.పిల పర్యవేక్షణలో పనిచేస్తారు. కమ్యూనిటీలు ఎఫ్.పి సేవలను ఎక్కువగా వినియోగించుకునేలా తమ పరిచయాల్ని వినియోగించగలరు.

**4.2.2.4. ఎంపిక, పోటీతో సేవకు-ఫీజు నమూనా**

మన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో ప్రాథమిక సేవల నాణ్యతే మొట్టమొదటి సవాలనేది మనం చూశాం. సరైన శిక్షణ అవసరం. కానీ కేవలం శిక్షణతోనే నాణ్యమైన సేవలు అందుతాయన్న గ్యారంటీ లేదు. వ్యవస్థ, అందులోని ప్రోత్సాహకాలు నాణ్యమైన సేవలను జారీ చేసేలా విధాన రూపకల్పన చేయాలి. ఆర్థిక ప్రోత్సాహకాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. పోటీతోపాటు, రోగులకు ఎంపిక స్వేచ్ఛ ప్రాతిపదికన ఆర్థిక ప్రోత్సాహకాలు మనం ఆశించిన ఫలితాలకు దారితీస్తాయి.

తమకు దగ్గర్లో ఉన్న ఏ ఎఫ్.పి క్లినిక్‌లోనైనా సేవలను పొందే స్వేచ్ఛను ప్రజలకు ఇస్తూ ఎఫ్.పిల మధ్య పోటీని ప్రవేశపెట్టటంలోనే పరిష్కారం ఉంది. మరోవైపు, దీన్ని సేవకు-ఫీజు నమూనాతో సంధానం చేయాలి. అతను లేదా ఆమె క్లినిక్‌కి రోగుల సంఖ్య ఎంత పెరిగితే ఎఫ్.పికి అంత ఆదాయం లభిస్తుంది. అంటే, ఒక్కో రోగి సందర్శనకు నిర్దిష్ట మొత్తం ప్రాతిపదికన ప్రభుత్వం ఎఫ్.పిలకు చెల్లిస్తుంది. ఫలితంగా, ఎక్కువమంది రోగులను ఆకర్షించేలా నాణ్యమైన సేవలను అందించటానికి ప్రాథమిక ఆరోగ్య వైద్యునికి ప్రోత్సాహకం లభిస్తుంది.

వైద్యుల మధ్య పోటీ, ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ ఉన్నప్పుడే నాణ్యమైన సేవలకు గ్యారంటీ లభిస్తుంది. వివిధ ఎఫ్.పిల మధ్య పోటీలో ఎవరు నాణ్యమైన సేవలను అందిస్తారో తెలుసుకుంటూ ప్రజలు ఎంపిక చేసుకోవటంపైనే ఎఫ్.పిలకు ఆదరణ ఆధారపడి ఉన్నప్పుడు.. ఎఫ్.పి అందుకునే పారితోషికం తనకు ఎంత ఆదరణ ఉందో ఆ మేరకు అయినప్పుడు.. అతను/ఆమె అత్యంత నాణ్యమైన సేవలను అందించటానికి కావలసిన ప్రోత్సాహం లభిస్తుంది. నాణ్యమైన సేవలు, మరింతమంది రోగులను ఆకర్షించటంపైనే ఆదాయం ఆధారపడి ఉంటుంది కాబట్టి.. అటువంటి నమూనా రోగులకు ఎఫ్.పిలు జవాబుదారీగా ఉండేలా చేస్తుంది.

ఈ వ్యవస్థను అవసరమైన స్థాయిలో అమల్లోకి తేవాలంటే (ప్రతి 1,50,000 జనాభాకి సుమారు 10 ఎఫ్.పిలు), రాష్ట్రంపై పెద్దఎత్తున ఆర్థిక, పాలనాపరమైన భారం పడకుండా ఉండాలంటే, జాతీయ ఆరోగ్య సేవ (ఎన్.హెచ్.ఎస్) తరహా నమూనాను తగిన మార్పులతో స్వీకరించవచ్చు. మొదటిది, ప్రతి ఎఫ్.పి ఒక ప్రయివేటు ప్రాక్టిషనర్‌గా తమ క్లినిక్ ఏర్పాటు, నిర్వహణకి బాధ్యత వహిస్తారు. ఖర్చులన్నీ వారే భరిస్తారు. అయితే, ఎన్.హెచ్.ఎస్ నమూనాకి భిన్నంగా, ఎఫ్.పికి ప్రభుత్వం ఆ నెలలో రోగుల సంప్రదింపుల సంఖ్య ఆధారంగా భర్తీ చెల్లింపు (రీఇంబర్స్‌మెంట్) చేయాలి. ప్రస్తుతం ఢిల్లీ మొహల్లా క్లినిక్‌లలో అనుసరిస్తున్న ఈ భర్తీ పద్ధతి, సాపేక్షంగా తేలిక. భారతీయ పరిస్థితులకు మెరుగ్గా సరిపోతుంది. నమోదు చేసుకున్న వారి సంఖ్యను బట్టి చెల్లింపు చేసే బ్రిటన్ పద్ధతి మన పరిస్థితులకు సరికాదు.

ఈ కార్యక్రమంలో ఫిజీషియన్లు భాగస్వాములయ్యేందుకు, ఒక పరిధికి లోబడి మరింతమంది రోగులను ఆకర్షించేందుకు గాను.. నాణ్యమైన సేవలను అందించటానికి ఆర్థిక ప్రోత్సాహకంగా ఎఫ్.పికి ఇచ్చే పారితోషికాన్ని ఒక సముచిత స్థాయిలో నిర్ధారించాలి. ఇదే సమయంలో ఎఫ్.పి వద్దకు అర్థం లేని కారణాలతో సందర్శనలకు వెళ్లటాన్ని లేదా సంప్రందింపుల సంఖ్యను పెంచి చూపటాన్ని నిరోధించాలి. చిన్న చిన్న కారణాలతో సంప్రదింపులకు అవకాశం లేకుండా చేయాలి.

మొదటి దశలో, ప్రతి ఎఫ్.పి సగటున 15,000 మందికి సేవలందిస్తారని (1,50,000 జనాభాకి 10 మంది ఎఫ్.పిల సమాహారం) అంచనా వేస్తున్నాం. ఏడాదికి తలసరి 1.5 సంప్రదింపులు అనుకుంటే, 70 శాతం మంది ప్రజలు ప్రభుత్వ నిధులతో నడిచే ఎఫ్.పిల మీదే ఆధారపడ్డారని కూడా అనుకుంటే, సగటున ఒక్కో ఎఫ్.పికి 15,000 సంప్రదింపులు ఉంటాయి. అంటే నెలకి 1250 కన్సల్టేషన్లు. అది సరైన రీతిలో ఆరోగ్య సేవలందించటానికి తగిన నమూనా. రోజుకు 40 నుండి 50 సంప్రదింపులు. అంటే ప్రతి కన్సల్టేషన్‌కీ 10 నుండి 15 నిమిషాలు. ఒక్కో సంప్రదింపుకి రూ.125 రూపాయల చొప్పున, ఫిజీషియన్‌కి నెలకి రూ.1,50,000 పారితోషికం లభిస్తుంది. ఇందులోనే క్లినిక్ ఏర్పాటు, నిర్వహణ వ్యయం, సిబ్బందిని కిరాయికి నియమించుకోవటం, ఆరోగ్య రికార్డుల నిర్వహణ మొదలైనవి భాగంగా ఉంటాయి. ఆరోగ్య రికార్డుల డిజిటలీకరణకి, వ్యాక్సినేషన్లు, కుటుంబ నియంత్రణ సేవలు, ఇతర ప్రజారోగ్య కార్యక్రమాలకు అదనపు ప్రోత్సాహకాలను అందించవచ్చు. ఖర్చులు పోగా ఒక ఎఫ్.పికి నికర ఆదాయం నెలకి రూ.90,000 – 1,00,000 ఉంటుంది. ఈవేళ్టి పరిస్థితుల్లో, ప్రజల విశ్వాసాన్ని పొందగలిగి, అట్టడుగు స్థాయిలో నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్యాన్ని అందించే ఒక ఫిజీషియన్‌కి నెలకి దాదాపు రూ.1,00,000 నికర ఆదాయం లభించటం సముచితమైన, సమర్థులైన డాక్టర్లును ఆకర్షించగలిగే ప్రోత్సాహకం.

మన దేశంలో అందుబాటులో ఉన్న సుమారు 10 లక్షల మంది ఫిజీషియన్లలో కేవలం సుమారు 10 శాతం మంది మాత్రమే ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫ్యామిలీ వైద్యానికి ఈ నమూనాలో అవసరం. కాలక్రమంలో ఫిజీషియన్లలో అనుభవం గడించినవారు, ప్రజల్లో ఆదరణ పొంది వారి విశ్వాసాన్ని సంపాదించినవారు కొంతమంది ఎఫ్.పి వ్యవస్థను వీడి ఆ విభాగంలో తమ సొంత ప్రయివేటు ప్రాక్టీస్‌ను పెట్టుకోవచ్చు. ఒకసారి ఫ్యామిలీ ఆరోగ్యంలో అనుభవం సంపాదించాక, మిగిలినవారిలో కూడా కొందరికి ఆస్పత్రుల్లో పనిచేయటానికి మరింత ఆకర్షణీయమైన అవకాశాలు రావచ్చు. ఇంకొందరు స్పెషలైజ్డ్ పోస్టు గ్రాడ్యుయేట్ విద్య చేసే అవకాశం లభించి ఫ్యామిలీ ప్రాక్టీస్‌ను వీడవచ్చు. ఫ్యామిలీ ప్రాక్టీస్‌ను వీడే వారి వల్ల ఖాళీ అయ్యే స్థానాలను కొత్త ఎఫ్.పిలతో ఏటా భర్తీ చేస్తుంటారు. ఏటా 80,000 మంది కొత్త మెడికల్ గ్రాడ్యుయేట్లు ఆరోగ్య రంగంలో ప్రవేశిస్తున్నందున, వీరిలో దాదాపు 10-15 శాతం మందిని ఎఫ్.పిలుగా పనిచేయటానికి తేలిగ్గా ఆకర్షించవచ్చు. అత్యధికశాతం ప్రజానీకం ప్రాథమిక ఆరోగ్య అవసరాలను తీర్చటానికి ఇటువంటి వ్యవస్థ ఆచరణీయమైనది, సమర్థవంతమైనది.

(ఇంకా ఉంది...)











# లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి మద్దతివ్వండి

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని తెలంగాణ ఆరోగ్యమంత్రి హరీష్‌రావుకి అందించి రాష్ట్రంలో అమలు చేయాలని కోరినట్లు లోక్‌సత్తా పార్టీ నేతలు తెలిపారు. ఈ ఆరోగ్య విధానం గురించి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు ఆరోగ్య మంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జేపీతో మాట్లాడతానని చెప్పారన్నారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా మద్దతు తెలుపుతూ జేపీతో స్వయంగా మాట్లాడతానని తెలిపారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపీ నేత రఘునందనరావు సైతం ఈ విధానం అమలుకి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి కూడా ఆరోగ్య విధానం పట్ల సానుకూలంగా స్పందించారని లోక్‌సత్తా నేతలు సూర్యలక్ష్మి, మురళీధర్, శివరామకృష్ణ, సరోజాదేవి తదితరులు తెలిపారు. సమగ్ర ఆరోగ్య విధానం అమలుకి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ఉన్నతాధికారులు, వైద్యులు, అధ్యాపకులు, జర్నలిస్టులు, సినీ, ఇతర రంగాల ప్రముఖుల మద్దతు కోరే కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ నేతలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ తదితర నియోజకవర్గాల్లో కూడా నిర్వహించారు. జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఇందిరా శోభన్, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, దర్శకుడు దేవ కట్ట, జవహర్‌నగర్, మేడ్చల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పద్మావతి, 26వ డివిజన్ కార్పొరేటర్ (టీఆర్ఎస్) పానుగంటి బాబు, మల్కాజిగిరి వినాయకనగర్ రూ.10 డాక్టర్ రోజలిన్, రూ.50 డాక్టర్ (జవహర్‌నగర్) అబ్దుల్లా, సీనియర్ న్యూస్ ప్రజంటర్ దీప్తి వాజ్‌పేయి, సీనియర్ రిపోర్టర్ గోవర్ధన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గౌతమి, మేడ్చల్ జవహర్‌నగర్ మునిసిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి తదితరులను లోక్‌సత్తా పార్టీ నేతలు కలిసి సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు మద్దతు కోరారు.






















RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th March, 2022 Posting Date 15 &16th of every month



# ఇలాంటి రాజ్యాంగాన్ని ఈవేళ తయారుచేయటం కూడా అసాధ్యం

అధికారంలో ఒక పెద్ద వ్యవస్థను నడిపేటప్పుడు నిస్పృహ కలుగుతుంటుంది కొన్ని సందర్భాల్లో. ఆ నిస్పృహలో రాజ్యాంగాన్ని చించి పారేస్తే బాగుంటుంది, అదేదో వస్తే బాగుంటుంది అనిపిస్తుంది. కానీ ఏమొస్తే బాగుంటుంది?.. నేను నిశ్చయంగా చెప్పగలను - ఆనాడు గొప్ప నాయకులు, విశ్వసనీయత కలిగినవారు ఉన్నారు కాబట్టి ఈ దేశంలో అందరినీ ఒకే తాటిన నిలబెట్టి, దేశ భవిష్యత్తు పట్ల ఒకే రకమైన భావాల్ని మనసులో నింపి ఏకాభిప్రాయాన్ని సాధించారు. ఒక ఉదార స్వభావమున్న రాజ్యాంగాన్ని తీసుకొచ్చారు. ఈవేళ, అందంగా రూపొందించటం సంగతి అలా ఉంచండి, అసలు మీరు ఒక ఎలిగెంట్ రాజ్యాంగాన్ని, ఒక హేతుబద్ధమైన రాజ్యాంగాన్ని, అందరినీ కలిపేటటువంటి రాజ్యాంగాన్ని తయారుచేయటం కూడా అసాధ్యం. మరోవైపు.. చట్టసభల్లో మన చట్టాలు ఎలా తయారవుతున్నాయో చూడండి. చట్టాల్లోని లొసుగుల్ని, వైరుధ్యాల్ని నేను ఎన్నోసార్లు పార్లమెంటు కమిటీల ముందు బయటపెట్టాను. ఒక చట్టం రాయటమే చేతకావటం లేదు గానీ.. చట్టాలకు చట్టమైన ఒక గొప్ప రాజ్యాంగాన్ని కొత్తగా తయారుచేయటం సాధ్యమా?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678, B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678, B-106, PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**